అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 9 -3 -2018

సంపుటి : 4 సంచిక : 70 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

కూతురు ఆత్మగౌరవం..



- రాజస్థాన్ పర్యటనలో ప్రధాని మోడీ

వివరాలు 2లో

హదియా వివాహం చట్టసమ్మతమైందే



- స్వేచ్ఛగా తీసుకున్న నిర్ణయమే
- లవ్‌జిహాద్‌పై తార్కిక నిర్ధారణ చట్టపరంగా జరగాలి
- ఎన్ఐఏకు సుప్రీంకోర్టు సూచన

వివరాలు 2లో

కూర్చుందాం మాట్లాడుకుందాం



- బాబుకు మోడీ ఫోన్
- రాజీనామా చేసినా ఎన్‌డీఏలోనే : ఏపీ సీఎం

వివరాలు 2లో

కాల్పులు ఆపండి



సిరియాపై ఐరాస భద్రతా మండలి పిలుపు

వివరాలు 7లో

ముద్దాయిగా మోడీ సర్కార్



ముందుకు సాగని ఉభయ సభలు

- పీఎన్‌బీ స్కాంపై, హోదా, రిజర్వేషన్లపై విపక్షాలు పోరాటం
- వరుసగా నాలుగోరోజూ ఉభయసభలు వాయిదా
- ఉదయం గంటపాటు రిజర్వేషన్ బిల్లుపై చర్చ


వివరాలు 9లో

80 శాతం సబ్సిడీ..

ఎంబీసీలకు వ్యక్తిగత రుణాలు

- ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం
- కార్పొరేషన్‌కు ఈ బడ్జెట్‌లోనూ నిధులు
- స్వయం ఉపాధి పథకాలకు ఆర్థిక సహకారం

వివరాలు 9లో



కోనేరులో ముగ్గురు అన్నదమ్ములు మృతి

- జాతరకు వెళ్లిన కుటుంబంలో విషాదం

9లో

విగ్రహాలపై విధ్వంసకాండ

త్రిపురలో తాలిబన్‌ల బాటలోనే సంఘీయులు విగ్రహాలపై విధ్వంసకాండకు పాల్పడుతున్న హిందూత్వమూకల ఆగడాలకు బ్రేక్‌పడటంలేదు. త్రిపుర లెనిన్ విగ్రహాలతో మొదలైన అరాచకం తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడమేకాదు.. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలను కూడా వారు వదలడంలేదు. కేరళలో మహాత్మా గాంధీ, తమిళనాడు, యూపీలో అంబేద్కర్ విగ్రహాలపై తాజాగా దాడులకు తెగబడ్డారు.

కేరళలో గాంధీ, తమిళనాడు, యూపీలో అంబేద్కర్ విగ్రహాలపై దాడులు



వివరాలు 2లో

పీజీ వైద్య విద్యార్థులకు నో రూరల్ సర్వీస్

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీజీ పూర్తి చేసిన వైద్య విద్యార్థులు ఖచ్చితంగా ఏడాది పాటు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేయాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటి ంచారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబం ధించిన బిల్లు ప్రవేశ పెట్టనున్నట్టు వెల్లడించారు. ఈ నిర్ణయం ఈ ఏడాది నుంచే అమలు చేస్తామని, ఈ ఏడాది పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేయకున్నా, వారి విద్యార్హతల సర్టిఫికేట్లను రిజిష్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయం వల్ల డాక్టర్లను కార్పొరేట్ల వైపు పంపడమేనని, గ్రామీణ ప్రజలకు ఇబ్బందులేనని అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. మెడికల్ పీజీ పూర్తి చేసిన వారు విధిగా ఒక ఏడాది పాటు ...9లో



గురుకుల టీచర్లపై పోలీసుల జులుం

9లో

- ఈడ్చుకెళ్లిన పోలీసులు
- సొమ్మసిల్లి పడిపోయిన మహిళ
- అరెస్టు చేసిన పోలీసులు

కదం తొక్కిన ఆశాలు

ఏపీలో భారీ ప్రదర్శన

- పోలీసులకు, ఆశాలకు మధ్య తోపులాట
- ఎండకు సొమ్మసిల్లి పడిపోయిన ఆశావర్కర్లు
- మహిళాదినోత్సవం స్ఫూర్తితో పోరుబాట
- ఇష్టం వచ్చినట్టు పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం : కె ధనలక్ష్మి

వివరాలు 9లో





ముందే ముగిసిన బస్సుయాత్ర

అలకలు-అసంతృప్తులు

- పలువురు కాంగ్రెస్ నేతలు దూరం
- ప్రజలను కలవకపోవడంపై స్థానిక నాయకుల అసంతృప్తి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్ర అలకలు, అసంతృప్తుల మధ్య ముందే ముగిసింది. సీనియర్ నాయకులు, కీలకమైన నేతలు యాత్రలో పాలు పంచుకోక పోవడం, కొందరు అలక పూనడం వల్ల యాత్రను ముగించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంతో పాటు నేతల మధ్య ఐక్యత సాధించాలన్న లక్ష్యంతో బస్సుయాత్ర నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంపై సీనియర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా...గత నెల 17న బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ఉత్తమ్ వైఖరిపై పార్టీ సీనియర్లు అంతర్గత సమావేశాల్లోనూ, నాయకుల సంభాషణల్లోనూ తమ అసంతృప్తి వ్యక్తపరించారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 26న 'ప్రజా చైతన్య యాత్ర' పేరుతో చేవెళ్ల నుంచి యాత్ర ప్రారంభించారు. అప్పటికే మూడు రోజులపాటు విరామం ఇచ్చారు. తిరిగి నాలుగోవ తేదీన ప్రారంభమై...8న ముగించారు. యాత్ర ప్రారంభం రోజునే.. తొలి రోజు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సి కుంతియా, మాజీ ఎంపీ వి హనుమంతరావుకు వేదిక మీద కుర్చీలు దొరకక పోవడంతో.. తమకు అవమానం జరిగిందని కిందికి దిగారు. చివరకు వారికి సర్దిచెప్పి వేదికపైకి తీసుకెళ్లారు. ఆ తర్వాత ...9లో

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

- సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మోడీ సర్కార్ తూట్లు
- పెన్షనర్ల ధర్నాలో నేతలు
- సీపీఐ(ఎం) ఎంపీల సంఘీభావం

న్యూఢిల్లీ : దేశంలో పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్(ఏపీఆర్‌పీఏ) ప్రధాన కార్యదర్శి సుధాకర్ రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఆరోపించారు. గురువారం నాడిక్కడ పెన్షనర్లు, ముఖ్యంగా ఈపీఎస్-95 పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీఆర్‌పీఏ ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ జరిగింది. దేశంలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ఐదు వేల మంది పెన్షనర్లు ఈ ధర్నాలో పాల్గొన్నారు. సీపీఐ(ఎం) ఎంపీలు ఎ.సంపత్, శ్రీమతి టీచర్, ఎంబి రాజేష్, కెకె రాగేష్, పికె బిజూ, డీఎంకే ఎంపీ టి.కె ఇలంగవన్‌లు పెన్షనర్ల చలో పార్లమెంట్‌కు సంఘీభావం తెలిపారు. తొలుత స్థానిక మండిహౌస్ వద్ద ప్రారంభమైన ర్యాలీ వివిధ ప్రాంతాల మీదుగా పార్లమెంట్ వైపుగా బయలుదేరింది. అయితే బారకంభ రోడ్డు వద్ద పెన్షనర్లు ర్యాలీని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెన్షనర్లకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పెన్షనర్లు రోడ్డుపైనే మండుటెండలో బైఠాయించారు.

కూర్చుందాం.. మాట్లాడుకుందాం..

న్యూఢిల్లీ:ఆంధ్రప్రదేశ్ సీఎం,టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడారు. గురువారం సాయంత్రం 4-30 గంటల సమయంలో వీరిద్దరి మధ్యా ఫోన్ సంభాషణ 20 నిమిషాలపాటు జరిగినట్టు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం నుంచి ప్రధాని మోడీతో మాట్లాడేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. వీరిద్దరి మధ్యా ఫోన్ సంభాషణ జరిగినట్టు ప్రధానమంత్రి కార్యాలయవర్గాలు కూడా ధ్రువీకరించాయి. మంత్రుల రాజీనామాకు కొన్ని నిమిషాల ముందు ప్రధాని నుంచి చంద్రబాబుకు ఫోన్ వచ్చినట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి తమ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు ఎందుకు బయటకు రావాల్సి వస్తుందో ప్రధానికి చంద్రబాబు వివరించినట్టు చెబుతున్నారు. కూర్చొని మాట్లాడుకుందాం, తొందరపడొద్దని చంద్రబాబుతో ప్రధాని అన్నట్టు తెలుస్తోంది. మంత్రులు రాజీనామా చేసినప్పటికీ తమ పార్టీ ఎన్డీఏలో భాగస్వామిగా కొనసాగనున్నట్టు ప్రధానికి చంద్రబాబు తెలిపినట్టు చెబుతున్నారు.

సల్వార్ లేదా చీర మాత్రమే..!

- ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు డ్రెస్‌కోడ్
- రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయం



జైపూర్: రాజస్థాన్‌లో రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో నడిచే కళాశాలల్లో విద్యార్థులకు డ్రెస్‌కోడ్ అమలుపరచడం పై వసుంధర రాజే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజా ఆదేశాల ప్రకారం ఈ ఏడాది నుంచి ప్రభుత్వ కళాశాలల్లో అమ్మాయిలు సల్వార్ లేదా చీరను మాత్రమే ధరించాలి. అబ్బాయిలు షర్ట్, ప్యాంట్స్ మాత్రమే ధరించాలి. సీనియర్ అధ్యాపకులు, విద్యార్థి యూనియన్ ప్రతినిధులతో చర్చించి డ్రెస్‌కోడ్ కలర్‌ను ఎంపిక చేసి ఈ నెల 12లోగా నివేదిక సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ వ్యతిరేకించింది. విద్యార్థులు డిమాండ్ ప్రకారమే వారి గుర్తింపు కోసం డ్రెస్‌కోడ్ నిర్ణయాన్ని తీసుకున్నామని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి కిరణ్ మహేశ్వరి తెలిపారు.

మాంసం వద్దు.. శాఖాహారమే ఆరోగ్యం : రాజస్థాన్ విద్యాశాఖ పత్రిక మరో వివాదాస్పద వ్యాసం

దేశంలో ప్రజల ఆహారపు అలవాట్లు మార్చాలని కంకణం కట్టుకున్న బీజేపీ ఆ దిశగా ఒక్కో అడుగు ముందుకేస్తోంది. దీనిలో భాగంగానే రాజస్థాన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విద్యాశాఖ మాసపత్రిక 'శివిరా'.. వివాదాస్పద వ్యాసం ప్రచురించింది. 'మాంసాహారం తినొద్దు, దానివల్ల వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది, శాఖాహారం తినండి. ఆరోగ్యానికి మంచిది. తినడం, తాగడం ఉల్లాసంగా గడపడం విదేశీ సంస్కృతి. బతకుతూ బతికించడం మన దేశ సంస్కృతి. పర్యావరణాన్ని కాపాడాలంటే శాఖాహారమే తినాలి...' అంటూ మార్చి నెల పత్రికను వెలువరించింది. పాఠశాల ఉపాధ్యాయులను ఉద్దేశించి ఈ పత్రిక వెలువడుతుంది. రాజస్థాన్ విద్యాశాఖలో పనిచేసిన మాజీ అధికారి డా. మహవీర్ ప్రసాద్ గుప్తా దీనిని నిర్వహిస్తున్నారు. గతంలోనూ విద్యాశాఖ కొన్ని వివాదాస్పద వ్యాసాలు ప్రచురించి అబాసుపాలయ్యింది.

నా ముఖంపై ఉన్న మచ్చలు...

- ఇరుకైన మనస్తత్వపు ధోరణిని గుర్తు చేస్తున్నాయి
- యాసిడ్ అక్రమ అమ్మకాలు నిలిపివేయాలి : లక్ష్మీ అగర్వాల్



థానే (ముంబయి): 'నా ముఖంపై ఉన్న యాసిడ్ దాడి తాలూకా మచ్చలు.. సమాజంలోని మనుషుల ఇరుకైన మనస్తత్వపు దోరణిని గుర్తు చేస్తున్నాయి. దాడి జరిగాక జీవితం మళ్లీ శూన్యం నుంచి మొదలుపెట్టాల్సి వచ్చింది. ఒంటిపైన గాయాలు మండుతుంటే.. మిగతా వాటిపై దృష్టి సారించడం నరకం లాంటిది..' అని యాసిడ్ దాడి బాధితురాలు, మహిళల హక్కులపై గళమెత్తుతున్న టీవీ యాంకర్ లక్ష్మీ అగర్వాల్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా... మహారాష్ట్రలోని థానేలో మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడుల పట్ల వారిలో అవగాహన కలిగించే ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలుగా గర్వపడుతున్నామని, సమాజంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలన్నారు. అంతకు ముందుయాసిడ్ దాడి బాధితులతో కలిసి ర్యాంప్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాసిడ్ అక్రమ అమ్మకాలను నిలిపివేయాలనే క్యాంపెయిన్‌ను ప్రారంభించారు.

హోదాపై మీ బాస్‌నే అడగొచ్చుగా ?

బీహార్ సీఎం నితీశ్‌కు లాలూ ప్రశ్న


పాట్నా: బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని మీ బాస్(ప్రధాని మోడీ)నే అడగొచ్చుగా అంటూ రాష్ట్ర సీఎం నితీశ్‌కుమార్‌ను ఆర్జేడీ నేత లాలూప్రసాద్ యాదవ్ ప్రశ్నించారు. దాణా కుంభకోణం కేసులో రాంచి జైలులో శిక్షననుభవిస్తున్న ఆయన ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై జాతీయ స్థాయిలో కొంతకాలంగా ఆసక్తికర చర్చ నడుస్తోన్న సంగతి తెలిసిందే. అయితే.. ఏపీ పట్ల మోడీ సర్కారు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ కేంద్ర క్యాబినెట్ నుంచి బయటకు వస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి ప్రకటించారు. ఈ క్రమంలో..ఏపీ ప్రజల డిమాండ్‌ను సమర్థిస్తూ.. బీహార్‌కు కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని అధికార పార్టీ జేడీ(యూ) వెల్లడించడం చర్చాంశనీయమైంది. దీంతో నితీశ్‌పై లాలూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముజఫర్‌పూర్‌లో పర్యటించిన మోడీ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ, మోడీ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని తెలిపారు. ముజఫర్‌పూర్ ర్యాలీలో మాట్లాడిన వాయిస్ రికార్డును మోడీకి వినిపించడంతో పాటు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేయాలని నితీశ్‌కు సూచించారు. నితీశ్ తన స్వలాభం కోసం రాష్ట్ర ప్రయోజనాలకు తాకట్టు పెట్టారని విమర్శించారు.

పార్టీ కార్యాలయమే నివాస గృహం

అధికార గృహం ఖాళీ చేసిన మాణిక్ సర్కార్



అగర్తల : పదవీ విరమణ చేస్తున్న త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ గురువారం నాడు తన అధికార నివాసాన్ని ఖాళీ చేసి పార్టీ రాష్ట్ర కమిటీ కార్యాలయానికి మారారు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలించిన మాణిక్ సర్కార్ ఇప్పుడు తన అధికార నివాసం 'మార్క్స్ ఏంజెల్స్ సరణి' ని విడిచి 500 మీటర్ల దూరంలో వున్న పార్టీ కార్యాలయంలోకి మకాం మార్చారని పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బిజన్‌ధర్ చెప్పారు. మాణిక్ సర్కార్ తన సతీమణి పాంచాలీ భట్టాచార్యతో కలిసి పార్టీ కార్యాలయంలోని అతిథిగృహంలోని ఒక గదిలో నివసిస్తారని తెలిపారు. పార్టీ ఆఫీసు వంటగదిలో వండిన ఆహార పదార్థాలనే వారు కూడా భుజిస్తారని పార్టీ కార్యాలయ కార్యదర్శి హరిపాద దాస్ వివరించారు. ఇప్పటికే తన దుస్తులు, పుస్తకాలు, సిడీలను పార్టీ ఆఫీసుకు పంపారని ఆయన చెప్పారు. తన దగ్గర ఉన్న మార్క్సిస్టు సాహిత్యం, కొన్ని పుస్తకాలను పార్టీ కార్యాలయంలోని గ్రంథాలయానికి, బీర్‌చంద్ర సెంట్రల్ గ్రంథాలయానికి అందజేయనున్నట్టు పాంచాలి భట్టాచార్య తెలిపారు. మాణిక్ సర్కార్ దంపతులకు సంతానం లేని విషయం తెలిసిందే.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒడిషా సముద్రతీరంలో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ శిష్యులు రూపొందించిన కళాఖండం

విగ్రహాలపై విధ్వంసకాండ

కన్నూర్ : కేరళలోని కన్నూర్‌లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహంపై గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో దాడి జరిగింది. గాంధీ కళ్లజోడుతో పాటు, మెడలోని దండను వారు ధ్వంసం చేశారు. బ్రౌన్ కలర్ షర్ట్, కాషాయ రంగు లుంగీ ధరించి ఉన్న ఒక వ్యక్తిని తాము చూశామని స్థానికులు చెబుతున్నారు. అటుగా వెళుతున్న ఓ వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో నిందితుల ఫొటోలను కూడా తీశాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తి అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అతడిని ప్రశ్నిస్తున్నామని చెప్పారు.

అంబేద్కర్ విగ్రహంపై పెయింట్..

తమిళనాడు రాజధాని చెన్నైకి సమీపంలోని తిరుఒట్టియూరులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు అవమానించారు. విగ్రహంపై ఎర్ర రంగు పెయింట్ పోసి పారిపోయారు.



నిందితులను గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. అక్కడి సమీపంలోని సీసీ టీవీలను పరిశీలిస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

యూపీలో గత రెండు రోజుల్లో నాలుగు విగ్రహాలు

ఉత్తరప్రదేశ్‌లో గత రెండు రోజుల్లో నాలుగు అంబేద్కర్ విగ్రహాలపై దాడులు జరిగాయి. అలీగఢ్, మీరుట్ జిల్లాల్లో ఈ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మీరుట్‌లోని మెవానా ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో ఆ ప్రాంత దళితులు ఆందోళనకు దిగారు. గత రెండు రోజులుగా నాలుగు విగ్రహాలను ధ్వంసం చేసినట్టు వార్తలందాయి.

ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

దేశవ్యాప్తంగా పలుచోట్ల విగ్రహాలపై జరుగుతున్న విధ్వంసకాండ నేపథ్యంలో దేశరాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఢిల్లీ పోలీసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. అప్రమత్తంగా ఉండాల్సిందిగా పలు పోలీస్ స్టేషన్లను ఆదేశించారు.

కూతురు ఆత్మగౌరవం..

- రాజస్థాన్ పర్యటనలో ప్రధాని మోడీ
- 'బేటీ బచావో-బేటీ పడావో' దేశమంతటా విస్తరణ

జైపూర్: తల్లిదండ్రులకు కూతుళ్లు భారం కాదని, వారు ఆత్మ గౌరవమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రాజస్థాన్‌లోని ఝున్‌ఝులో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. 'బేటీ బచావో బేటీ పడావో' పథకాన్ని దేశమంతటా(640 జిల్లాల్లో) విస్తరింపజేస్తున్నట్టు ప్రకటించారు. కొత్తగా 'నేషనల్ న్యూట్రిషన్ మిషన్(ఎన్ఎన్ఎం) పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కూతుళ్లు నిర్లక్ష్యానికి గురౌతున్నారని, వారిని చంపివేస్తున్నారని చెప్పారు. ఇది సమాజంలో అసమానత్వానికి దారి తీస్తున్నదని తెలిపారు.

అయితే.. మార్పు ఒక్కసారిగా రాదని, ఇది కొంత సమయం తీసుకుంటుందని వెల్లడించారు. ఆడ శిశువులకు మగవారితో సమానంగా చూడాలన్నారు. ఆడ పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక ఉద్యమాన్ని చేపట్టాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు. బేటీ బచావో బేటీ పడావో పథకం.. హర్యానాలో లింగ నిష్పత్తి పెరిగేందుకు దోహదపడిందని మోడీ వెల్లడించారు. 2015 జనవరి 22న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం ప్రస్తుతం 161 జిల్లాలో అమలవుతున్నది.

ప్రతిపక్షాలతో కొన్ని వివరాలను పంచుకుంటే..

మాకు అభ్యంతరమేమీ లేదు

రఫేల్ డీల్‌పై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్



న్యూఢిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంలోని రహస్య క్లాజ్‌లో భాగంగా ఉన్న కొంత సమాచారాన్ని ప్రతిపక్షాలతో పంచుకుంటే తమకు అభ్యంతరం లేదని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తెలిపారు. ఫ్రాన్స్ తయారీ రఫేల్ యుద్ధ విమానాలను భారత్ కొనుగోలు చేసే ఒప్పందంపై ఇరు దేశాలు 2016, సెప్టెంబర్ 23న సంతకాలు చేశాయి. ఫ్రాన్స్ నుంచి భారత్ కొనుగోలు చేయనున్న 36 రఫేల్ జెట్ విమానాల ధర 7.878 బిలియన్ యూరోలు(దాదాపు రూ.58 వేల కోట్లు)గా నిపుణుల అంచనా. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన అంశాలను మోడీ ప్రభుత్వం దాచి పెట్టడాన్ని కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు తప్పు పట్టాయి. ఈ ఒప్పందంలో పెద్దమొత్తంలో అవినీతి జరిగిందని, ప్రధాని మోడీకి వ్యక్తిగతంగా ప్రమేయమున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు.

శుక్రవారం భారత్‌కు రానున్న సందర్భంగా ఈ ఒప్పందంపై ఇండియా టుడే అడిగిన ప్రశ్నలకు మేక్రాన్ సమాధానమిచ్చారు. ఆర్థిక, పారిశ్రామిక,వ్యూహాత్మక అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇరు దేశాలు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు ఆయన తెలిపారు. ఇరు దేశాల అభీష్టం మేరకే ఈ ఒప్పందం జరిగినప్పటికీ, దీనిపై సంతకాలు చేసింది తన హయాంలో కాదని మేక్రాన్ తెలిపారు. ఏదైనా ఒప్పందంలో వాణిజ్య అంశాలు ఉన్నపుడు సున్నితమైన వివరాలను బహిర్గతం చేయలేమని ఆయన అన్నారు. వాణిజ్యపరంగా పోటీ కంపెనీలకు వివరాలు తెలిసినపుడు ఆటంకం కల్పిస్తాయని, అందువల్ల రహస్యంగా ఉంచడం న్యాయమైనదేనని మేక్రాన్ అభిప్రాయపడ్డారు. వాణిజ్య ఒప్పందంలో సాంకేతిక అంశాలున్నందున రహస్య క్లాజ్ ఉన్నదని ఆయన తెలిపారు. ప్రతిపక్షాల అనుమానాలను నివృత్తి చేయడానికి, రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడానికి రహస్య క్లాజ్‌లోని కొన్ని వివరాలను మోడీ ప్రభుత్వం వారితో పంచుకున్నా తమకు అభ్యంతరం లేదని మేక్రాన్ స్పష్టం చేశారు. రానున్న కాలంలో రక్షణపరమైన సంసిద్ధతకు రఫేల్ ఒప్పందం కీలకమని ఆయన అన్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ రంగంలో సహకారానికి ఇది సమగ్ర ఒప్పందమని మేక్రాన్ అన్నారు.

యూపీఏ-2 హయాం నుంచే రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుపై చర్చలు సాగుతున్న విషయం గమనార్హం. ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ కంపెనీ నుంచి ఈ విమానాల కొనుగోలు కోసం పదేండ్లుగా సంప్రదింపులు జరుగుతున్నాయి. చివరికి మోడీ ప్రభుత్వం ఈ ఒప్పందంపై సంతకాలు చేసింది. అయితే, ఈ యుద్ధ విమానాల ఒప్పందానికి సంబంధించిన వివరాలన్నీ మోడీ ప్రభుత్వం మొదటి నుంచి గోప్యంగా ఉంచుతున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఒక్కో యుద్ధ విమానానికి ఎంత ధర నిర్ణయించారని అడిగితే కూడా చెప్పడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించడం పట్ల కాంగ్రెస్‌సహా ప్రతిపక్షాల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యూపీఏ హయాంలో ఈ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)కు బాధ్యత అప్పగించారు. రక్షణ పరికరాల తయారీలో ఐదు దశాబ్దాలకుపైగా దస్సాల్ట్ కంపెనీతో కలిసి పని చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉన్నది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం మాత్రం ఈ ఒప్పందంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌కు భాగస్వామ్యం కల్పించింది. రక్షణ పరికరాల తయారీలో రిలయన్స్ కంపెనీకి ఏమాత్రం అనుభవం లేదని నిపుణులు చెబుతున్నారు. దీంతో, ఓ ప్రయివేట్ కంపెనీకి రూ.29,000 కోట్లమేర లబ్ది చేకూర్చేందుకే మోడీ ప్రభుత్వం ఈ ఒప్పందంలో మార్పులు చేసిందన్న విమర్శలున్నాయి. యూపీఏ హయాంలో ఒక్కో యూనిట్‌కు రూ.629 కోట్లుగా నిర్ణయించారు. అయితే, ఆ ఒప్పందంలో 126 యుద్ధ విమానాల కొనుగోలుకు నిర్ణయించగా మోడీ ప్రభుత్వం దానిని పక్కన పెట్టి కొత్తగా మరో ఒప్పందం కుదుర్చుకున్నది. మోడీ ప్రభుత్వ ఒప్పందం ప్రకారం యూనిట్ ధర(విడి భాగాలతో కలిపి) రూ.1611 కోట్లు. 36 జెట్లకు రూ.58,000 కోట్లు. యూపీఏ ధర ప్రకారమైతే 36 జెట్లకు రూ.22,644 కోట్లు. అంటే..మోడీ ప్రభుత్వం యూపీఏకన్నా రూ.35,356 కోట్లు అదనంగా చెల్లించేందుకు నిర్ణయించినట్టు. అందువల్లే ఇందులో అవినీతి దాగి ఉన్నదంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

న్యాయవ్యవస్థలో ఇప్పటికీ పురుషాధిక్యతే..!

సుప్రీంలో 1 శాతం మాత్రమే మహిళా న్యాయమూర్తులు

న్యూఢిల్లీ: భారత న్యాయవ్యవస్థలో ఇప్పటికీ పురుషాధిక్యతే రాజ్యమేలుతోందని సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థలో మహిళా న్యాయమూర్తులకు మరింత ఎక్కువగా స్థానం కల్పించేందుకు అవసరమైన సూచనలతో మహిళా న్యాయవాదుల సంఘం న్యాయమూర్తి జెఎస్ ఖెహార్ నేతృత్వంలోని ధర్మాసనానికి 2015లో ఒక వినతిపత్రం సమర్పించినట్టు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రుమాపాల్ చెప్పారు. దిగువ స్థాయి న్యాయస్థానాలలో దేశవ్యాప్తంగా 27 శాతం మేర మహిళా న్యాయమూర్తులున్నారని, హైకోర్టు వంటి ఉన్నత స్థాయిలో పది శాతం మంది వుండగా సర్వోన్నత న్యాయస్థానంలో ఈ సంఖ్య 1 శాతం కన్నా తక్కువగా వుందని మహిళా న్యాయవాదుల సంఘం తన వినతిపత్రంలో వివరించింది. దేశ న్యాయవ్యవస్థలో మహిళా సాధికారికతకు అవకాశం కల్పిస్తూ మహిళా న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వుందని స్పష్టం చేసింది.

ఎన్ని'కల' బడ్జెట్..!

ఏపీ బడ్జెట్ రూ.1,91,063.61

- డ్వాక్రా, రైతు రుణమాఫీ ప్రశ్నార్థకం నిరుద్యోగ భృతికి అరకొర నిధులు
- కేటాయింపుల్లో కనిపించని రాజధాని



బడ్జెట్ ప్రవేశపెడుతున యనమల

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,91,063.61 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి సాయం అందడం లేదని.. విభజనలో ఆదాయాన్ని, రాజధానిని కోల్పోవడం రాష్ట్రానికి తీరని నష్టం కలిగించిందన్నారు. అసమజసంగా జరిగిన విభజన వల్లే రాష్ట్రానికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కేంద్రం నుంచి సకాలంలో అందని సాయం సమస్యను మరింత జటిలం చేసిందన్నారు. రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించడం ముదావహమన్నారు. నిస్పృహ నుంచి ఆశ, భ్రమల నుంచి విశ్వాసం, నిరాదరణ నుంచి అభివృద్ధి దిశగా రాష్ట్రం పయనం సాగిస్తోందన్నారు.

తెలుగుదేశం పార్టీ అయిదేండ్ల పాలనకు పూర్తిస్థాయి, చివరి బడ్జెట్ ఇది. దీంతో సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు చూపారు. కావాల్సిన రంగాలకు కేటాయింపులు తగ్గించారు. ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్టేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాగే రుణమాఫీకి కేటాయించిన నిధులు సరిపోవంటున్నారు. డ్వాక్రా రుణమాఫీకి ఇప్పటికే సుమారు రూ.2400 కోట్ల చెల్లింపుల బకాయి ఉంది. తాజాగా అందుకు రూ.1460 కోట్లే కేటాయించారు. రైతు రుణమాఫీకి సుమారు రూ.10 వేల కోట్లు అవసరం కాగా రూ.4,100 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే ఈ ఏడాదీ రుణమాఫీ హామీలు నెరవేరేటట్టే కనిపించడం లేదు. అధికారంలోకొచ్చిన సమయంలో మొత్తం రూ. 82 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని, అనంతరం దాన్ని రూ.24 వేల కోట్లకు కుదించారు. ఇటీవల చెల్లించినవి పోను ఇంకా రూ.17 వేల కోట్ల రుణాలున్నాయి. ప్రస్తుత బడ్జెట్లో రూ.4100 కోట్లు మాత్రమే కేటాయించారు. మిగిలిన బకాయిల మాట ప్రస్తావన లేదు. డ్వాక్రా రుణమాఫీ కూడా సుమారు రూ.12 వేల కోట్ల వరకు ఉంది. వడ్డీలేని రుణాలకు రూ.1700 కోట్లు కేటాయించారు. ఇవి ఏ మూలకూ సరిపోవు. మొత్తం రూ. 1,91,063 కోట్ల అంచనాగల తాజా బడ్జెట్లో పలు కీలక రంగాలకు నిధుల కేటాయింపుల్లో స్పష్టత కనిపించడం లేదు.

నిరుద్యోగులు ఎదురు చూస్తున్న భృతికి నిధుల కేటాయింపులో తగినంత ప్రాధాన్యత లేకుండా రూ.1000 కోట్లే కేటాయించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని, లేకుంటే రూ. 2వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాది చివరినాటికి తొమ్మిది లక్షల ఇళ్లను నిర్మిస్తామంటూ అందుకు రూ.3679 కోట్లు కేటాయించారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలంటే కనీసం రూ.20 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయి. నీటిపారుదల రంగానికి రూ.14,000 కోట్లు కేటాయించారు. దీంట్లో ఒక్క పోలవరానికి రూ.9వేల కోట్లు చూపారు. మిగిలిన ప్రాజెక్టులన్నిటికీ కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే కేటాయింపులున్నాయి. కాంక్రీటు నిర్మాణాలకేగాని, ప్రాజెక్టుల నిర్వాసితులకు పునరావాసం ప్రస్తావన చేయలేదు. పోలవరం పునరావాసానికి రూ.32 వేల కోట్ల వరకూ ఖర్చవుతుందని కేంద్రానికి నివేదిక పంపించారు. దానికి అనుమతి రాలేదు. కాంక్రీటు నిర్మాణాలన్నీ పూర్తి చేసే విధంగా నిధులు కేటాయింపు చేయడం పట్ల ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను తరిమేయడమే ధ్యేయంగా ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ప్రాజెక్టు పూర్తి చేసే ముందే పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. ఆ ఆలోచన ఎక్కడా బడ్జెట్లో కనిపించలేదు.

ఆ వివాహం చట్టసమ్మతమైందే

- హదియా స్వేచ్ఛగా తీసుకున్న నిర్ణయమే
- లవ్‌జిహాద్‌పై తార్కిక నిర్ధారణ చట్టపరంగా జరగాలి
- ఎన్ఐఏకు సుప్రీంకోర్టు సూచన



న్యూఢిల్లీ:కేరళ యువతి హదియా వివాహం షఫీన్‌జహాన్‌తో చట్టసమ్మతమైనదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారిద్దరి మధ్య అనుబంధం స్వేచ్ఛగా, సమ్మతితో తీసుకున్న నిర్ణయమేనని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. గతంలో వీరి వివాహాన్ని రద్దు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

సిరియాకు చెందిన ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల ప్రమేయంతో నిర్వహిస్తున్న లవ్‌జిహాద్‌లో భాగంగా ఆమెపై ఒత్తిడి చేసి మతాంతర వివాహానికి ఒప్పించారన్న పిటిషన్‌పై కేరళ హైకోర్టు విచారణ జరిపిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలను ప్రశ్నిస్తూ షఫీన్‌జహాన్‌తోపాటు హదియా సుప్రీంకోర్టును ఆశ్రయించగా పలు దఫాలుగా విచారణ అనంతరం ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెల్లడించింది.

లవ్‌జిహాద్ కేసుల్లో భాగంగా హదియా వివాహానికి సంబంధించిన అంశంపై జాతీయ దర్యాప్తు ఏజెన్సీ(ఎన్ఐఏ) పరిశోధన జరుపుతోంది. దాంతో, లవ్‌జిహాద్‌పైనా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తార్కిక నిర్ధారణకు రావడానికి ముందు చట్టపరంగా జాగ్రత్తగా పరిశీలించాలని ఎన్ఐఏకు సూచించింది. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టుకు ఎన్ఐఏ స్థాయీ నివేదికను సమర్పించింది.

తన కూతురిని సెక్స్ బానిసగా లేదా మానవ బాంబుగా ఉపయోగించేందుకు సిరియా తరలించాలన్న ఉగ్రవాదుల కుట్రను తాను అడ్డుకున్నానంటూ వారంరోజుల క్రితం విచారణ సందర్భంగా హదియా తండ్రి అశోకన్ సుప్రీంకోర్టుకు చెప్పారు. తన కూతురు ప్రమాదకరంగా తయారయ్యారని, అపరిచిత వ్యక్తులకు ఆశ్రయమిస్తున్నారని కూడా అశోకన్ కోర్టు ముందు సాక్ష్యమిచ్చారు. అయితే, ఈ ఆరోపణలను హదియా ఖండించారు. తాను స్వేచ్ఛగానే అధ్యయనం చేసి ఇస్లాంను స్వీకరించానని, ఇష్టంతోనే షఫీన్ జహాన్‌ను పెండ్లి చేసుకున్నానని హదియా కోర్టుకు తెలిపారు. షఫీన్‌ను ఉగ్రవాదిగా ఎన్ఐఏ నిర్ధారించడాన్ని ఆమె ఖండించారు.

గౌరవం, హోదాల్లోనూ వివక్ష

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి

- ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : ఎస్.రమ



నవతెలంగాణ - సిటీబ్యూరో

మున్సిపల్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులు వేతనాలు, సామాజిక గౌరవం, హోదా తదితర అనేక విషయాల్లో వివక్షతకు గురవుతున్నారనిప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ రంగంలో అధిక సంఖ్యలో పనిచేస్తున్న మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్-టీఎండబ్ల్యూ అండ్‌ఈయూ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. 'స్త్రీలపై జరుగుతున్న దోపిడీ, దాడులను, వివక్షతలను ఎదిరిద్దాం' నినాదంతో 'మహిళా హక్కులతోనే మానవ హక్కుల సాధ్యం' అంశంపై జరిగిన సదస్సుకు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పి.లోకేశ్వరి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ప్రొ.సుజాత మాట్లాడుతూ.. ఉద్యమాల్లో ముందుండి పోరాటం చేస్తేనే మహిళలు తమ హక్కులను సాధించుకోగలరని చెప్పారు. మున్సిపల్ కార్మికులు వేతనాలు, సామాజిక గౌరవం, హోదా తదితర అనేక విషయాల్లో వివక్షతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ గ్రూపులో నాయకత్వ బాధ్యతలను చేపట్టాలని సూచించారు. ఆయనకు బదులు..ఆమెనే కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని చెప్పారు. దీంతో నాయకత్వ లక్షణాలు పెంపొంది మహిళా నాయకులుగా ఎదగడానికి దోహదం చేస్తుందని అన్నారు. సమాజంలో సన్మానం, గౌరవం దక్కాల్సిన జాబితాలో మున్సిపల్ రంగంలో పనిచేసే మహిళలే ముందు వరుసలో ఉంటారని తెలిపారు.

శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సీఐటీయూ) రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికచట్టాలను నీరుగార్చాయని అన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రంలో నరేంద్రమోడీ నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఖమర్ అలీ మాట్లా డుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రచారానికి వాడుకుంటున్నాయని విమర్శించారు. మహిళా హక్కులపై దృష్టిసారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎండబ్ల్యూ అండ్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పాల కులు మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారని, వారిని ఓట్లేసే యంత్రాలుగానే భావిస్తున్నారని అన్నారు. మున్సి పల్ రంగంలో అత్యధిక సంఖ్యలో పనిచేస్తున్న దళిత మహి ళల పట్ల మరింత వివక్షతను ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎండబ్ల్యూ అండ్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి.మంగపతి, రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యాదమ్మ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్రేగుతున్న హింస : డాక్టర్ రమాదేవి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి: నవీకరణ ప్రపంచంలో కూడా మహిళలపై హింస నానాటికీ పెట్రేగుతోందని గాంధీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా **నవతెలంగాణ** మహిళా ఉద్యోగులనుద్దేశించి ఆమె సంస్థ కార్యాలయంలో జరిగిన సభలో మాట్లాడారు. ఆడపిల్లల పుట్టుక గురించి ఆందోళనకర పరిస్థితులు తలెత్తుతున్నాయనీ, ఈ దుస్థితి కేవలం పేదకుటుంబాల్లోనే కాదు, సంపన్న కుటుంబాల్లో కూడా ఉందని పాపులేషన్స్ సర్వేలో వెలుగుచూసిన అంశాన్ని పేర్కొన్నారు. అంతే కాదు, సరోగసీ తల్లుల ప్రక్రియ కూడా మహిళలమీద తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పేదకుటుంబాల్లోని మహిళలు సంపన్న కుటుంబాల చేతుల్లో పావులుగా చిక్కుకుపోతున్న స్థితి ఉందని వివరించారు. జీవనోపాధి కోసం సామాన్య కుటుంబాల్లోని మహిళలు చిన్నా చితకా పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అటు ఇంటిపనుల్లో యిటు బయట వెట్టిచాకిరీలో వారు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. దీనివలన చిన్న వయస్సులోనే వారు అనారోగ్య పాలవుతున్నారని ప్రస్తావించారు. ఆరోగ్య సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలను వివరించారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా వివిధ రంగాల్లోకి దూసుకొస్తున్న మహిళల సంఖ్య గణనీయంగానే ఉంది. అడ్డంకులు కూడా అంతకంటే రెట్టింపు స్థాయిలో ఉంటున్నాయి. ప్రశ్నిస్తున్న వారిని వస్త్రధారణ పేరుతో వెనక్కి నెట్టే పరిస్థితి ఉంది. అయినా మహిళలంతా చైతన్యవంతులు కావాలి.. ప్రతిఘటనే లక్ష్యంగా ఉండాలి. ప్రభుత్వరంగంలో విద్యా వైద్యం, చదువూ ఉద్యోగాలూ భద్రత ఉంటేనే ప్రజల జీవితాల్లో మార్పు వస్తుంది. అందుకు ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా ముందుకు కదలాలి... అని హితవు పలికారు. సభకు అధ్యక్షత వహించిన నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ జి. రాజకుమారి మహిళా దినోత్సవం ప్రాధాన్యత వివరించారు. వేదికపైకి వక్తలను పద్మ ఆహ్వానించగా, స్వాతి వందన సమర్పణ చేశారు. తొలుత జరిగిన జండా వందన కార్యక్రమంలో ఉద్యోగులంతా పాల్గొన్నారు. డాక్టర్ రమాదేవి జండా ఆవిష్కరించారు.

హక్కుల సాధనకు ఐక్య ఉద్యమం ప్రొఫెసర్ మాధవి

మహిళలు తమ హక్కుల సాధనతో పాటు ప్రస్తుతమున్న వాటిని చట్టాలనూ రక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని ప్రొఫెసర్ మాధవి పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నా పాలకుల నిర్లక్ష్యంతో అవి అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ, ఐద్వా, టీఎస్‌యూటీఎఫ్ (ఎన్ఎఫ్‌డబ్ల్యూటీ) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవి మాట్లాడుతూ... మహిళా దినోత్సవం, వాలంటైన్ డేకు తేడా లేకుండా పోతుందని అన్నారు. కొందరు సంబురాలు చేసుకుంటున్నారని తెలిపారు. నిర్భయ ఘటన దేశవ్యాప్తంగా ప్రచారం జరిగిందనీ, పెద్దఎత్తున నిరసనలు జరిగాయనీ గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు దేశంలో అనేకం జరుగుతున్నా ఆ స్థాయిలో ప్రచారం జరగడం లేదనీ, కొన్నింటిని ఎక్కడిక్కడ తొక్కిపెడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ మహిళలు స్వతంత్ర్యంగా ఆలోచించే స్థితి లేదన్నారు. మహిళలకు సమాన గౌరవం, హుందాగా జీవించే హక్కు ఉండాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ...ప్రపంచంతో పాటు దేశంలో జరిగిన అనేక ఉద్యమాల్లో మహిళలు కీలక పాత్ర పోశించారని అన్నారు. ఎవరి దయాదాక్షిన్యాల ద్వారా హక్కులు రాలేదనీ, పోరాటాల ఫలితంగా సాధించుకున్నామని తెలిపారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శారద, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పద్మశ్రీ మాట్లాడారు

అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి డాక్టర్ విజయలక్ష్మి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి డాక్టర్. బివి. విజయలక్ష్మి పిలుపునిచ్చారు. తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఏఐటీయూసీ), భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అంతకు ముందు మఖ్దూం భవన్ నుంచి ఏఐటీయూసీ కార్యాలయం వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విజయలక్ష్మీ మాట్లాడుతూ గత 43 ఏండ్లుగా మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము కానీ ఆశించిన స్థాయిలో చైతన్యం రావడం లేదన్నారు. మహిళా దినోత్సవం అంటే మహిళా ఉద్యోగులు ఇండ్లల్లో విశ్రాంతి తీసుకోవడం కాదని, అట్టడుగున ఉన్న మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అధ్యయనం చేయాలని కోరారు. శ్రామిక మహిళా ఫోరం అధ్యక్షులు ప్రేమ్‌పావని మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్దతిలో వివిధ సంస్థల్లో వేలాది మంది మహిళలు పని చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి, ప్రధాన కార్యదర్శి ఉస్తేల సృజన్, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ ఎన్. కరుణకుమారి, మెడికల్ కాంట్రాక్టు యూనియన్ నాయకులు లక్ష్మీ, కృష్ణమ, హసినా, యాదమ్మ, వరమ్మ, అంజుమ్, సక్రీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి జీబ్రానిక్స్ కంపెనీకి చెందిన అధిక సామర్థ్యం గల పవర్ బ్యాంకులు



న్యూఢిల్లీ: ఐటీ పరికరాల ఉత్పత్తులు సరఫరా చేసే ప్రముఖ కంపెనీ జీబ్రానిక్స్ ఇండియా.. అత్యధిక సామర్థ్యం గల పవర్‌బ్యాంకులను అందు బాటులోకి తెచ్చింది. 10,000, 15,000, 20,000ఎంఏహెచ్ సామ ర్థ్యాలతో జడ్‌ఈబీ-పీజీ 10000డీ, జడ్‌ఈబీ-వీజీ15000డీ, జడ్‌ఈబీ-పీజీ20000డీ సిరీస్ పవర్ బ్యాంకులను ప్రవేశపెట్టింది. ఒకే సారి రెండు పరి కరాలను ఛార్జింగ్ చేయడానికి వీలుపడేలా వీటిని రూపొందించింది. ఇవి డీసీ5వీ 2ఏ ఇన్‌పుట్, డీసీ5వీ 2ఏ ఔట్‌పుట్‌కు ఈ పవర్‌బ్యాంకులు సపోర్ట్ చేస్తాయి. వీటిపై ఇంటెలిజెంట్ ఇన్ఫర్మేటివ్ డిజిట ల్ డిస్ప్లే ఏర్పాటు చేశారు. ఔట్ పుట్ షార్ట్, ఓవర్ చార్జ్, ఓవర్ డిశ్చార్జ్‌లతో పాటు షార్ట్ సర్క్యూట్ నుంచి రక్షణ కల్పించే పలు భద్రతా ప్రయోజనాలు తమ పవర్ బ్యాంకులు కలిగి ఉన్నాయని వాటిని ప్రవేశపెడుతూ జీబ్రానిక్స్ డైరెక్టర్ ప్రదీప్ దోషీ తెలిపారు. ఈ పవర్ బ్యాంకులు దేశవ్యాప్తంగా అన్ని రిటైల్‌స్టోర్‌లలో అందుబాటులోకి వచ్చాయి.

హైకోర్టు 'గ్రేటర్' స్టాండింగ్ కౌన్సిల్‌గా వెంకటేశ్వర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రముఖ న్యాయవాది ఎల్.వెంకటేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 103ను విడుదల చేసింది. ఆయన చార్జీ తీసుకున్నప్పటి నుంచి మూడేండ్లపాటు ఈ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈమేరకు న్యాయ, శాసన వ్యవహారాల ప్రభుత్వ కార్యదర్శి జస్టిస్ వి. నిరంజన్‌రావు ఆదేశాలు జారీచేశారు.

నిర్బంధ కాలంలోనూ ఎర్రజెండానే అంటిపెట్టుకుని...





- శారదాంబ మరణంపట్ల రాఘవులు, తమ్మినేని సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు కె.కృష్ణమూర్తి సతీమణి శారదాంబ (90) మరణంపట్ల సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శారదాంబ భౌతికకాయాన్ని సందర్శించిన వారు అరుణ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. నిర్బంధకాలంలో సైతం శారదాంబ పార్టీనే అంటిపెట్టుకుని ధృడంగా నిలబడ్డారని గుర్తుచేశారు. వారి కుటుంబం మొత్తం పార్టీకి అండగా నిలబడిందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆమె మరణించటం యాధృచ్ఛికమేనని అన్నారు. మహిళాలోకమంతా ఆమె స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తమ్మినేని మాట్లాడుతూ శారదాంబ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. సాయుధ పోరాటకాలం నుంచి నేటి వరకూ ఆమె పార్టీకి అండగా నిలబడ్డారని నివాళులర్పించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, బి.వెంకట్, తెలంగాణ సాయుధ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సాగర్, నగర కార్యదర్శి ఎమ్.శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

రైతు సంఘం, వ్యకాస సంతాపం

శారదాంబ మరణంపట్ల తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.జంగారెడ్డి, కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్య క్షులు బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నారాయణ స్కూల్స్, ఓరియంట్ బ్లాక్ స్వాన్ ఆధ్వర్యంలో... స్పెల్ బీ కాంటెస్ట్

- ముఖ్య అతిథిగా హర్షాబోగ్లే

హైదరాబాద్: విద్యార్థులను తాము కోరుకున్న రంగం వైపు నడి పిస్తూ... ఇంగ్లీష్ భాష పట్ల పట్టు సాధించడానికి వారికవసరమైన స్ఫూర్తిని నింపేందుకు.. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్, ఓరియంట్ బ్లాక్ స్వాన్ ఆధ్వ ర్యంలో 'స్పెల్ బీ కాంటెస్ట్' నిర్వహించనున్నట్టు నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా.పి. సింధూర నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షాబోగ్లే దీనిని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని నారాయణ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యా ఇందులో పాల్గొననున్నారు. మొత్తం 4 దశల్లో.. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో పోటీ ఉంటుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి. సింధూర నారాయణ, డైరెక్టర్ కె.పునీత్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొననున్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయనున్నారు.

బెంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ అంటేనే భయపడుతున్న ఎస్సీలు, బీసీలు

- నిమ్నజాతులు మేల్కోవాలి : కంచ ఐలయ్య
- టీమాస్ ఓట్ల కోసం ఏర్పడలేదు : జాన్‌వెస్లీ

నవతెలంగాణ - హయత్‌నగర్

పూలే, అంబేద్కర్, మార్క్సిజం సిద్ధాంతాలను నమ్మి టీమాస్ కుల నిర్మూలనకు పూనుకున్నామని టీమాస్ చైర్మెన్ కంచ ఐలయ్య అన్నారు. గురువారం రాక్‌టౌన్ కాలనీలో ఉన్న ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. బెంగాల్‌లో ఆర్ఎస్ఎస్ అంటే ఎస్సీలు, బీసీలు భయపడుతున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి వచ్చేటట్టు కనిపిస్తోందన్నారు. నిమ్న జాతులకు చెందిన వారు మేల్కొని ఇంటింటికి టీమాస్‌ను విస్తరింపజేయాలన్నారు. నిశ్శబ్ద విప్లవానికి టీమాస్ నాంది అని సూచించారు. బ్రాహ్మణులు లేకుండా పెండ్లిండ్లు చేయడం, గ్రామాల్లో సహపంక్తి భోజనాలు చేస్తేనే కుల నిర్మూలనలు సాధ్యమవుతాయన్నారు. రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ టీమాస్ ఓట్ల కోసం ఏర్పడలేదని, అంబేద్కర్, ఫూలే సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రస్తుతం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో కుల ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు బిల్లు ప్రవేశపెట్టాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తామని హెచ్చరించారు. ఏప్రిల్‌లో అంబేద్కర్, ఫూలే జయంతులను జారతగా చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్ మాట్లాడుతూ.. టీమాస్ ఒక ప్రచార సంస్థగా ఉన్నది, ఇది ఏ పార్టీకి అనుబంధంకాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీమాస్ రాష్ట్ర నాయకులు నాగరాజు, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు మజీదుల్లాఖాన్ వర్షత్, తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో -బేటీ పడావో'లో హైదరాబాద్‌కు అవార్డు

ప్రధాని చేతుల మీదుగా అందుకున్న కలెక్టర్ యోగితారాణా

నవతెలంగాణ - సిటీబ్యూరో

'బేటి బచావో-బేటి పడావో' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల సంరక్షణ, బాలికావిద్యకు విశేష కృషికి హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. కలెక్టర్ డాక్టర్ యోగితారాణాను కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జుంజునులో గురు వారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో ప్రధాని మంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా యోగితారాణా అవార్డు అందుకున్నారు.

వాణిజ్య యుద్ధ మేఘాలు

సంపాదకీయం


సరిగ్గా వారం రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాన్ని భారీగా పెంచారు. దిగుమతి సుంకం ఉక్కు మీద 25శాతం, అల్యూమినియం మీద 10శాతం పెరిగింది. అయితే ఆ సుంకం జాతీయ భద్రత కారణాల మూలంగా వేయటం జరిగిందనే ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. సాధారణంగా ఇటువంటి ప్రకటన యుద్ధ సమయంలోనూ లేక జాతీయ విపత్తుల కాలంలోను ఇవ్వటం జరుగుతుంది. ఇందుకు ప్రతిగా అమెరికా మిత్ర దేశాలైన కెనడా, యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియాలతోపాటు చైనా అనేక చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది.

ముఖ్యంగా చైనాతో పోల్చినప్పుడు అమెరికా ప్రాబల్యం క్షీణించింది. ఈ నేపథ్యంలో దిగుమతులపై సుంకాలను విధించటం ద్వారా ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. మహామాంద్యం తరువాత ఇటువంటి వాణిజ్య యుద్ధ వాతావరణాన్ని చూడలేదని ఓ అభిప్రాయం.

దిగుమతి సుంకాలపై అంతిమంగా ఈ వారాంతంలో ట్రంప్ సంతకం చేయబోతున్నారు. అమెరికా మిత్రదేశాలకు ఈ సుంకాలలో రాయితీలు ఇవ్వాలని వత్తిడి చేస్తున్నాయి. అయితే ప్రత్యేక వ్యాపారాలకు పలు దేశాలకు రాయితీలు ఇవ్వటం జరగదని అమెరికా వాణిజ్య పారిశ్రామిక విధానానికి చెందిన విభాగం అధినేత పీటర్ నవర్రో అన్నారు. ఇందుకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు జరిగినా దిగుమతులపై సుంకాలను విధించాలనే విధాన ప్రకటన ఒక చారిత్రక మలుపు అని చెప్పక తప్పదు. ఎందుకంటే అమెరికా వాణిజ్య విధానంలో నూతన వాణిజ్య సుంకాలకు జాతీయ భద్రత ఆధారంగా ప్రకటించి ట్రంప్ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ పరిమితులను దాటాడని ఫైనాన్షియల్ టైమ్స్ వ్యాఖ్యానించింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పెట్టుబడిదారీ వ్యవస్థ భవితకే ప్రశ్నార్థకమైన అంతర్జాతీయ ఘర్షణలను నివారించటానికి అమెరికా చొరవతోనే ఏర్పడిన ఆర్థిక సంబంధాల వ్యవస్థ పతనం ట్రంప్ ప్రతిపాదిత వాణిజ్య యుద్ధ చర్యతో మొదలవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జాతి రాజ్య ఆర్థిక చట్రాలు రాజేసిన శత్రు వైరుధ్యాలలో ఉండటమే దీనికి కారణం. వివిధ దేశాల ఉత్పత్తుల మధ్య వ్యవస్థీకృత సహకారం నెలకొల్పటానికి బదులుగా యుద్ధంలో విజేతలయి ప్రపంచంపై ఆధిపత్యం చెలాయిస్తున్న దేశాలకు చెందిన పెట్టుబడిదారులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చెందిన వనరులను దోపిడీ చేయటంలోనే ఈ వైరుధ్యం ఉన్నది.

పెట్టుబడిదారీ మూలాలు గల పరస్పరం కలహించుకునే జాతి రాజ్యాలకు మధ్యగల వైరుధ్యం మరింత తీవ్రమై యుద్ధాలకు దారి తీస్తుంది. 1929లో వచ్చిన మహా మాంద్యం కాలంలో ఇలానే జరిగి



రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమంటే మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత కేవలం 20ఏండ్లకు రెండవ ప్రపంచ యుద్ధం మొదలయింది. అలా ప్రపంచ యుద్ధాలు జరగకుండా ఉండాలంటే ప్రపంచ స్థాయిలో ఒక స్థిరమైన ద్రవ్య వ్యవస్థ ఉండాలి. 1944లో అలా మొదలైందే బ్రెట్టన్ వుడ్స్ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ. దీనితోపాటు 1947లో జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్(గాట్)ను స్థాపించారు. ఈ రెండు సంస్థల ఏర్పాటుకు అమెరికా చొరవ చూపింది.

అయితే ఈ ద్రవ్య వ్యవస్థ 1930వ దశకంలో చెలరేగిన సామ్రాజ్యవాద దేశాల శత్రు సంబంధాలను తిరిగి ఆవిర్భవించకుండా చేయగలిగింది. గానీ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోని మౌలిక వైరుధ్యాలను అధిగమించలేక పోయింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అత్యంత ప్రాబల్య ఆర్థికశక్తిగా ఎదిగిన అమెరికా ఆధిపత్యంపై అంతర్జాతీయ క్రమం (ఇంటర్నేషనల్ ఆర్డర్) ఆధారపడింది. అయితే రెండవ ప్రపంచ యుద్ధానంతరం విస్తృతమైన ఆర్థికాభివృద్ధి జరగటంవల్ల జర్మనీ, జపాన్ దేశాలు బాగా పుంజుకుని అమెరికా ఆధిపత్యానికి గండికొట్టాయి. 1960వ దశకానికల్లా ఈ వైరుధ్యాలు అమెరికా విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల ప్రతికూల శేషంలోను, అమెరికా వాణిజ్య లోటులోను కనపడటం మొదలయింది. ఈ పరిస్థితి 1971లో అప్పటి అధ్యక్షుడు నిక్సన్ అమెరికా డాలరుకు బంగారం దన్నుగా ఉండే పద్ధతి తొలగించారు. 1944లో నెలకొల్పబడిన అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థకు డాలరుకు బంగారం దన్నుగా ఉండటమే పునాది.

ఆ తరువాత దేశాల మధ్య పరస్పర సంబంధంలో వున్న రెండు ప్రక్రియలు కొనసాగాయి. మొదటిది, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి ప్రక్రియలన్నీ ప్రపంచీకరణ ద్వారా ఐక్యమయ్యాయి. రెండవది, అమెరికా తన చారిత్రక విరోధులతోను, నూతన విరోధులు ముఖ్యంగా చైనాతో పోల్చినప్పుడు అమెరికా ప్రాబల్యం క్షీణించింది. ఈ నేపథ్యంలో దిగుమతులపై సుంకాలను విధించటం ద్వారా ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. మహామాంద్యం తరువాత ఇటువంటి వాణిజ్య యుద్ధ వాతావరణాన్ని చూడలేదని న్యూయార్క్ టైమ్స్ అభిప్రాయపడింది.

ఈ వాణిజ్య యుద్ధ పర్యవసానం ఏమైనప్పటికీ ఇది కొనసాగుతుంది. ఎందుకంటే దీని మూలాలు అమెరికా అధ్యక్షుడి మానసిక ధోరణిలో లేవు. అవి పరిస్థితులలోనే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోని వైరుధ్యాలలో ఉన్నాయి. ఇలా పరిష్కరించజాలని వైరుధ్యాలుగల పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని అధిగమించే శక్తులు ఆవిర్భవించేదాకా ఈ అరాచకం కొనసాగుతూనే ఉంటుంది.

మానవ బలహీనతకు చిహ్నమే దేవుడు: ఐన్‌స్టీన్



డాక్టర్ దేవరాజు మహారాజు

'దైవ సిద్ధాంతాన్ని వదిలి నైతిక విలువల్ని స్థాపించాలి!' అని అన్నాడు మహాశాస్త్రవేత్త ఐన్‌స్టీన్

న్యూయార్క్ మహానగరంలో సండే స్కూలులో ఆరో తరగతి చదివే ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఐన్‌స్టీన్‌కు ఒక ఉత్తరం రాశాడు. అందులో ఒక ప్రశ్న ఉంది. "శాస్త్రవేత్తలు ప్రార్థన చేస్తారా? చేస్తే దేనికోసం చేస్తారూ?" అని! దానికి ఐన్‌స్టీన్ ఇలా సమాధానమిచ్చాడు. "ప్రకృతి సూత్రాల కనుగుణంగా ప్రతిదీ జరుగుతూ ఉందన్న భావన మీద శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయి. అందువల్ల ప్రార్థనతోనో, అతీంద్రయ శక్తులతోనో, ఆరాధనతోనో సహజ పరిణామాల్ని ప్రభావితం చేయవచ్చని ఏ పరిశోధకుడూ నమ్మడు" అని ఐన్‌స్టీన్ వివరణ ఇచ్చాడు.


మానవుడి సనాతన ఆలోచనా విధానాన్ని పునాదులతో పెకిలించి, శాస్త్రీయంగా, హేతుబద్ధంగా నూతన ఒరవడిలో సరికొత్త ఆలోచనా ధారను ప్రపంచ మానవాళికి అందజేసిన

వైజ్ఞానిక శాస్త్రం నైతికతను కించపరుస్తుందన్న అపవాదు ఉంది. కానీ, అది నిజం కాదు! మానవుడి నైతిక ప్రవర్తన-సానుభూతి, విద్య, వైద్యం, సామాజిక అవసరాలు, స్నేహ బంధనాల మీద ఆధారపడి ఉంటుంది. అందులో మతానికి చోటే లేదు. అవసరమే లేదు. మత ప్రమేయం లేకుండా కూడా, మానవులుగా, మహనీయులుగా గొప్ప విలువలతో జీవించిన వారున్నారు.

ప్రఖ్యాత శాస్త్రవేత్తల్ని, సామాజిక తత్త్వవేత్తల్ని వేళ్ళమీద లెక్కబెట్టొచ్చు. ఛార్లెస్ డార్విన్ తన 'జీవ పరిణామ సిద్ధాంతంతో సృష్టి రహస్యాన్ని ఛేధించాడు. కార్ల్ మార్క్స్ 'పెట్టుబడి'లో అదనపు విలువకున్న ప్రాముఖ్యతను ఆవిష్కరించి పెట్టుబడిదారీ వ్యవస్థను తూర్పార బట్టాడు. సిగ్మండ్ ఫ్రాయిడ్ 'మనో విశ్లేషణ' ఫలకంపై కొత్త ఆలోచనల్ని రూపుకట్టి సరికొత్త చర్చలకు తెరలపాడు. ఆ కోవకు చెందిన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్ భౌతిక శాస్త్రంలో 'సాపేక్ష సిద్ధాంతంతో' సంచలనం సృష్టించాడు.

ఐన్‌స్టీన్ దృష్టిలో దేవుడంటే ప్రకృతి, ప్రకృతి ధర్మాలు మాత్రమే! ఆయన అతీంద్రియ శక్తుల్ని గానీ, క్రైస్తవ మతంలోని ట్రినిటీని గానీ, ఏసుక్రీస్తు మహిమల్నిగానీ, ఆత్మ అమరత్వాన్ని గానీ, గ్రహబలం గురించి గానీ ఎప్పుడూ నమ్మలేదు. "దేవుడు ఈ విశ్వంతో ఎప్పుడూ ఆటలాడుకోడు" అని ఐన్‌స్టీన్ తరచుగా అంటుండేవాడు. విశ్వంలో యాదృచ్ఛికమైన గతులుండవు. గణిత సూత్రాలకు అనుగుణంగానే ప్రకృతి నడుస్తూ ఉంది.. అని కచ్చితమైన అభిప్రాయం ఉన్నవాడాయన. ఆయన "మతం" అనే మాటకు మరొక అర్థం చెప్పాడు. దేవుడితో సంబంధం లేకుండా మనిషి నైతికతతో మెలిగి, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే.. 'మతం' అన్నాడు. ఆ అర్థంతోనే మతం అభిమతం మానవాళికి అవసరమన్నాడు. అయితే ఈ అంశాన్ని ఆయన చెప్పిన స్థాయిలోకి వెళ్ళి ఆలోచించాల్సి ఉంటుంది. అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మతం, దేవుడు అనే మూఢత్వంలో కొట్టుకుపోయే జనానికి ఈ విషయం అర్థం కావడం కష్టమే! అయితే అర్థం కానంత క్లిష్టమైంది కూడా కాదు. వంశపారంపర్యంగా జీర్ణించుకుంటూ వచ్చిన సనాతన భావజాలాన్ని కొంచెం పక్కన పెట్టి, మెదడులో ఏ మూలో దాక్కుని ఉన్న హేతువును నిద్రలేపి, విశాల హృదయంతో కొంచెం కొత్తగా ఆలోచిస్తే చాలు. ఐన్‌స్టీన్ భావం మనకు అందుబాటులోకొస్తుంది.

"మన ఈ మెటీరియలిస్టిక్ యుగంలో మానవాళి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న, తపన పడుతున్న శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైజ్ఞానిక రచయితలే అత్యంత విశ్వసనీయమైన మతస్తులు.." అని అన్నారాయన. మళ్ళీ ఈ అంశాన్ని కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వాడుకలో ఉన్నట్టుగా 'మతస్తులు' అనే పదాన్ని 'ఒక మతాన్ని నమ్మేవారు'.. అని అర్థం చేసుకోగూడదు. ఒక మహాశాస్త్రవేత్త ఉద్దేశాన్ని స్థాయిని కొంతైనా అర్థం చేసుకోవాలని వైజ్ఞానిక స్పృహతో ప్రయత్నించేవారికి, తహతహలాడేవారికి తప్పక అర్థమౌతుంది. మౌఢ్యం గుంజుకు తమని తాము కట్టేసుకున్న వారికి అర్థం కాకపోవచ్చు. బంధనాల్ని తెంచుకుని స్వేచ్ఛగా ముందుకొస్తే అర్థమవుతుంది. వ్యక్తులు ఊహించుకున్న 'దేవుణ్ణి' ఐన్‌స్టీన్ ఏనాడూ నమ్మలేదు. ఆ విషయాన్ని ఆయన చాలా సందర్భాల్లో విస్పష్టంగా చెప్పారు కూడా! "తను సృష్టించిన వాటిని తానే ఆదుకోలేక, మళ్ళీ తనే శిక్షించే దేవుణ్ణి నేను ఊహించుకోలేను. హేతువుకు, భౌతిక శాస్త్ర సూత్రాలకూ వ్యతిరేకంగా ఆయన చూపే లీలల్ని కూడా నేను ఊహించుకోలేను. అసలు దేవుడంటే ఎవరు? మనిషి బలహీనతకు ప్రతిబింబం! మనిషి భయం లోంచి, అజ్ఞానంలోంచి, ఊహల్లోంచి, భ్రమల్లోంచి రూపుదిద్దుకున్న భగవంతుడు చూపిన లీలలకు, లేదా చూపాడని చెప్పుకుంటున్న మహిమలకు ఆధారాలే లేవు. అలాంటప్పుడు మనం వాటిని నమ్మేదెట్లా?" అన్నది ఐన్‌స్టీన్ సంధించిన ప్రశ్న!



దేవుడనే ఊహ.. మానవ ప్రాథమిక శాస్త్రాల (రచనల) కల్పన. దాన్ని ఆయన ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. మానవాతీత శక్తిగా కూడా పరిగణించలేదు. అసంపూర్ణంగానైనా, వినయంగా నమ్రతతో గ్రహించే ఈ విశ్వం యొక్క క్రమబద్ధత, దాని సామరస్యంలోని అందం మానవాళిని ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ఆ ఆశ్చర్యాన్ని ఆనందించాలి. ఆస్వాదించాలి. అనుభవించాలి. ఐన్‌స్టీన్ అదే చేశాడు. అదే చేయమన్నాడు. అంతే కాని మరొకటి కాదు. మతానికీ శాస్త్రానికి మధ్య జరుగుతున్న ఘర్షణకు మూలకారణం వ్యక్తిగత దైవ విశ్వాసం. వైజ్ఞానిక శాస్త్రాలకు రుజువులున్నాయి. దైవ విశ్వాసానికి ఉండవు. రుజువులున్నదానితో రుజువులు లేనిది ఘర్షణ పడుతోంది. రుజువులు లేని దైవ విశ్వాసం అనేది లేకపోతే మానవులంతా వైజ్ఞానిక ప్రగతిని విశ్వసిస్తారు. అప్పుడు ఘర్షణ ఉండడానికి వీలుండదు. ఇప్పుడు సమాజం ఎలా ఉందీ? వైజ్ఞానిక ప్రగతి ఫలితాలను అనుభవిస్తూ, దైవ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు కదా? అందుకే ఘర్షణ జరుగుతోంది. వైజ్ఞానిక ఫలితాలు అనుభవించకుండా దైవ విశ్వాసంలో బతకగలిగితే బతకాలి. అప్పుడు కూడా ఘర్షణ ఉండదు. బాబాలు, స్వాములు, మాతాజీలు వగైరా సామాన్యుడి కన్నా ఎక్కువ వైజ్ఞానిక ఫలితాలు అనుభవిస్తున్నారు. మరోవైపు మూఢత్వం పెంచి పోషిస్తున్నారు. నైతికతను మరచి, అత్యంత హీనంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఘర్షణ. పోనీ, ఈ ఘర్షణ తగ్గించడానికి సైన్సును సైన్సు పరిశోధనల్ని పక్కన పెడదామా అంటే ఎలా వీలవుతుందీ? సైన్సు లేనిది ఊపిరే పీల్చలేం. శ్వాస క్రియ జీవశాస్త్రంలో భాగం. ఆధ్యాత్మిక, ధార్మిక, తాత్విక ధోరణులలో ఎటు నుంచి ఎటుతిప్పి చెప్పినా దైవభావన.. ఉట్టి విశ్వాసమే! ఉట్టి విశ్వాసంతో సంతానోత్పత్తి జరగదు. ఆహారోత్పత్తి జరగదు. సమాజం పెరగదు. ఎదగదు. విశ్వ రహస్యాల్ని, జీవరహస్యాల్ని మనిషి అర్థం చేసుకుంటూ ఒక్కొక్కటి ఆవిష్కరించుకుంటూ వస్తున్నాడు గనకనే, మనం ఈ అత్యాధునిక సాంకేతిక యుగంలో ఉన్నాం. మునుల వల్లనో, రుషుల వల్లనో, ధార్మిక ఆధ్యాత్మిక గురువుల వల్లనో ప్రపంచం పురోగతి సాధించలేదు. అలాగే మత విశ్వాసాల వల్ల ఘర్షణలు జరిగాయే గాని, శాంతి స్థాపించబడలేదు.

"ఎవరో నమ్ముకున్న దేవుడు లేడని నేనెందుకు నిరూపించాలి? అది నా పనికాదు. నమ్ముతున్న వారే, వారెందుకు నమ్ముతున్నారో నిరూపించుకోవాలి. దేవుడున్నాడని మాట్లాడితే నేనొక అబద్ధాలకోరునవుతాను. అయినా వాస్తవాలకు నిరూపణలు వెతకొచ్చు. అవాస్తవాలకు నిరూపణ లెక్కడ?" అని ప్రశ్నించిన ఐన్‌స్టీన్ మత ప్రచారకులకు కొన్ని సూచనలిచ్చాడు. మత ప్రచారకులంతా తమ వ్యక్తిగత దేవుడి సిద్ధాంతాన్ని వదిలేయాలి, తమ ఆధీనంలో ఉన్న పాప పుణ్యాల్ని, భయాల్ని, నిరాశావాదాన్ని, పునర్జన్మల్ని మొత్తానికి మొత్తంగా తుడిచేసుకోవాలి. నైతిక విలువల్ని కాపాడే పోరాటంలో సామాన్యులతో కలిసి రావాలి. 'కార్య కారణ సూత్రం'పై పనిచేసే ఈ విశాల విశ్వాన్ని అర్థం చేసుకోవాలి. జరిగిన జరుగుతున్న పరిణామాల మీద అవగాహన పెంచుకోవాలి. మతంపై నుండి దృష్టి మరల్చి, సామాజిక అసమానతలపై దృష్టి పెట్టాలి.. అని!

మానవుడి అమరత్వంపై తనకు నమ్మకం లేదని, నీతి అనేది మానవాతీత శక్తి కాదని, మానవుడికి సంబంధించిందేనని.. అది అతడు తన ఆత్మ విశ్వాసంతో సాధించుకోవచ్చని. ఈ విషయంలో దేవుడి ప్రమేయమే లేదని కరాఖండీగా చెప్పిన ఈ శాస్త్రవేత్త, మరణానంతర జీవితాన్ని కొట్టిపారేశాడు. భౌతికంగా మనిషి చనిపోయిన తర్వాత జీవి బతికే ఉండడం ఆత్మలు తిరుగాడుతూ ఉండడం మూఢనమ్మకాలేనన్నాడు. మనిషి అంతర్గత అనుభవాలన్నీ పునరుత్పత్తులతో, సునిశిత భావ సముచ్చయంతో ముడివడి ఉంటాయి తప్పితే, దేహమే లేకపోయినప్పుడు ఆత్మకు అర్థమే లేదు. మానసికంగా బలహీనులైన వ్యక్తులు ఆత్మన్యూనతా భావంతోనూ, భయంతోనూ లేదా ఎదుటివారిని మోసగించాలన్న కుట్రతోనూ అలాంటి ఆలోచనల్ని ప్రచారం చేస్తుంటారు. లేని ఆత్మల్ని జనం గుండెల్లో పదిలపర్చుతుంటారు.

మతం గురించిన ప్రస్తావనలో ఐన్‌స్టీన్ ఒక చోట ఇలా రాసుకున్నాడు. మత పరమైన తీవ్ర ఒత్తిళ్లను ఆయన బాల్యంలోనే ఎలా అనుభవించాడో గుర్తు చేసుకున్నాడు.. "నాకు పన్నెండో యేట నుండి పాఠశాల మీద, ఉపాధ్యాయుల మీద అపనమ్మకం ప్రారంభమైంది. స్కూలు నన్ను ఫెయిల్ చేసింది. నేను స్కూలును! ఉపాధ్యాయులెప్పుడూ మిలిట్రీ సార్జంట్లలాగ ప్రవర్తించేవారు. నాకు కావల్సింది నన్ను నేర్చుకోనిచ్చేవారు కాదు. ఆ పోటీతత్వం నాకు నచ్చేది కాదు. ముఖ్యంగా క్రీడల్లో.. దీనివల్ల వాళ్లు నన్ను వెళ్లిపొమ్మని అనేకసార్లు ఆదేశించారు. మ్యూనిచ్‌లో అది ఒక క్యాథలిక్ స్కూలు. ఇక చెప్పేదేముంది? నా జ్ఞాన తృష్ణను మెలికవేసి తిప్పుతూ, తిప్పుతూ ఉండేవారు – ఫ్రెయిడ్ ద గాడ్! పైగా మార్కులు, గ్రేడ్‌లే వారి కొలబద్దలు. అలాంటి వ్యవస్థతో ఉపాధ్యాయులు పసికూనలైన చిన్నారుల మనోభావాల్ని, ఉత్సాహాల్ని, అభిరుచుల్ని ఎలా బేరీజు వేయగలరో నాకు తెలిసేది కాదు." ఐన్‌స్టీన్ బాల్య అనుభవాలకు, సమకాలీనంలో మన బాల బాలికల జీవితానికి పెద్దగా తేడా లేదు. మిషనరీ స్కూలయితే ప్రేయర్. మదరసా అయితే అల్లా, వేదపాఠశాల అయితే వేదాలు. అంతే.. మత ప్రమేయం లేకుండా విచక్షణా జ్ఞానాన్ని పెంచే చదువు లున్నాయా? వాస్తవాలేవో, భ్రమలేవో, కల్పనలేవో పిల్లలకు విడమరిచి చెపుతున్నామా? మతం సాధించే విజయానికి, విద్యావ్యవస్థ అపజయానికి నేరుగా అవినాభావ సంబంధం ఉంది.

సరే, గతం గడిచిపోయింది. ఏం చేసినా దాన్నిక మార్చలేం కానీ, సుఖాంతమయ్యే ఒక కొత్త ప్రారంభానికి మనం బీజం వెయ్యొచ్చు కదా? ఆ దిశలో మనం ఎందుకు ఆలోచించకూడదూ? థియోసఫీ, స్పిర్చువలిజం వంటి వన్నీ మత గ్రంథాల చుట్టూ తిరిగే గందరగోళాలే! అసలు మత గ్రంథాలన్నీ అవాస్తవాలు, కల్పితగాథలు అని అనుకున్న వారికి కొత్త ఆలోచనలు వచ్చే అవకాశముంటుంది. గానుగెద్దులా కండ్లు మూసుకుని తిరిగే వారికి, అందులోనే శాంతి, సౌఖ్యం ఉన్నాయని అనుకునేవారికి మనం ఏమీ చెప్పలేం. వైజ్ఞానిక శాస్త్రం నైతికతను కించపరుస్తుందన్న అపవాదు ఉంది. కానీ, అది నిజం కాదు! మానవుడి నైతిక ప్రవర్తన–సానుభూతి, విద్య, వైద్యం, సామాజిక అవసరాలు, స్నేహ బంధనాల మీద ఆధారపడి ఉంటుంది. అందులో మతానికి చోటే లేదు. అవసరమే లేదు. మత ప్రమేయం లేకుండా కూడా, మానవులుగా, మహనీయులుగా గొప్ప విలువలతో జీవించిన వారున్నారు. మరణం తర్వాత లభించే అనుగ్రహం కోసమో, శిక్షలకు గురవుతామన్న భయంతోనో మనిషిని నిలదీయడం గానీ, కృంగదీయడం గానీ, మోసగించడం గానీ, అమానుషం! అపరిపక్వం! అసబంధం!!

**వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీ వేత్త, సైన్స్ ప్రొఫెసర్,
సెల్: 9573706806**

వాహన చట్ట సవరణ తిరోగమన చర్య



ఆర్. లక్ష్మయ్య

రోడ్డు ప్రమాదాలలోను, ప్రమాద మరణాలలోను భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రతీ ఏటా ప్రమాద మరణాలు పెరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు తగ్గించడానికే మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లును తీసుకు వచ్చినట్టు కేంద్రం ప్రజలను నమ్మిస్తున్నది. మన దేశంలో అతి తక్కువ ప్రమాద రికార్డులతో ఆర్టీసీలు అనేక సార్లు ప్రభుత్వాల నుండి అవార్డులు అందుకున్నాయి. ప్రమాదాలు తగ్గించాలంటే ఆర్టీసీలను విస్తరించి బలోపేతం చేయాలి. అందుకు భిన్నంగా మోటారు వాహన (ఎమ్‌వీ) చట్ట సవరణ బిల్లు లోని 27 నుండి 33 క్లాజులలోని 66, 66 ఎ, 66 బి, 67, 72, 74, 88 ఎ, 92 సెక్షన్లను కొత్తగా ప్రవేశపెట్టారు. ఇవి ఆర్టీసీల మనుగడను ప్రశ్నార్థకం చేసేవి. ప్రమాదాలు తక్కువగా ఉండడం వలనే ఇప్పటి వరకు ఆర్టీసీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ల చెల్లింపులో మినహాయింపు ఉన్నది. సవరణ బిల్లుతో ఈ మినహాయింపు పోతుంది. భారీ ఇన్సూరెన్స్‌లు, ఇన్సూరెన్స్ ప్రీమియమ్‌లు ఆర్టీసీలు చెల్లించాలంటే అవి ఇక మనుగడ సాగించలేవు.

ఆర్టీసీ ఏర్పాటు, బస్సుల జాతీయం తరువాత వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు చేర్చడంలో రైతులకు రవాణా సౌకర్యాలు చేయూతనిచ్చాయి. మరొక విధంగా అక్షరాస్యతకు, విద్యాభివృద్ధి, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవడానికి తోడ్పడ్డాయి. పారిశ్రామిక రంగానికి రవాణా సౌకర్యాలు ఎంతో ఊతాన్నిచ్చాయి. కాలనీల నుండి పారిశ్రామిక కేంద్రాలకు రవాణా సౌకర్యాలతో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందింది. చట్ట ప్రకారం ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్లు అమలు చేయడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు, మహిళలకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించాయి. మన సమాజానికి అందిన ఈ ప్రయోజనాలతో పాటు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా గ్రామీణ, కొండ ప్రాంతాల ప్రజానీకానికి రవాణా సౌకర్యాన్ని ఆర్టీసీలే అందించాయి. అనేక ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికి ప్రభుత్వాల తరపున ఆర్టీసీలు ఈ భారాన్ని మోస్తున్నాయి. ఈ విధంగా సామాజిక బాధ్యత సైతం అవి నెరవేరుస్తున్నాయి. ఆర్టీసీలు మూతబడితే ప్రయివేటు ఆపరేటర్లు ఈ సౌకర్యాలను ప్రజలకు అందించరు. వారికి లాభాపేక్ష తప్ప సామాజిక బాధ్యత ఉండదు. ఈ బిల్లు మన సమాజానికి శాపం వంటిది. ప్రజా ప్రయోజనాలకు ఎంతో నష్టదాయకం. బిల్లులో ప్రతిపాదించిన పర్మిట్ల సరళీకరణ, యథేచ్ఛగా పర్మిట్ల జారీ, పర్మిట్ల షరతులలో మార్పులు ఇవన్నీ పోటీని తీవ్రతరం చేస్తాయి. ఫలితంగా ప్రమాదాలు పెరిగిపోతాయి. ట్రాఫిక్‌జాములు, కాలుష్య స్థాయి పెరిగిపోతుంది. ఈ దుష్ఫలితాలను ప్రజలు భరించవలసి వస్తుంది. పౌర సమాజానికే ఇది కీడు చేస్తుంది. ప్రమాదాల నివారణే అయితే విచ్చలవిడిగా పర్మిట్లు ఇచ్చే విధానాన్ని ఎందుకు తీసుకువస్తున్నట్టు?

జరిమానాలు, శిక్షలు పొరపాట్లు చేసే వారిలో పరివర్తన తీసుకురావాలి. కానీ బిల్లులో కనీస జరిమానా రూ.500 నుండి రూ. లక్ష వరకు భారీగా ఉంది. జైలుశిక్ష మూడేండ్లుగా ప్రతిపాదించారు. వాహనాల సంఖ్య పెరిగిపోతున్న దానికనుగుణంగా కేంద్రం ముందుగా రోడ్డు రవాణా రంగంలో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. తరువాత పెద్ద ఎత్తున రోడ్ల వినియోగదారులకు, డ్రైవర్లకు చైతన్యం కల్పించాలి. తరువాత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసి సక్రమంగా నిర్వహించాలి. కేవలం శిక్షలు, జరిమానాల పెంపుతో ప్రమాదాలు తగ్గవు, ఈ చర్యలతో అవినీతి మాత్రం పెరిగిపోతుంది.


ప్రస్తుత ఎమ్‌వి చట్టం 1988లో అగ్రిగేటర్లకు అనుమతి లేదు. ఒక చోట ఉండి డ్రైవరును, ప్రయాణీకుడిని అనుసంధానం చేసేదాన్నే యాగ్రిగేటర్లు అంటున్నారు. ఉబర్, ఓలా వంటివే యాగ్రిగేటర్లు. ఆన్‌లైన్ సర్వీసులను యథేచ్ఛగా అనుమతించడానికి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి సంబంధం ఏమిటి? సవరణ బిల్లులో సెక్షన్ 93, క్లాజ్ 34లో ఈ యాగ్రిగేటర్లను ప్రవేశ పెట్టారు. ఇది వ్యక్తిగత ఆటోవాలాను, ట్యాక్సీ, లారీ, ప్రయివేటు బస్సు డ్రైవర్లను ఈ రంగం నుండి నెట్టి వేసి కార్పొరేట్ కంపెనీలకు రవాణా రంగాన్ని కట్టబెట్టడానికి కేంద్రం వేసిన పథకమే ఇది.

2017 ఆగస్టు 8న రాజ్యసభలో ప్రతిపక్షాల ఒత్తిడితో బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించారు. సెలక్ట్ కమిటీ బిల్లుతో అనుబంధం ఉన్న వారితో, అఖిల భారత రోడ్డు రవాణా కార్మిక సమాఖ్యతోనూ చర్చించింది. బిల్లుపై వేసిన సెలెక్టు కమిటీ తమిళనాడు, కేరళ రాష్ట్రాలను పర్యటించింది. అనేక సంఘాలను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నది. ఈ మొత్తం పనికి 135 రోజుల సమయం తీసుకున్నది. చివరికి బిల్లును సెలక్టు కమిటీ ఆమోదించింది. ఈ రాజ్యసభ సెలెక్టు కమిటీ బిల్లుపై గతంలో పార్లమెంటరీ స్థాయి సంఘం ఇచ్చిన సిఫార్సులను కూడా తమ నివేదికలో ప్రస్తావించలేదు. దీనితో సెలెక్టు కమిటీ అనేది కంటి తుడుపు చర్య అని తేలిపోయింది. ఈ స్థితిలో సెలెక్టు కమిటీలో సీపీఐ(ఎం), కాంగ్రెస్, డీఎమ్‌కే, ఏఐఏడీఎమ్‌కే, టీఎంసీ, వంటి పార్టీల రాజ్యసభ సభ్యులు బిల్లు లోని వివిధ అంశాల పట్ల తమ అసమ్మతి తెలియజేశారు.

బిల్లును ఆమోదించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పడరాని పాట్లు పడ్డారు. బిల్లుపై రవాణా సంఘాలు చేసిన నికరమైన పోరాటం బిల్లును నాలుగేండ్ల పాటు ఆమోదం పొందకుండా అడ్డుకున్నాయి. ఈ బడ్జెట్ తొలి సమావేశాలలోనే బిల్లును ఆమోదించుకోవాలని ప్రభుత్వం సంకల్పించినా, ముఖ్యమైన ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల పట్టు పట్టడం వల్ల బిల్లును ప్రవేశ పెట్టలేకపోయాయి. ఈ పార్లమెంటు సమావేశాలలోనే వినాశకర బిల్లును రాజ్యసభ ఆమోదించే ప్రమాదమున్నది. రాజ్యసభలో ఎన్డీఏకి తగిన బలం సమకూరినందున బిల్లును పాస్ చేసే ప్రమాదం ఉన్నది. అయితే దానిని చట్టం చేసి అమలు చేయగలగడం అంత తేలిక కాదు. డ్రైవర్లు, రవాణా రంగం సహకరిస్తేనే కేంద్రం దీనిని అమలు చేయగలదు.

అందుకే ప్రజా వ్యతిరేక మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలని, రవాణా కార్మిక సంఘాలన్నీ దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. మార్చి 20 లోగా అన్ని రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి సదస్సులు నిర్వహించాలని, బిల్లుకు వ్యతిరేకంగా సమ్మెకు సన్నాహాలు చేసుకోవాలని రవాణా కార్మిక సంఘాల జాతీయ కోఆర్డినేషన్ కమిటీ పిలుపునిచ్చింది. రవాణా రంగ కార్మికులు ఐక్యమై బలాన్ని చాటాలి.

ఔషధ రంగంలో ఏం జరుగుతోంది?



ఎస్. వినయకుమార్

ఏదైనా వ్యాపారంలో 2000శాతం మార్జిన్ ఉంటుందా? ఔషధరంగంలో ఉంటుందని కార్పొరేట్ ఆస్పత్రులు నిరూపించాయి. తమ దోపిడీని వేలెత్తి చూపితే ఎంతటి వాడిదయినా తల తెగిపడ్తుందని కూడా చూపెట్టాయి. ఔషధ ధరల నిర్ణయాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) చైర్మన్ భూపేంద్రసింగ్ ఎకాఎకి బదలీ ఇందుకో ఉదాహరణ. మందుల ధరలను తగ్గిస్తామన్న మోడీ ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా చుక్కలు చూపింది. ప్రధాని మాటలు నీటిమూటలేనని పదేపదే తేలిపోయింది. నాలుగేండ్లలో దేశంలో మందుల ధరలు తగ్గకపోగా మరింత పెరిగాయి. జీఎస్టీ వడ్డన కూడా ధరలకు తోడయింది. జనరిక్ మందులే రాయాలంటూ ఏడాది క్రితం మోడీ చేసిన హుంకరింపులు గాలిలో కలిశాయి. జనం నిట్టూర్పులు మిగిలాయి. ఫార్మసీ కంపెనీల, కార్పొరేట్ ఆస్పత్రుల నిలువు దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది.

మందుల ధరల నిర్ణయాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) చైర్మన్ భూపేంద్ర సింగ్‌ను ఎకాఎకిన బదిలీచేసిన దురంతం కూడా మోడీ ప్రభుత్వ జనవ్యతిరేక ధోరణికి ఓ తాజా ఉదాహరణ. ప్రయివేట్ రంగంలోని నాలుగు కార్పొరేట్ ఆస్పత్రులు ఆపద సమయంలో 2000శాతం లాభం వేసుకొని, అంటే రూపాయి మందును రెండువేలకు అమ్మాయి. సినిమా థియేటర్లలో గేట్లు మూసి నిలువు దోపిడీ చేసినట్టు ఆ మందులు తమ ఆస్పత్రుల్లోని ఫార్మసీ షాపులోనే కొనాలని అవి షరతు విధించాయి. ఎన్‌పీపీఏ దర్యాప్తులో ఈ విషయం బయటపడింది. ఆ నివేదికను ఎన్‌పీపీఏ విడుదల చేసిన పదిరోజుల్లోనే చైర్మన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మరొకరిని ప్రభుత్వం నియమించలేదు. ఆ ఆస్పత్రులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తమ దోపిడీని ఎన్‌పీపీఏ బయట పెట్టినందువల్లే పలుకుబడిగల ఆస్పత్రుల యాజమాన్యాలు చైర్మన్‌ను బదిలీ చేయించాయని ఆలిండియా డ్రగ్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థ విమర్శించింది.

ప్రమోషన్ పేర డాక్టర్లపై పెట్టే ఖర్చును తమ అకౌంట్లలో చూపి ఔషధ కంపెనీలు పన్ను మినహాయింపు కోరవచ్చని పూనే లోని ఆదాయపు పన్ను అప్పలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు కూడా విస్మయం కల్గించేదే. ఈ తీర్పు వైద్య రంగంలో పరిరక్షించాల్సిన విలువలను ప్రశ్నార్థకం చేసింది. తమ కంపెనీ మందులు రాయాలని కోరుతూ డాక్టర్లను మందుల కంపెనీలు ప్రలోభ పెట్టడం అందరికీ తెలిసిందే. డాక్టర్లకు మందుల శాంపిల్స్ ఇవ్వడంతోనే కంపెనీలు ఆగవు. ఖరీదైన గిఫ్టులు, ప్రయాణ టిక్కెట్లు, ఆతిధ్యం వగైరాలూ సమకూర్చుతుంటాయి. మెడికల్ కాన్ఫరెన్సులను స్పాన్సర్ చేస్తుంటాయి ఈ చర్యలు భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌కు విరుద్ధం కనుక ఆ ఖర్చుకు పన్ను మినహాయింపు నివ్వలేమని ఆదాయపు పన్ను శాఖ చెపుతూ వచ్చింది. ఆదాయపు పన్ను శాఖ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఓ ఫార్మసూటికల్స్ కంపెనీ ట్రిబ్యునల్‌కు వెళ్లగా ట్రిబ్యునల్‌పై తీర్పు ప్రకటించింది.

ఔషధ రంగం ఇతర వ్యాపారాల్లాంటిది కాదు అని చెప్పడం న్యాయసమ్మతం! ఎంసీఐ మార్గదర్శకాలు మందుల కంపెనీలకు ఎందుకు వర్తించరాదు? అవి పాటించదగినది కావా? ఇవన్నీ ప్రశ్నలే. ఎంసీఐ వ్యవహారం కూడా గొప్పగా లేదు. కాగా డాక్టర్లకు

జనరిక్ మందులోనయినా బ్రాండెడ్ మందులోనయినా మూలరసాయన పదార్థం ఒకటే. రెండింటినీ తయారు చేసేది ఒకే కంపెనీ. అయినా ధర నాలుగైదు రెట్ల తేడా. వాణిజ్య పేర్ల మీద ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే మందుల కోసం కంపెనీలు పెద్ద స్థాయిలో ప్రమోషన్ కార్యకలాపాలు నిర్వహిస్తాయి.

సంబంధించయినా తన మార్గదర్శకాల అమలుకు ఎంసీఐ ప్రయత్నిస్తుందా? దానికి అంత యంత్రాంగం ఉందా? ఇటీవల ప్రసార భారతి చూపుతున్న తెగువ అదెందుకు చూపలేకపోతోంది? మందుల అమ్మకాలకు ప్రచారం చేసుకోరాదన్న ఎంసీఐ మార్గదర్శకాలు మందుల కంపెనీలకు వర్తించరాదని భావిస్తే



అదే విషయం స్పష్టంగా చెప్పాలి. లేదా మందుల కంపెనీలకు కూడా అవి వర్తించేలా అవసరమైన చర్యలు చేపట్టాలి. కానీ మోడీ ప్రభుత్వం అందుకు పూనుకొంటుందన్న ఆశ లేదు. తమ ఉత్పత్తుల ప్రమోషన్ల పేర్లతో డాక్టర్లను ప్రలోభ పెట్టి, ఆ భారాన్ని మందుల కంపెనీలు రోగుల నుండే వసూల్ చేస్తాయి కదా. తక్కువ ధరలో అందుబాటులో ఉన్న మందులను వదలి డాక్టర్లు తమ లాభం కోసం ఖరీదైన మందులు రాస్తారన్నది కేవలం నిరాధార విమర్శ కాదుగదా!

డాక్టర్లు జనరిక్ మందులనే ప్రిస్కిప్షన్ చిట్టీల్లో రాయాలని బ్రాండెడ్ మందులు రాయరాదని ప్రధాని గతేడాది ఏప్రిల్‌లో అట్టహాసంతో పునరుద్ఘాటించారు. దానిని గొప్ప ముందడుగులా చూపుతూ మీడియా విశేష ప్రాధాన్యతనిచ్చింది. చిటీలపై మందుల జనరిక్ పేర్లనే రాయాలన్న నిబంధన వల్లకాట్లో బొగ్గులేరు కోరాదన్న ఉద్దేశంతో రూపొందించబడింది. జనరిక్ మెడిసిన్ తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని ప్రధాని గొప్ప ఉపన్యాసం దంచారు. ప్రధాని బొమ్మను సైన్ బోర్డుల మీద వేసుకొని దేశంలో అక్కడక్కడా జనరిక్ మెడికల్ షాపులు వచ్చాయి. ఆ తర్వాత మూతబడ్డాయి. మోడీ ప్రభుత్వ రాజకీయ కక్కుర్తి ఎలా ఉందంటే జనరిక్ మందుల పథకానికి కూడా తన పార్టీ పేరు వచ్చేట్టు చూసుకొంది. భారతీయ జనఔషధి ప్రోగ్రాం (బీజేపీ) అని ఆ పథకానికి కొత్త పేరొకటి పెట్టారు.

డాక్టర్లు మందు చీటీలపై జనరిక్ పేర్లు రాయడం లేదు. బ్రాండ్ల పేరే రాస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డాక్టర్లు కూడా రోగులచేత బ్రాండెడ్ మందులనే తెప్పించి ఇస్తున్నారు. ప్రభుత్వ డాక్టర్ల చేత నయినా జనరిక్ మందులు రాయించాలన్న కొద్దిపాటి చిత్తశుద్ధినీ మోడీ ప్రభుత్వం చూపలేదు. జనరిక్ మందులకు బ్రాండెడ్ మందులకు ధరల్లో తేడా కనీసం నాలుగు రెట్లు ఉంటుంది.

ఒక దేశం ఒకే ఎన్నికలు అనే ప్రధానికి ఒకే మందు ఒకే పేరు ఒకే ధర అన్న ఆలోచన కూడా రాదు. జనరిక్ మందులపై కూడా కంపెనీలు బ్రాండెడ్ ఎంఆర్‌పీ ధరలనే ముద్రిస్తున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకొని జనరిక్ మందులను కూడా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. మందుల దుకాణాలు, ప్రయివేట్ ఆస్పత్రులు కూడా అదేపని చేస్తున్నాయి. విషయం తెలియని పేషెంట్లు మాత్రం డిస్కౌంట్లను చూసి సంబర పడ్తుంటారు. గత ప్రభుత్వాలు ఈ విషయం పట్టించుకోలేదు. మోడీ కూడా అంతే.

కొత్త మందుల కోసం పరిశోధనలు చేయవలసిన ప్రభుత్వాలు ఆపని చేయడం లేదు. ప్రయివేట్ కంపెనీలు ఆ పని చేసి కొత్త మందులపై 15 నుండి 20ఏండ్ల వరకు పేటెంట్లు పొందుతున్నాయి. పేటెంట్ కాలంలో ఆ కంపెనీలు తమ ఇష్టమైన ధరకు మందుల్ని అమ్ముకోవచ్చు. కనుక పేటెంట్ కాలం ముగిసే లోపు వీలైనంత పిండుకోవడానికి కంపెనీలు ప్రయత్నిస్తాయి. పేటెంట్ కాలం ముగిశాక ఏ కంపెనీ అయినా ఆ ముందును తయారు చేయవచ్చు. కంపెనీల మధ్య పోటీ పెరిగి మందుల ధరలు తగ్గుతాయి. అది వరకు పేటెంట్ ఉన్న కంపెనీ కూడా జనరిక్ పేరుతో ఆ మందు ధర తగ్గించి అమ్ముతుంది. జనరిక్ మందుల పోటీని ఎదుర్కోవడానికి కంపెనీలు రెండు, మూడు మందులను కలిపి కాంబినేషన్ మందులు తయారు చేసి ఎక్కువ ధరలకు అమ్ముతున్నాయి. డాక్టర్ల చేత కాంబినేషన్ మందులు రాయిస్తున్నాయి. కాంబినేషన్ మందులు జనరిక్‌లో ఉండవు కనుక మందుల కంపెనీలు ఈ ఎత్తు వేస్తున్నాయి.

డ్రగ్ రెసిస్టెంట్ టీబీ చికిత్సకు అవసరమైన ఔషధాలైన బెడాక్విన్, డెలామినిడ్ అనే మందులను కనిపెట్టి ఉత్పత్తి చేస్తున్న విదేశీ కంపెనీలు వాటి తయారీ కోసం భారతీయ కంపెనీలకు లైసెన్సు ఇవ్వడం లేదు. ఆ లైసెన్సు లభిస్తే డ్రగ్ రెసిస్టెంట్ టీబీ రోగులకు చికిత్స అందుబాటులోకి వస్తుంది. ఖరీదు కూడా భారీగా తగ్గుతుంది. దేశంలో ఇలాంటి క్షయవ్యాధి బాధితులు 1.13లక్షల మంది కాగా విదేశీ మందుల కంపెనీల నుండి 'డోనేషన్'గా సేకరించిన 10,000 బెడాక్విలిన్, 400 డోసుల డెలామినిడ్ మందులు మాత్రమే దేశంలో అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో కూడా భారత ప్రభుత్వ ధోరణి పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





ఒకప్పుడు ఆ గ్రామం మరో గ్రామానికి అనుబంధంగా ఉండేది. ఇప్పుడు అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచింది. ఇది మహిళల దీక్షా దక్షతకు నిదర్శనం. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు గ్రామ అభివృద్ధిని చూసి నివ్వెరపోతున్నారు. ఈ గ్రామం ఏం అభివృద్ధి చెందుతుందని హేళన చేసినవారు ఇప్పుడు ముక్కున వేలేసుకుంటున్నారు. అంతేకాదు నేడు ఆ గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతూ నిర్మల్ పురస్కారాన్ని అందుకోబోతున్నది. ఈ అభివృద్ధిలో ప్రస్తుత గ్రామ సర్పంచ్ **లలితభాస్కర్** కీలక పాత్ర పోషించారు. తోటమాలి కుటుంబంలో కలువ పువ్వుగాగా వికసించిన ఆమె గురించి, నిర్మల్ పురస్కారం అందుకోబోతున్న ఆ గ్రామం గురించి మరి కొన్ని విశేషాలు...

తోటమాలి కుటుంబంలో కలువ పువ్వు

ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ పంచాయతీలో గంట్లవెల్లి గ్రామం అనుబంధ గ్రామంగా కొనసాగేది. చిన్నపాటి వీధిలైట్, తాగునీటి సమస్యలు తలెత్తినా అప్పట్లో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కమ్మదనంకు వచ్చి సర్పంచ్‌తో మొర పెట్టుకునేవారు. అభివృద్ధిలో వెనకంజలో ఉన్న తమ గ్రామం విషయంలో ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యాన్ని గ్రహించారు. అందరూ ఏకమై 1981లో ప్రత్యేక గ్రామపంచాయతీ సాధించుకున్నారు. అంతే ఇక అభివృద్ధి పథంలో వెనుదిరిగి చూడలేదు.

మొదటిసారి మహిళకు పట్టం

గంట్లవెల్లి గ్రామపంచాయతీ ఏర్పడినప్పట్టి నుంచి 25ఏండ్లపాటు సర్పంచ్‌లు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానం మహిళకు రిజర్వ్‌కాగా గ్రామస్తులు కావలి లలితాభాస్కర్‌ను ఏకగ్రీవం చేద్దామని నిర్ణయించారు. అయితే అప్పటికే సర్పంచ్‌గా కొనసాగుతూ పదవీకాలం ముగిసిన వ్యక్తి తన భార్యను బరిలో దింపి ఏకగ్రీవానికి బ్రేక్ వేశారు. కానీ గ్రామస్తులు ముందే నిర్ణయించుకున్న ప్రకారం కావలి లలితాభాస్కర్‌ను అత్యధిక మెజార్టీతో సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. ఏకగ్రీవానికి మొదటిసారి బ్రేక్ పడడంతో గ్రామస్తులు కొంత నిరాశలో ఉన్నప్పట్టికీ సర్పంచ్ విషయంలో తమ నిర్ణయం ఎప్పటికీ మారదని మరోసారి నిరూపించుకున్నారు. ఇక గ్రామ సర్పంచ్ సైతం అందరినీ కలుపుకొని పోతుండడంతో అభివృద్ధిలో అగ్రభాగాన దూసుకుపోతున్నది.





తోటమాలి కుటుంబంలో పుట్టి

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని బోడజానం పేట గ్రామానికి చెందిన శివరాములు, బాలమణి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు కాగా మొదటి సంతానం లలిత. కుటుంబ పోషణ కోసం ఆ దంపతులు గండిపేట్‌లో ఎంపీ జితేందర్‌రెడ్డి వ్యవసాయ తోటలో పనికి కుదిరారు. తల్లి దండ్రుల కష్టాన్ని చూసి చలించిన లలిత ఏడో తరగతిలోనే చదువును పక్కన పెట్టింది. తల్లి దండ్రులకు చేదోడు వాదోడుగా నిలిచింది. ఇలా తోటమాలి కుటుంబంలో కలువ పువ్వుల వికసించింది. తర్వాత ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెళ్ళి గ్రామానికి చెందిన కావలి భాస్కర్‌తో వివాహం కుదిరింది. వారికి పాప, బాబు ఉన్నారు.

గ్రామంలో పర్యటించిన కేంద్ర అధికారుల బృదం

అభివృద్ధి చెందిన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం అందించే నిర్మల్ పురస్కార్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా అధికారుల బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామ పంచాయతి రికార్డులను, అభివృద్ధి ప్రణాళికలను, గ్రామస్థుల అభిప్రాయలను సేకరించింది. మహిళా సర్పంచ్‌గా లలితాభాస్కర్ విశేష కృషిని సెంట్రల్ అధికారుల బృందం అభినందించారు.

చదివింది ఏడో తరగతే...

కావలి లలితభాస్కర్ చదివింది ఏడో తరగతే కానీ గ్రామ సర్పంచ్‌గా అభివృద్ధికై దొరికిన ఏ ఒక్క అవకాశాన్ని వదుకోలేదు. గ్రామ సచివాలయాన్ని అభివృద్ధి చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. గడిచిన నాలుగేండ్లలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారు. ఇతర రాష్ట్రాల, దేశాల ప్రతినిధులు, అధికారులు గ్రామాన్ని సందర్శిస్తున్నారు. అభివృద్ధికి తను రూపొందించుకున్న ప్రణాళికలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామప్రథమ పౌరురాలుగా గ్రామస్థులను పర్యావరణం, పరిశ్రుభత, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలల్లో చక్కటి అవగాహన కల్పించడంలో సఫలీకృతురాలైందని పలువురు ప్రశంశలు కురుపిస్తున్నారు.

అభివృద్ధిలో పయనమిలా..

గంట్లవెల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయంగా వరల్డ్ విజన్ సంస్థ పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టింది. గ్రామాన్ని దత్తత తీసుకొని ఇప్పటికే రూ.25లక్షలకుపైగా అభివృద్ధి పనులు చేసింది. రూ. 2.5లక్షతో ఎన్నం గోపాల్‌రెడ్డి ఆర్థిక సహాయంతో దేవునిబండా తాండ వద్ద బస్ షెల్టర్, వాసవి, వనితా క్లబ్ వారి ఆర్థిక సహాయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. గ్రామంలో ప్రస్తుతం 75శాతం అక్షరాస్యత ఉంది. 80శాతం పన్ను వసూళ్లు చేస్తూ అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో 9300 మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తున్నారు. 100శాతం సంస్థాగత కాన్పులు జరుగుతున్నాయి. రెండేండ్లుగా గ్రామంలో శి మరణాలు లేవు. ఇక గ్రామంలో ఎలాంటి తగాదాలు, కేసుల వంటివాటికి ఆమడ దూరం. ఇంతటి అభివృద్ధిని సాధించిన ఆ గ్రామం నిర్మల్ పురస్కార్ అవార్డును ఈ నెల చివర్లో అందుకోనున్నది.

- నర్సింహారెడ్డి
షాద్‌నగర్ రూరల్ రిపోర్టర్

గ్రామం ఈ పురస్కారాన్ని అందుకోవటంలో ఎంతో మంది కృషి ఉంది. ముందుగా అన్ని విధాలుగా సహకరించిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలు. అలాగే నర్సింగ్‌నాయక్(ప్రథమ సర్పంచ్) లక్ష్మారెడ్డి(ద్వితీయ సర్పంచ్) చాందిని(మూడవ సర్పంచ్)

గ్రామస్తుల రుణం తీర్చుకుంటా...

బాదేపల్లి సిద్దార్థ (నాలుగవ సర్పంచ్) చక్కటి వెంకటేష్‌యాదవ్(ఐదవ సర్పంచ్) గ్రామస్తులందరి సహాయ సహకారాలతోనే ఈ అభివృద్ధి సాధ్యమయింది. గ్రామంలో ఇప్పటికే ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను నిర్మాణం పూర్తయింది. ప్రతి కాలనీలో సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాలువలు నిర్మించాం. పరిశుభ్రత కోసం ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించేందుకు రిక్షాలను ఏర్పాటుచేసి చెత్తన్తు డంపింగ్ యార్డును సైతం ఏర్పాటు చేశాం. ఇక గ్రామ స్మశాన వాటిక నిర్మాణం అతి త్వరలోనే పూర్తికాబోతున్నది. గ్రామానికి 26 డబుల్ బెడ్‌రూంలు మంజూరు అయ్యాయి. త్వరలో వాటి నిర్మాణ కార్యక్రమానికి కృషి చేస్తున్నాం. నా పదవీకాలం పూర్తయేలోపు అభివృద్ధికై శక్తి వంచనలేకుండా పని చేస్తా. **- లలితాభాస్కర్, సర్పంచ్**

తనను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నాక గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. నాకున్న ఐదేండ్లకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ

అందరి సహకారంతోనే..

సంస్థలవద్దకు వెళ్లి గ్రామ అభివృద్ధి సహాయ సహకారాలతో నాడు చేసిన కష్టానికి ఫలితంగా నేడు అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉన్నాం. గర్వంగా భావిస్తున్నాను. నాకంటే ముందు నా తరువాత ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు సైతం గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. నా గ్రామాన్ని నిర్మల్ గ్రామంగా చూడాలన్నదే నా లక్ష్యం త్వరలో తీరబోతున్నది.

- బాదేపల్లి సిద్ధార్థ, మాజీ సర్పంచ్

బంధాన్ని పెంచే లాలిపాట

బిడ్డ పుట్టగానే బాధ్యత తీరిపోయిందని ఏ తల్లీ అనుకోదు. ఆ బిడ్డని గొప్ప మనిషిగా తీర్చిదిద్ది, ఈ లోకానికి అందించేవరకూ ఆమె విశ్రమించదు. ఆ ప్రయాణంలో ప్రతి అడుగూ ఓ అద్భుతమే... అందుకే తల్లీబిడ్డల మధ్య బంధం పరిశోధకులకి ఓ హాట్టాపిక్! అలా ఈమధ్య జరిగిన ఓ పరిశోధనలో, తల్లి లాలిపాట కూడా బిడ్డ ఎదుగుదల మీద గొప్ప ప్రభావం చూపుతుందని తేలింది.

ప్రాంతానికీ, భాషకీ అతీతంగా ప్రపంచంలోని ప్రతి తల్లీ బిడ్డని తన పాటతో లాలిస్తుంది. అసలు సంగీతం లాలిపాటతోనే మొదలైందని అంటారు. ప్రపంచంలో బెస్ట్ సింగర్ తల్లే అని ఒప్పుకుంటారు. అందుకే మియామీ యూనివర్సిటీ పరిశోధకులు పిల్లవాడి మీద తల్లి లాలిపాట ప్రభావం గురించి పరిశోధించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం వారు 70 మంది పసిపిల్లలని గమనించారు. తల్లి లాలిపాట పాడుతున్నప్పుడు వారి మానసిక స్థితినీ, వేరే సంగీతం వింటున్నప్పుడు వారి ఉద్వేగాలనీ పరిశీలించారు.

లయబద్ధంగా, ప్రేమగా సాగే లాలిపాటని వినగానే పిల్లవాడిలో అలజడి సద్దుమణిగిపోతున్నట్లు తేలింది. లాలిపాట పాడుతున్నప్పుడు బిడ్డ తల్లి వంకే చూస్తుంటుంది. బిడ్డ స్పందనలకు అనుగుణంగా తల్లి కూడా, పాటలోని లయని మారుస్తూ ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్యా గొప్ప అనుబంధం ఏర్పడుతున్నట్లు గమనించారు. లాలిపాటతో పిల్లలు శబ్దాలను కూడా సులువుగా గ్రహించగలుగుతున్నారట. అలా లాలిపాట బిడ్డకి భాషని కూడా పరిచయం చేస్తోందన్నమాట.

లాలిపాట పాడుతూ పిల్లవాడితో గడపడం వల్ల తల్లి మనసు కూడా ప్రశాంతత పొందుతున్నట్లు తేలింది. చాలామంది తల్లులు డెలివరీ తర్వాత, శరీరంలోని హార్మోనుల మార్పులతో డిప్రెషన్కు లోనవుతారు. తల్లిలో ఏర్పడే ఈ నిరాశ నుంచి దృష్టి మళ్లించేందుకు లాలిపాట మందులా పనిచేస్తుందట. అంటే అమ్మ తనని తాను సంభాలించుకుంటూ, బిడ్డకి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్నమాట. ❄



ఎండకు ఎండకుండా...

ఎండలు పెరుగుతున్నాయి. మన ఇంటిముందు ఎంతో ఇష్టంగా పెంచుకున్న మొక్కలు త్వరగా వాడిపోకుండా ఉండాలంటే అవి ఆరోగ్యంగా పెరిగేందుకు చిన్నచిన్న ఏర్పాట్లు చేసుకోవడం తప్పనిసరి.

- ఒక ప్లాస్టిక్ సీసా తీసుకుని దానికి అడుగునా, లేదంటే అక్కడక్కడా చిన్న రంధ్రాలు చేయండి. అందులో నుంచి నీళ్లు ధారలా కాకుండా చుక్కలుగా వచ్చేలా ఉండాలి. మొక్కకు కావాల్సిన నీళ్లు అందులో నింపి ఈ సీసాలను మొక్క పక్కనున్న మట్టిలో పాతాలి. దీనిద్వారా మెల్లగా నీళ్లు అంది మొక్కలు ఎండిపోకుండా ఉంటాయి.
- మొక్కను కుండీలో పెంచుతుంటే... విరిగిపోయిన ప్యూమిస్ రాయిని ఇంకా చిన్న ముక్కలు చేసి ఆ మట్టిలో కలపాలి. ఇవి నీళ్లు పీల్చుకుని ఎక్కువసేపు మట్టి తడిగా ఉండేలా చేస్తాయి.
- చిన్న చిన్న అలంకరణ మొక్కలు నాలుగైదు కుండీల్లో పెంచుతుంటే వాటన్నింటికీ ఒకేసారి నీళ్లు అందేలా చేయొచ్చు. పెద్ద పాత్ర తీసుకుని నీళ్లు నింపాలి. దానిలో మందంగా ఉండే కాటన్ దారం లేదంటే దారంలా పేనిన కాటన్ వస్త్రం ఒక కొనను ఉంచాలి. ఇంకో కొన కుండీలో వేయాలి. ఇలా నాలుగైదు దారాలు అదే పాత్రలో వేసి వాటి కొనల్ని మిగతా మొక్కలున్న కుండీల్లో వేయొచ్చు. తడి తగ్గినప్పుడల్లా మట్టి ఆ దారం ద్వారా నీటిని పీల్చుకుంటుంది. అంటే ఇదొక వత్తిలాగా పనిచేస్తుందన్న మాట!
- కాస్త వెడల్పూ, లోతూ ఉన్న ట్రే తీసుకొని అందులో చిన్న చిన్న రాళ్లు నింపాలి. అవి పూర్తిగా మునిగేటట్లు నీళ్లు పోసి, ఇప్పుడందులో కుండీని పెట్టాలి. ఒక వేళ కుండీ నుంచి నీళ్లు కారుతుంటే అవి ట్రేలోకి చేరతాయి. మొక్కకు నీళ్లు అవసరమైతే కుండీ ద్వారా ట్రేలో ఉన్న నీటిని పీల్చుకుంటుంది. నీరు వృథా కాదు. కుండీ మాత్రం మట్టితో చేసిందై ఉండాలి.
- మొక్కకు ఎక్కువ నీళ్లు అవసరమనిపిస్తే కొన్ని న్యూస్‌పేపర్లను నీళ్లలో తడిపి బంతుల్లా చేసి వాటిని మొక్క చుట్టూ ఉంచొచ్చు. దీని ద్వారా మొక్క చుట్టూ ఉన్న మట్టి ఎండిపోదు. మొక్క కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుర్తుంచుకోవల్సిన ముఖ్య విషయం ఏంటంటే..అవసరానికన్నా అతిగా నీళ్లు అందితే మొక్క పాడవుతుంది. ఇది దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలి. ❄

డిజిటల్ బ్యాంకింగ్...

కాలం చాలా వేగంగా పరిగెడుతున్నది. దానికి తగినట్టుగా అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలంటే ఎంతో కష్టమైన పని. పరిమిత సమయంలో అన్ని పనులను పూర్తి చేయడమంటే ప్రతి నిమిషం కూడా ఎంతో అమూల్యమైపోతున్నది. ఇలాంటి పరుగుల మధ్య బ్యాంకుకు వెళ్ళాల్సి వస్తే సగం రోజు ఇట్టే గడిచిపోతున్నది. ఇలాంటప్పుడు డిజిటల్ బ్యాంకింగ్ కస్టమర్లకు పెద్ద ఊరట. డిజిటల్ లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా మీరు నిమిషాల్లో డబ్బు లావాదేవీలు, లోన్ కోసం దరఖాస్తు, ఇతర బ్యాంకు సంబంధిత అనేక పనులు చేసుకోవచ్చు. ఇతర సంగతులు వదిలేస్తే ఇందులో మీకు సమయం వృథా కాదు. అలాగే అదనపు చెల్లింపులు ఏవీ అక్కర్లేదు. ఒకసారి డిజిటల్ బ్యాంకింగ్ పద్ధతులు, ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

డిజిటల్ బ్యాంకింగ్ అంటే!

టెక్నాలజీ సహాయంతో బ్యాంకును వినియోగదారుల వద్దకు చేర్చటమే డిజిటల్ బ్యాంకింగ్. ఖాతా తెరవడం నుంచి లావాదేవీల వరకు టెక్నాలజీ వాడటాన్ని డిజిటల్ బ్యాంకింగ్ అంటారు. ఇందులో ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎమ్ మొదలైనవి ఉంటాయి. సులభంగా చెప్పాలంటే డిజిటల్ బ్యాంకింగ్ సహాయంతో మీ బ్యాంకు ఎల్లప్పుడూ మీ తోడుగా ఉండటం. ఎప్పుడైనా దాని సేవలను పొందవచ్చు.



ఖర్చు చాలా తక్కువ...

బ్యాంకు శాఖల్లో సేవల కోసం మెయింటెనెన్స్ చార్జీలకు చాలా సొమ్ము చెల్లించాల్సి వస్తుంది. ప్రతి లావాదేవీకి కస్టమర్ల నుంచి బ్యాంకులు రూ.40 వరకు వసూలు చేస్తాయి. ఇలాగే డబ్బు లావాదేవీలను మీరు ఏటీఎమ్ నుంచి జరిపితే ఖర్చు రూ.18 నుంచి రూ.20 వరకు ఉంటుంది. నిజానికి మీరు లావాదేవీల కోసం డిజిటల్ బ్యాంకింగ్ సహాయం తీసుకుంటే ఫీజు చాలా తక్కువగా ఉంటుంది.

ఎక్కువ వడ్డీ-తక్కువ ఖర్చు...

డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా కస్టమర్ ఏదైనా పెట్టుబడి ప్లాన్ తీసుకుంటే బ్యాంకు వాటిపై ఎక్కువ వడ్డీ చెల్లిస్తుంది. దీనికి కారణం ఏమిటంటే డిజిటల్ బ్యాంకింగ్ ప్రక్రియ బ్యాంకుల ఖర్చులు తగ్గిస్తుంది. దీని ప్రయోజనాన్ని అవి కస్టమర్లకు అందిస్తాయి. అలాగే ఆన్‌లైన్‌లో లోన్ కోసం విజ్ఞప్తి చేసినప్పుడు బ్యాంకులు కస్టమర్లకు చౌక వడ్డీకే లోన్‌లు కూడా అందిస్తుంటాయి.

సమయం ఆదా...

బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలన్నా, డబ్బు పంపించాలన్నా, క్రెడిట్ కార్డ్ పరిమితి పెంచాలన్నా, బిల్లు చెల్లించాలన్నా, లోన్ కోసం విజ్ఞప్తి లేదా బ్యాంకుల ద్వారా అందించే విభిన్న పెట్టుబడి పథకాల గురించి వివరాలు పొందాలన్నా డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా ఇవన్నీ ఇంట్లో కూర్చుని క్షణాల్లో పొందవచ్చు. ఇవే పనుల కోసం మీరు బ్యాంకులకు వెళ్లాల్సివస్తే సమయం చాలా వ్యర్థమైపోతుంది. బ్యాంకు చుట్టూ అనేకసార్లు తిరగాలి. డిజిటల్ బ్యాంకింగ్ జన జీవితాన్ని మరింత సులభతరం చేసిందనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఇందులో చేసే కాస్తంత అశ్రద్ధకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది. మీరు బ్యాంకు శాఖలకు వెళ్లి బ్యాంకు సేవలను పొందేటప్పుడు మీకు సూచనలు అందించే బాధ్యత బ్యాంకు చేతిలో ఉంటుంది. కానీ డిజిటల్ బ్యాంకింగ్‌లో సేవలన్నీ పొందేందుకు మీరే సొంతంగా రిస్క్ తీసుకోవాల్సి వస్తుంది. కనుక ఇలాంటి సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- సైబర్ కేఫ్‌లకు వెళ్లి మీరు ఆన్‌లైన్ బ్యాంకింగ్ చేయకండి. హ్యాకర్లు ఇలాంటి అవకాశాల కోసమే ఎదురుచూస్తుంటారు. కనుక మీ పర్సనల్ కంప్యూటర్ ద్వారానే డిజిటల్ బ్యాంకింగ్ చేయండి.
- డిజిటల్ బ్యాంకింగ్ చేస్తున్న కంప్యూటర్‌లో యాంటీ వైరస్ ఉండటం చాలా అవసరం. హాకర్స్ తరచుగా వైరసఎల ద్వారా వినియోగదారుల ఖాతాలను హ్యాక్ చేస్తారు.
- ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌ను ఎవరికీ చెప్పకండి. అవి అర్థమయ్యేరీతిలో ఎక్కడా రాసి పెట్టకండి.
- మొబైల్ బ్యాంకింగ్ చేస్తున్నట్లయితే ఇందుకోసం బ్యాంకుల మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోండి. ఇది చాలా సురక్షితం. బ్యాంకింగ్ చేసాక అప్లికేషన్‌ను మూసేసి, లాగౌట్ చేయడం మరిచిపోకండి.
- డిజిటల్ బ్యాంకింగ్ సమయంలో మీ ఖాతాలో ఏదైనా అక్రమం జరిగినట్లు అనిపిస్తే వెంటనే బ్యాంకును తెలియచేయండి. ❄

మనసు ఆహ్లాదంగా...

మల్లె, గులాబీ లాంటి పూలూ, నిమ్మ, నారింజ లాంటి ఫలాలూ, దాల్చినచెక్కా, లవంగం లాంటి సుగంధ ద్రవ్యాల నుంచి వచ్చే సువాసనలతో ఒక్క క్షణం మనల్ని మనం మరిచిపోతాం. ఈ పరిమళాలు మన మనసుకు ప్రశాంతతను కలగజేస్తాయనడంలో ఆశ్చర్యమేమీ లేదు. వాటి నూనెలతోనూ ఎన్నో లాభాలున్నాయంటున్నారు పరిశోధకులు.



మల్లె: వీటి నుంచి తీసిన నూనె మనలోని ఆందోళలను తగ్గిస్తుంది. నిద్రలేమీ, ఆందోళనా, ఒత్తిళ్లను తగ్గించడానికి పూర్వకాలం నుంచి ఈ నూనెను వినియోగిస్తున్నారు. మనసును ఆహ్లాదకరంగా మార్చే గుణం ఈ నూనెకు ఉంది.

గులాబీ: ఇది పూలలో మహారాణి. దీని సువాసన మాటల్లో వర్ణించలేం. చాలా సుగంధ పరిమళ ద్రవ్యాల తయారీలో ఈ నూనె వాడతారు. ఈ నూనె మనసును ప్రశాంతంగా ఉంచడమే కాదు, నిస్పృహలను కూడా తరిమేస్తుంది.

లావెండర్: ఇది మూడ్‌ను చిటికెలో మార్చేస్తుంది. ఈ పూల పరిమళం మీకు సాంత్వన కలిగిస్తుంది. నిద్రలేమీ, శ్వాసలో ఇబ్బందులను కూడా తగ్గిస్తుంది.

దాల్చిన చెక్క: ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. ఇవి అలసిన నాడులకు ఉపశమనాన్ని అందించడంతోపాటు కొత్త శక్తిని అందిస్తాయి. ఈ నూనె సువాసనను నేరుగా పీల్చుకోవచ్చు. లేదా కొబ్బరి, ఆలివ్ నూనెలతో కలిపి శరీరానికి మర్దనా చేసుకున్నా హాయిగా ఉంటుంది.

నిమ్మ: తాజా, పుల్లటి రుచి కలిగిన ఈ పండు పరిమళం మనలో నూతనోత్తేజాన్ని పెంపొందిస్తుంది. అలసట, బాధ, ఒత్తిడిగా ఉన్నప్పుడు ఈ నూనెను వాడి చూడండి. వాసన చూసిన కొన్నిక్షణాల్లోనే మీ మూడ్ ఉల్లాసంగా, ఉత్సాహంగా మారుతుంది. అంతేకాదు మీరు చేసే పనులపై ఏకాగ్రత కూడా కుదురుతుంది. ❄

కేంద్రం నిధులివ్వకున్నా.. ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

- బడ్జెట్ ప్రతిపాదిస్తూ మంత్రి యనమల

అమరావతి : కేంద్రం నిధులివ్వకున్నా 2022 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌ను రెవెన్యూ మిగులుతో ప్రతిపాదించడం గమనించాల్సిన అంశమని ఆయన పేర్కొన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.1,91,063.61 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆయన గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసన మండలిలో ఈ బడ్జెట్‌ను పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా శాసనసభలో మంత్రి యనమల ప్రసంగిస్తూ సాధ్యమైన ఆదాయ వనరులను మదింపు చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి విభజన చట్ట ప్రకారం రావలసిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతో ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,50,270.99 కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.28,678.49 కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. 2017-18 బడ్జెట్ అంచనాల కంటే 2018-19 బడ్జెట్ అంచనాలు 21.69 శాతం పెరుగుదలను చూపిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది కంటే రెవెన్యూ వ్యయం సుమారు 19.35 శాతం, క్యాపిటల్ వ్యయం 30.60 శాతం అధికంగా ఉన్నాయన్నారు. రెవెన్యూ మిగులు రూ. 5,2,35.24 కోట్ల మేర ఉంటుందని అంచనా వేశామన్నారు. ఆర్థిక లోటు సుమారు రూ. 24,205.21 కోట్లు ఉంటుందని, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఇది 2.78 శాతం, రెవెన్యూ మిగులు 0.60 శాతం ఉండే అవకాశముందన్నారు. 2017-18 బడ్జెట్ సవరణ అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ.1,27,272.02 కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.22,875.28 కోట్లు, రెవెన్యూ లోటు దాదాపు రూ. 4,018 కోట్లు, ఆర్థిక లోటు 27,603.27 కోట్లు ఉంటుందని వివరించారు.

ఎన్డీయే నుంచీ వచ్చేయాలి

ఒంగోలు : కేంద్ర క్యాబినెట్ నుండి ఇద్దరు మంత్రు లను రాజీనామా చేయించడానికి పరిమితం కాక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుండి వైదొలగాలని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాపై ప్రజల నుంచి వస్తున్న వత్తిళ్లు, వైసీపీ అవిశ్వాస తీర్మానం నేపథ్యంలోనే చంద్రబాబు తలొగ్గారన్నారు. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటన, చంద్రబాబు స్పందన నేపథ్యంలో.... పాదయాత్రలో ఉన్న ఆయన ప్రకాశం జిల్లా సంతరావూరు వద్ద గురువారం ఉదయం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ప్రజాకాంక్షకు తలొగ్గి కేంద్రం నుంచి తప్పుకున్నట్లు చంద్రబాబు ప్రకటించడం అభినందనీయమన్నారు. నెపాన్ని కేంద్రంపై నెట్టాలన్న దురాశతో కేంద్ర మంత్రి పదవులు వదులుకుంటున్నట్లు టీడీపీ ప్రకటించిందని చెప్పారు. రాజీనామాలు చేయాలని నిర్ణయించుకున్నపుడు కేంద్రం పెద్దలతో మాట్లాడాల్సిన అవసరం ఏముంది? కేంద్రం నుంచి వైదొలగినా ఎన్డీయేలో కొనసాగడంపై ఎలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత, నిజాయితీ చిత్తశుద్ధి చాలా ముఖ్యమన్నారు.



అవేవీ చంద్రబాబుకు లేవన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా సంజీవని అన్న చంద్రబాబు... తర్వాత దాని వల్ల ఏమీ ప్రయోజనం ఉండదని అసెంబ్లీలోనే వ్యాఖ్యానించారని జగన్ విమర్శించారు. జైట్లీ ఏడాదిన్నర క్రితం హోదా ఇవ్వడం కుదరదని చెప్పిన రోజునే చంద్రబాబు ఈ పని చేసి ఉంటే హోదా ఈపాటికే వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబుకు తగిన సమయం ఇచ్చేందుకే ఈనెల 21 వరకూ అవిశ్వాసం కోసం ఆగామనీ, ఆయన కోరితే ముందు గానే పెడతామనీ వివరించారు. ఒక వేళ తెలుగుదేశం తీర్మానం పెట్టినా బలపరి చేందుకు తాము సిద్ధమేనన్నారు. 21న రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు రాజీనామాల చేత అవిశ్వాసం తీర్మానం పెట్టిద్దామనీ, అపుడు దేశం మొత్తం చర్చనీయాంశమై కేంద్రం దిగిరాకతప్పదనీ అన్నారు. హోదా ఇవ్వొద్దని తాము ఎప్పుడూ సిఫార్సు చేయలేదని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు చెప్పిన విషయాన్ని ఆయన చదివి వినిపించారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'హోదా' హోరు ఉధృతం

అనంతపురం : విభజన చట్టంలో పేర్కొన్న హామీలు, ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు, విశాఖకు రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమయ్యాయి. తిరుపతిలో వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతపురం జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యాన 'బస్సుయాత్ర' ప్రారంభమైంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి యాత్రను ప్రారంభించారు. బుక్కరాయసముద్రం జంతలూరు నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ ఈ యాత్ర సాగనుంది. కర్నూలులో చేపట్టిన జీపుజాతాను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రారంభించి ప్రసంగించారు. విజయవాడలో సీపీఐ(ఎం) విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 47, 43 డివిజన్లలో పాదయాత్ర జరిగింది. మధురానగర్‌లో దున్నపోతును ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఐదు కోట్ల మంది అభివృద్ధి పట్టని దున్నపోతు ప్రభుత్వం అంటూ దున్నపోతుకు బ్యానర్ కట్టారు. విజయవాడలోని అరండల్‌పేట మెయిన్ రోడ్డులో వైసీపీ నగర మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను వైసీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఆర్‌డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యాన విశాఖ జిల్లా అరకులోయలోని వైఎస్ఆర్ కూడలి వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాంబిల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. దేవరాపల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యాన అర్ధనగ్న ప్రదర్శన, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఉద్యమిస్తున్న సీపీఐ, సీపీఐ(ఎం) , వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులపై లాఠీఛార్జి చేసి అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రాస్తారోకో నిర్వహించారు.

అసహనం..మూర్ఖత్వం : సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విగ్రహాలను కూల్చివేయటమనేది అసహనం, మూర్ఖత్వానికి నిదర్శమని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి వ్యాఖ్యానించారు. లెనిన్, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ విగ్రహాలను ఆరెస్సెస్, బీజేపీ శక్తులు కూల్చివేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సామూహిక విరాళాల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సురవరం మాట్లాడుతూ.. హిందూత్వ ఫాసిస్టు ఆరెస్సెస్ శక్తులను కట్టడి చేసేందుకు వీలుగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించేందుకోసం లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విగ్రహాల కూల్చివేతపై ప్రధాని మోడీ స్పందించకపోవటం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై 15న ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహి స్తున్నట్లు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.యాదానాయక్, ప్రధాన కార్యదర్శి కె. బలరాం తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ నెల 12 నుండి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సమావేశాలలో ఉద్యోగులందరికి సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, పర్మినెంట్ చేయడానికి తీర్మానించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎన్‌హెచ్‌ఎంలోని విభాగాలైనా ఎన్‌ఆర్‌హెచ్‌ఎం, ఎన్‌యూహెచ్‌ఎం, ఎస్‌ఎన్‌సీయూ, ఆర్‌బీఎస్‌కే, ఆయూష్, ఎన్‌ఆర్‌సీ, సీఈఎంఓఎన్‌సీ అర్బన్ హెల్త్ సెంటర్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్స్, పార్మాసిస్ట్‌లు, ప్రోగాం అధికారులు, డాక్టర్‌లు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు, సపోర్టింగ్ స్టాఫ్, అకౌంట్‌టెంట్‌లు తదితర క్యాడర్‌ల సిబ్బంది గత పదేండ్లుగా పనిచేస్తున్నారని, వీరు సమస్యల సాధన కోసం అనేక రూపాల్లో ఆందోళన పోరాటాలు చేసిన కూడా ప్రభుత్వం న్యాయం చేయకపోవడం బాధాకరమని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికి సుప్రీంకోర్టు తీర్పును ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని అన్నారు. సమావేశంలో భూపాల్, ఎండీ ఫసియోద్దీన్, కవిత, సుగుణ, సంజూజార్జ్, వేణుగోపాల్, జె.సుధాకర్, శ్రీనివాస్, ప్రమీల, సరోజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ పార్టీ వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

జేఏసీ చైర్మెన్ కోదండరామ్ నేతృత్వంలో పార్టీ ఏర్పాటు వాయిదా పడింది. ముందస్తుగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ నెల 10న పార్టీ పేరును ప్రకటించాల్సి ఉండగా.. వాయిదా వేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టీఆర్ఎస్ పాలన కొనసాగడం లేదన్న కారణంగా కొత్త పార్టీని ఏర్పాటు చేస్తానని కోదండరామ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ సాధన కోసం 'మిలియన్ మార్చ్' నిర్వహించిన మార్చి 10న కొత్త పార్టీ ఏర్పాటును ప్రకటించాలని భావించారు. అయితే అజెండా తదితర అంశాల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వాయిదా వేసుకున్నట్టు సమాచారం. పార్టీ ఏర్పాటును వచ్చే నెలలో ప్రకటించే అవకాశం ఉంది. కాగా జేఏసీ పార్టీకి 'తెలంగాణ జన సమితి' పేరును ఖరారు చేసుకున్నట్టు ప్రచారంలో ఉంది.

అసెంబ్లీ నిర్వహణపై స్పీకర్ సమీక్ష

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి సమీక్ష నిర్వహించారు. సభలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈమేరకు గురువారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో మండలి చైర్మెన్ స్వామిగౌడ్, డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్‌రావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహచార్యులతో ఆయన సమీక్షించారు. శాసనసభ, శాసనమండలిలలో పోలీసు బందోబస్తు, అసెంబ్లీ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. సభ సజావుగా జరిగేందుకు తీసుకున్న పలు అంశాలపై అసెంబ్లీ కార్యదర్శి నర్సింహచార్యులు ఈ సందర్భంగా వివరిచారు. 28 చోట్ల సెక్యూరిటీ పాయింట్లను గుర్తించి రెండువేల మంది పోలీస్ అధికారులు, అనధికారులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

భార్గవి హంతకులను కఠినంగా శిక్షించాలి

- రజకవృత్తిదారుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు గ్రామానికి చెందిన భార్గవిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి నాగరాజు, ఎంబీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి ఆశయ్య, టిమాస్ జిల్లా కన్వీనర్ కె మల్లేష్, కల్లు గీత సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలరాజు, రజక సంఘం నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించి భార్గవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నాగరాజు విలేకరులతో మాట్లాడారు. భార్గవిని అదే గ్రామానికి చెందిన కసగాని నరేందర్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడని తెలిపారు. తనను పెళ్లి చేసుకోమని భార్గవి బలవంతం చేస్తే హత్య చేశాడన్నారు. భార్గవి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పోలీసులు వెంటనే స్పందించి ఉంటే భార్గవి హత్యకు గురయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. ప్రేమ పేరుతో మోసం చేసిన నరేందర్‌ను కఠినంగా శిక్షించాలని, భార్గవి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో గత పది నెలల్లో మూడు హత్యలు చోటు చేసుకున్నాయని, రజకులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నరేందర్‌ను కఠినంగా శిక్షించాలి - కేవీపీఎస్

ప్రేమించి మోసం చేయడం కాకుండా భార్గవిని హత్య చేసిన నిందితుడు నరేందర్‌ను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

మోడీకి దళారిగా కేసీఆర్

- ఏఐసీసీ కార్యదర్శి కుంతియా
- రాష్ట్రాన్ని దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం
- బస్సు యాత్ర ముగింపు సభలోఉత్తమ్

నవతెలంగాణ-హుజూరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోడీకి దళారిగా వ్యవహరిస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి ఆర్‌సీ కుంతియా విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాచైతన్య బస్సు యాత్ర సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ ఎస్‌ఆర్‌ఎస్పీ అతిథి గృహంలో గురువారం విలేకరుల సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం యాత్ర చిగురుమామిడి మీదుగా సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్, హుజూరాబాద్ చేరుకుంది. అక్కడ ఉమ్మడి కరీంగనర్ జిల్లా అధ్యక్షుడు కటకం మృత్యుంజయం అధ్యక్షతన బహిరంగ ఏర్పాటు చేశారు. సభలో ఆర్‌సీ కుంతియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ బస్సు యాత్రతో కేసీఆర్ గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..

రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి దోచుకుంటున్నారని విమర్శించారు. తమ బస్సుయాత్రకు ఎవరూ రావడం లేదని ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 17 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర సాగిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు.

కేసీఆర్ మూడు రోజులుగా ఫెడరల్ ఫ్రంట్, థర్డ్ ఫ్రంట్ అంటూ మాయమాటలు చెపుతున్నారని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఫ్రంట్ అనేది ఒక బూటకమని అన్నారు.

రైతు ఆత్మహత్యలు ఉండవన్న కేసీఆర్ తెలంగాణ ఏర్పడ్డాక నాలుగు వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వస్తే అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు వడ్డీలేని రుణాలను పెంచుతామని, అభయహస్తం పింఛన్ పునరుద్ధరిస్తామని చెప్పారు. నిరుద్యోగ భృతి రూ.మూడు వేలు ఇస్తామని హామీ ఇచ్చారు.

2019లో కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టి విక్రమార్క, మాజీ ఎంపీలు హన్మంతరావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, సీతక్క, సత్యనారాయణ, నాయకులు పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యసభకు తీవ్ర పోటీ

- ముఖ్యమంత్రి మదిలో ఉన్నదెవరో..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిది-హైదరాబాద్

రాజ్యసభ కోసం టీఆర్ఎస్‌పార్టీ నుండి చాలామంది పోటీపడుతున్నారు. ఖాళీ అయిన మూడు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. పోటీ అనేది ఉండదు. అసెంబ్లీలోని ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం టీఆర్ఎస్‌పార్టీనే మూడు స్థానాల్లో విజయం సాధించనుంది. దీంతో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. రాజ్యసభకు బీసీ అభ్యర్థిని పంపిస్తానని సీఎం కేసీఆర్ చెప్పడంతో అనేకమంది ఎదురుచూస్తున్నారు. రాజయ యాదయ్య, జైపాల్ యాదవ్, నోముల నర్సింహయ్య, బడుగుల లింగయ్యయాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మహిళకు కూడా ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది. తులా ఉమను రాజ్యసభ సభకు పంపించే అవకాశాలు లేకపోలేదు అని టీఆర్ఎస్‌లో చర్చ జరుగుతున్నది. టీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ పేరు మొదటినుండి ప్రచారంలో ఉంది. ఆయనకు గ్యారంటీ అని తెలుస్తోంది. ఎస్సీ నుండి మందా జగన్నాథం, వివేక్, ఇంకా మరికొందరు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఉమా మాధవరెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డిలూ రంగంలో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది.

బీసీల్లో మంత్రుల పేర్లు

ప్రస్తుతం మంత్రులుగా కొనసాగుతున్న మంత్రులు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఈటల రాజేందర్, జోగు రామన్నల్లో ఒకరిని రాజ్యసభకు పంపిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఉపఎన్నికలకు వెళ్లే అంత సాహసం కేసీఆర్ చేయబోరని కూడా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ పేరు కూడా ప్రచారంలో ఉండటం గమనార్హం.

పలు జిల్లాలకు పూర్తిస్థాయి కలెక్టర్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సీఎం కార్యాలయానికి ఇద్దరు ఐఏఎస్‌లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పలు జిల్లాలకు పూర్తిస్థాయి కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇంఛార్జ్ కలెక్టర్లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వారి నుంచి ప్రస్తుతం జాయింట్ కలెక్టర్లుగా పనిచేస్తున్న వారికి ఆయా జిల్లాల పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. 'కలెక్టర్లను నియమించరా?' శీర్షికతో గురువారం 'నవతెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే రోజు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా (1998)ను ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం కార్యదర్శిగా నియమించారు. ఆయనకు పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శాఖ కార్యదర్శిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎమ్ మాణిక్‌రాజ్ (2005)ను కూడా ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం అదనపు కార్యదర్శిగా నియమించారు. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వి వెంకటేశ్వర్లు (2013)ను కలెక్టర్‌గా నియమించి, పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె ధర్మారెడ్డి(2012)ని మెదక్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న టి వినయ్ కృష్ణారెడ్డి (2013)ని జనగాం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. నిర్మల్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శివలింగయ్య (2013)ను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న డి ఆమోయ్‌కుమార్ (2013)ను అదే జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. వరంగల్ రూరల్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎమ్ హరిత (2013)ను అదే జిల్లా కలెక్టర్‌గా నియమించారు.

ఆపరేషన్ వికటించి మహిళ మృతి

- బంధువుల ఆందోళన
- రూ.2లక్షలు ఇచ్చేందుకు యాజమాన్యం హామీ



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

నవతెలంగాణ-హుజూరాబాద్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాక, పుట్టిన బిడ్డ ఆరోగ్యం బాలేదని తెలిసి.. రీకెనలైజేషన్ ఆపరేషన్ చేయించుకున్న మహిళ వైద్యం వికటించి మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని బాధిత కుటుంబీకులు ఆస్పత్రి ముందు ఆందోళన చేశారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో గురువారం జరిగింది. మృతిరాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఆవుల మల్లీశ్వరి(28)-రఘుపతిలకు ఇద్దరు కుమార్తెలు. ఐదు నెలల కిందట చిన్న కుమార్తె పుట్టినప్పుడే మల్లీశ్వరి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అయితే, ఆ చిన్నారి గుండెకు రంధ్రం ఉన్నట్టు ఇటీవల వైద్యులు గుర్తించారు. దాంతో మళ్లీ పిల్లలను కనేందుకు రీకెనలైజేషన్ ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునేందుకు హుజూరాబాద్ పట్టణంలోని రెచెల్ నర్సింగ్‌హోమ్ వైద్యులను మంగళవారం సంప్రదించింది. అందుకు డాక్టర్ స్వరూపరాణి కావాల్సిన వైద్య పరీక్షలు నిర్వహించింది. బుధవారం రాత్రి ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మల్లీశ్వరి పరిస్థితి విషమించి మృతిచెందింది. వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు మృతదేహాన్ని ఆస్పత్రి ఎదుట పెట్టి ఆందోళన చేశారు. వైద్యురాలిపై కఠిన చర్యలు తీసుకొని ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

తెలంగాణ మహిళకు నారీశక్తి పురస్కార్

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణకు చెందిన బండారి జయమ్మకు నారీశక్తి అవార్డు దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నారీశక్తి పురస్కార్-2017 అవార్డులను గురువారం ప్రదానం చేశారు. సెక్స్ వర్కర్ల కుటుంబాలకు రక్షణ, హెచ్ఐవీ నియంత్రణపై చేస్తున్న ఉద్యమానికిగాను రాష్ట్రం నుంచి జయమ్మకు ఈ అవార్డు దక్కింది. అవార్డును గురువారం రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. అవార్డు స్ఫూర్తితో తన ఉద్యమాన్ని మరింత విస్తరిస్తానని, సెక్స్ వర్కర్ల కుటుంబాల రక్షణకు మరింత ధృడ సంకల్పంతో పాటుపడతానని చెప్పారు. అమాయక మహిళలను వేశ్యవృత్తిలోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళా సాధికారత కోసం ఉద్యమాలు

- ఏఐఎమ్ఎస్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం (ఏఐఎమ్ఎస్ఎస్) పిలుపునిచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఆ సంఘం ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎమ్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ ప్రమీల మాట్లాడుతూ.. పసిపిల్లలు, యువతులు, వివాహితులు, వృద్ధ మహిళలు అనే తేడా లేకుండా అందరిపైనా అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయించటమే ఇందుకు కారణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎమ్ఎస్ఎస్ నాయకులు హేమలత, జ్యోతి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోనే ఫ్రంట్ కసరత్తులు !

- ప్రముఖ నగరాల్లో సమావేశాలు
- ఏప్రిల్‌లో సీపీఐ(ఎం) జాతీయ నేతలతో కేసీఆర్ భేటీ?
- జాతీయ మహాసభలు ఇక్కడే ఉండడంతో కలిసేందుకు ఏర్పాట్లు
- ఆయా రాష్ట్రాల పార్టీలతో సంప్రదింపులకు కమిటీలు

జి.వేణుమాధవరావు, నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

జాతీయస్థాయిలో ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో, దానికి సంబంధించిన కసరత్తు హైదరాబాద్‌లోనే జరుగుతున్నది. ఆయా పార్టీల నేతలతో మాట్లాడే సమయంలో జరుగుతున్న పరిణామాలనూ, ప్రత్యామ్నాయాలనూ వివరించేందుకు ఒక ముసాయిదాను రూపొందించే పనిలో ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమయ్యారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఫ్రంట్ ఏర్పాటుకు విధివిధానాలతోనే అన్ని రాజకీయ పార్టీల ముందు ఉంచుతానని కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. విధివిధానాలు నచ్చినవారే తమతో కలిసివస్తారని, గుణాత్మక మార్పు కోసం అడుగు ముందుకు వేయడంలో తప్పు లేదు కదా అన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉంది. ఇందులో ఒక్కొక్కరికి భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని ఆయన చెబుతున్నారు. మేధావులు, ప్రముఖులు, సీనియర్ అధికారులు, సంఘాల నేతల ఆలోచన ప్రకారం ఫ్రంట్ రూపుదిద్దుకుంటుందని టీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. దేశంలోని ప్రముఖ నగరాల్లో సమావేశాలు జరిగినా కసరత్తు మాత్రం హైదరాబాద్ కేంద్రంగానే జరుగుతుందని తెలుస్తోంది. ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ, మరికొంత సమయాన్ని ఫ్రంట్ కోసం సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ ముఖ్యనేతలను కలవడంతో పాటు, రిటైర్డు అధికారులు, మేధావులు, ప్రముఖులతో సమావేశాన్ని నిర్వహించేందుకు కమిటీని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇందులో సీనియర్ మంత్రులతో పాటు, పలువురు ఎంపీలు, సీనియర్ టీఆర్ఎస్ నేతలను ఈ కమిటీలో చేర్చనున్నారు. మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, కేశవరావు, కవిత, వినోద్‌కుమార్, డి.శ్రీనివాస్, మాజీ ఎంపీ మందా జగన్నాథంలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఉంటారని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రాల వారీగా ఈ కమిటీలు ఉంటాయని తెలుస్తోంది.

అదే సమయంలో రాజకీయ పార్టీల నేతలను విడివిడిగా కలుసుకునేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమవుతున్నారు. ముందుగా సీపీఐ(ఎం) జాతీయ నేతలతో సమావేశం అవుతారని వార్తలు వినిపిస్తున్నాయి. గతంలోనే సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరితో మాట్లాడినట్టుగా సీఎం కేసీఆర్ చెప్పిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలతో వెళ్లకూడదని సీపీఐ(ఎం) తీర్మానం చేయబోతున్న తరుణంలో మొదటుగా ఆ పార్టీ నేతలతోనే సమావేశం కావాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు జరగబోతున్నాయి. అందులో భాగంగానే కేసీఆర్ సీపీఐ(ఎం) జాతీయ నేతలు సీతారం ఏచూరి, ప్రకాశ్‌కరత్‌తో పాటు మరికొందరు నేతలను కలుస్తారని గులాబీల్లో ప్రచారం జరుగుతున్నది. దీనిపై త్వరలో ఏచూరితో మాట్లాడి షెడ్యూల్ ఖరారు చేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇవి ఏప్రిల్ మొదటివారంలో ముగియనున్నాయి. సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు కూడా ఏప్రిల్ రెండోవారంలో జరగనున్నాయి. ఆ సందర్భంగానే హైదరాబాద్‌లోనే ఈ భేటీలు ఉంటాయని తెలుస్తున్నది. జాతీయ ఫ్రంట్ కోసం సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో ఈ మహాసభలకు మరింత ప్రాధాన్యత ఏర్పడినట్టయిందని విశ్లేషకులు తెలిపారు. సీపీఐ జాతీయ నేతలను కూడా కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

జాతీయ ఫ్రంట్ చుట్టూనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఈ సారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జాతీయ ఫ్రంట్ చుట్టూనే జరిగే అవకాశం ఉంది. సమస్యలు, ఇతర అంశాల కంటే దీని చుట్టూనే చర్చలు జరుగుతాయి. కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేసినా, వాటిని సీఎం కేసీఆర్ పెద్దగా పట్టించుకునే అవకాశం తక్కువే. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా రాష్ట్రానికి ఉపయోగకరంగా లేదు. విభజన హామీలను విస్మరించింది. రైతులకు లాభం కలిగే రీతిలో బడ్జెట్లో చేర్చలేదు. ఈ అంశాలనే గవర్నర్ ప్రసంగంలో చేర్చుతారని తెలుస్తోంది. 70 ఏండ్ల భారతావనిలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేపట్టిన విధానాలను కూడా ప్రసంగంలో చేర్చుతారని తెలుస్తోంది. ఇంకా ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను చేర్చబోనున్నారు. ఏప్రిల్‌లోనే టీఆర్ఎస్‌పార్టీ ప్లీనరీ ఉండడంతో అందులోనూ ఫ్రంట్ గురించి కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

మయన్మార్ తీరు మారలేదు

కృత్రిమమైన కరువు కాటకాల్ని సృష్టించింది : ఐక్యరాజ్యసమితి

రోహింగ్యాలు తిరిగి వెనెక్కి వస్తే తాము అడ్డుచెప్పమని మయన్మార్ ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తోంది. కానీ అక్కడ జరిగిన దారుణ ఘటనల్ని తలుచుకున్నాక, ఏ ఒక్క రోహింగ్యా శరణార్థి కూడా తిరిగి మయన్మార్ వెళ్లాలని అనుకోవటం లేదు.... సమీప భవిష్యత్తులో రోహింగ్యాలు తిరిగి వెనెక్కి వెళ్లుతారన్న నమ్మకం కూడా లేదు...

మయన్మార్ నుంచి పారిపోయి బంగ్లాదేశ్ వచ్చిన వేలాది రోహింగ్యాలు శరణార్థి శిబిరాల్లో వారి సమస్యలు కాస్త తగ్గినట్టు కనిపించినా పిల్లలపై మాత్రం తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. ఆ చిన్నారుల శరీరాలు, మనసులకు అయినా గాయాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి.

"ఈ పిల్లల్లో కొందరు తల్లిదండ్రులు హతమవ్వడం చూస్తే మరికొంత మంది తూపాకులు పేలడం చూశారు. ఇంకొందరు తమ ఇండ్లు తగలబడటం చూశారు. చాలా మంది పిల్లలు ఆ భయానక ఘటనల ఆలోచనల నుంచి బయటికి రాలేకపోతున్నారు. వీరికి మానసిక చికిత్స చాలా అవసరం. లేకపోతే పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్‌కు గురయ్యే అవకాశం ఉంది" అని యూఎన్‌హెచ్‌సీఆర్ మనోవైద్యురాలు తెలిపారు.

ఆ భయంకర దృశ్యాలను మరిచిపోని చిన్నారులున్నారు. వారి మనస్సులో అవే ఘటనలు నాటుకుపోయాయి. అమ్మ, నాన్నల హత్య లేదా మనుషుల రూపంలో వచ్చి చేసిన విధ్వంసం వారి కండ్ల ముందు కదలాడుతోంది.

ఈ లక్షలాది చిన్నారుల్లో వేలాది పిల్లలకు తల్లిదండ్రులు దూరమయ్యారు. గతంలో అయిన గాయాలు వీరి భవిష్యత్తు గురించి ఆలోచించలేకుండా చేస్తున్నాయి.

సొంత దేశానికే పరాయి వాండ్లయిన ఈ పిల్లల్లో చాలా మంది తమ తల్లిదండ్రులు కండ్ల ముందే హతమవ్వడం చూశారు. నెలలు గడిచినా ఆ గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఈ పిల్లలు పాడుతున్నది మయన్మార్ జాతీయ గీతం. కానీ వారున్న ప్రాంతం బంగ్లాదేశ్ కాక్సస్ బజార్‌లోని రోహింగ్యా శరణార్థి శిబిరం...





న్యూయార్క్ : గతేడాది ఆగస్టులో మయన్మార్‌లో హింస చెలరేగింది. దాంతో దాదాపు ఏడు లక్షల మంది రోహింగ్యాలు కట్టుబట్టలతో ఇండ్లు వదిలి బంగ్లాదేశ్ పారిపోయి వచ్చారు మయన్మార్ సైనికులు రోహింగ్యాలపై దారుణమైన అఘాయిత్యాలకు, దాడులకు పాల్పడు తున్నారు. మరోవైపు ఈ ఆరోపణల్ని మయన్మార్ సైన్యం ఖండిస్తోంది. తాము రోహింగ్యా మిలిటెంట్లతో మాత్రమే యుద్ధం చేస్తున్నా మని తెలుపుతోంది. ఏదేమైనప్పటికీ మయన్మార్‌లో రోహింగ్యాలపై దాడుల ఆగలేదు, ఇంకా కొనసాగుతున్నాయని ఐరాస మానవ హక్కుల విభాగం అసిస్టెంట్ సెక్రటరీ-జనరల్ అండ్రూ గిల్‌మూర్ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని రోహింగ్యా శరణార్థుల శిబిరం కాక్స్ బజార్‌లో తాము జరిపిన పర్యటన ద్వారా అనేక విషయాలు తెలిసాయని, రఖైనే రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల్లో మార్పు చోటుచేసుకోలేదని, కృత్రిమ ఆహార కొరతను సృష్టించి రోహింగ్యాలను వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు...

రఖైన్ రాష్ట్రంలో మయన్మార్ ప్రభుత్వం చేపట్టిన చర్య నేపథ్యంలో అక్కడ ఉండే సుమారు ఏడు లక్షల మంది రోహింగ్యాలు ప్రాణభయంతో దేశం వీడారు. అంతర్జాతీయ సంస్థల ప్రకారం ఇందులో దాదాపు మూడు లక్షల మంది చిన్నారులున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో పిల్లలుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మయన్మార్ చేపట్టిన చర్యను 'జాతి నిర్మూలన' చర్యగా పేర్కొంటూ ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది.

సరిహద్దులో మయన్మార్ సైనికులు.. బంగ్లాదేశ్ ఆగ్రహం

బంగ్లాదేశ్-మయన్మార్ సరిహద్దులో రోహింగ్యాల శిబిరానికి సమీపంలో మయన్మార్ సైనికుల కదలికలు కనిపించాయి. దీనిపై నిరసన వ్యక్తం చేసిన బంగ్లాదేశ్, సైనికులను ఉపసంహరించుకోవాలని మయన్మార్‌కు సూచించింది.

ప్రాణభయంతో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రాన్ని వీడిన రోహింగ్యాలు ఈ ప్రాంతంలోని శిబిరాల్లో తలదాచుకొంటున్నారు. సాంకేతికంగా చూస్తే ఈ ప్రాంతం మయన్మార్ భూభాగంలోనిదే. అయితే ఇది సరిహద్దు కంచెకు వెలుపల ఉంది. కంచెకు కేవలం కొన్ని మీటర్ల దూరంలోనే ఈ ప్రాంతం ఉంది. టోంబ్రు ప్రాంతానికి సమీపంలో రోహింగ్యాల శిబిరాలు ఉన్నాయి. ఇటీవల ఈ శిబిరాలకు సమీపంలో 100 నుంచి 200 మంది వరకు మయన్మార్ సైనికులు కనిపించారు. మెషిన్ గన్నులు, మోర్టార్లు కూడా అక్కడ కనిపించాయని బంగ్లాదేశ్ గార్డులు విలేఖరులతో చెప్పారు.

మయన్మార్ రాయబారిని పిలిపించిన విదేశీ వ్యవహారాలశాఖ

సరిహద్దులో మయన్మార్ సైనికుల కదలికలపై బంగ్లాదేశ్ తాత్కాలిక విదేశాంగ కార్యదర్శి తమ దేశంలోని మయన్మార్ రాయబారిని పిలిపించి, మాట్లాడారు. ఈ పరిణామం గందరగోళానికి దారితీస్తుందని, సరిహద్దుల్లో ఉద్రిక్తతలను పెంచుతుందని చెప్పారు. సరిహద్దులో మయన్మార్ సైనికుల కదలికలు అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని బంగ్లాదేశ్ సరిహద్దు వ్యవహారాల అధికారి బ్రిగేడియర్ జనరల్ ముజిబుర్ రహ్మాన్ 'రాయిటర్స్'తో చెప్పారు. మయన్మార్‌కు నిరసన లేఖను పంపిస్తున్నామని తెలిపారు.

సూకీ మానవ హక్కుల అవార్డు రద్దు

- హోలోకాస్ట్ మ్యూజియం నిర్ణయం

మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై కొనసాగుతున్న హింసాకాండను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ మయన్మార్ ప్రభుత్వ సలహాదారు, నోబుల్ శాంతి పురస్కార విజేత ఆంగ్‌సాన్ సూకీకి అందచేసిన మానవ హక్కుల అవార్డును రద్దు చేయనున్నట్టు అమెరికాకు చెందిన హోలోకాస్ట్ మ్యూజియం ప్రకటించింది. మానవ హక్కుల పరిరక్షణకు ఉద్యమించి విజయం సాధించిన ఆంగ్‌సాన్ సూకీకి 2012లో ఎలీవీసెల్ మానవ హక్కుల అవార్డును ఈ మ్యూజియం ప్రకటించిన విషయం తెలిసిందే. మ్యూజియం నిర్వాహకులు సూకీకి రాసిన లేఖలో ఆమె మౌనం దేశంలో మైనార్టీలపై సైన్యం దాడులను మరింత ప్రోత్సహిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రోహింగ్యాల పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఐరాస ప్రతినిధి వర్గాన్ని అడ్డుకోవటం విచారకరమని, దేశంలో సైనిక పెత్తనంపై ఆమె ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారని హోలోకాస్ట్ మ్యూజియం తన లేఖలో పేర్కొంది. రోహింగ్యాలపై కొనసాగుతున్న మారణ కాండను అడ్డుకుని వారికి సంఘీభావం ప్రకటించి వుంటే బాగుండేదని మ్యూజియం తన లేఖలో అభిప్రాయపడింది. మైనార్టీలపై ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న హింసాకాండ తీవ్రత, పరిస్థితిని అడ్డుకోవటంలో మీ వైఫల్యాన్ని సూచిస్తోందని పేర్కొంది. రోహింగ్యాల ఊచకోత నేపథ్యంలో మసకబారుతున్న సూకీ ప్రతిష్టకు ఇది తాజా ఎదురు దెబ్బ అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

కృత్రిమ కష్టాలు పరిస్థితులు సృష్టిస్తోంది... మయన్మార్ తీరు మారలేదు : ఐరాస అధికారి

మయన్మార్‌లో రఖైనా రాష్ట్రంలో రోహింగ్యా ముస్లింలు ఆకలితో అలమటిస్తున్నారు. తీవ్ర వాదం ప్రబలుతోందని, ఆ పేరుతో ఒక జాతి అంతటినీ లక్ష్యంగా చేసుకోవటాన్ని మయన్మార్ ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని, అంతేగాక ఈ రాష్ట్రం నుంచి వారిని కావాలనే... బలవంతంగా వెళ్లగొట్టేందుకు 'కృత్రిమమైన కరువు కాటకాల్ని' సృష్టించిందని ఐక్యరాజ్యసమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐరాస మానవ హక్కుల విభాగం అధికారి ఇటీవల విడుదల చేసింది. రఖైనే రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా రోహింగ్యాలపై దాడులు జరుగుతున్నాయి. మయన్మార్ సైన్యం కూడా దాడులు జరపటం రోహింగ్యా శరణార్థి సమస్యను తీవ్రతరం చేసింది. తీవ్రవాదం ప్రబలుతోందన్న పేరుతో ఇక్కడ రోహింగ్యాలపై హింసకు పాల్పడుతున్నారు. ఇప్పుడు ఈ రాష్ట్రంలో కృత్రిమమైన కరువు కాటకాల్ని ఏర్పడేలా చేసి వారిని వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాలు నేలమట్టం

- రఖైన్‌లో రోహింగ్యాలు నివసించిన గ్రామాలను మయన్మార్ ప్రభుత్వం బుల్‌డోజర్లతో నేలమట్టం చేస్తోందని 'హ్యూమన్ రైట్స్ వాచ్' సంస్థ గత వారం విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి. ఇలాంటి చర్యలవల్ల, అక్కడ రోహింగ్యాలపై జరిగిన అకృత్యాలకు ఆధారాలు లేకుండా పోయాయని సంస్థ చెప్పింది. రోహింగ్యాలు ఉండి వచ్చిన ప్రాంతాల్లో విచారణ జరిపేందుకు ఐక్యరాజ్యసమితి అధికారులను మయన్మార్ అనుమతించడం లేదు.

వేల మంది రోహింగ్యాలను చంపేశారు

- ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 6,47,000 మందికి పైగా రోహింగ్యాలు బంగ్లాదేశ్‌లోకి వెళ్లారని యంఎస్ఎఫ్ వెల్లడించింది.
- యంఎస్ఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం "ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు మయన్మార్‌లో జరిగిన హింసాత్మక ఘటనల్లో కనీసం 6,700 మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 730 మంది వరకు ఐదేండ్లలోపు చిన్నారులు ఉన్నారు."

కాల్పులు ఆపండి

- ఐరాస డిమాండ్

న్యూయార్క్ : సిరియాలో తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస) డిమాండ్ చేసింది. 2401వ తీర్మానాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చింది. సిరియాలో భద్రతా బలగాలకు, తిరుగుబాటుదారులకు మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈయుద్ధంలో వందలాది మంది మృతి చెందారు. మృతుల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఉన్నారు. సిరియాలో శాంతి స్థాపన కోసం ఐరాస భద్రతా మండలి ప్రయత్నిస్తున్నది. సిరియాలో నెలకొన్న దుర్భర పరిస్థితుల పట్ల భద్రతా మండలి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఘర్షణల విరమణపై చర్చ జరగాలని కోరారు. జనాంతిక చర్చల అనంతరం భద్రతా మండలి అధ్యక్షుడు, ఐరాసలో డచ్ రాయబారి కరేల్ వన్ ఊస్టరామ్ మాట్లాడుతూ పై డిమాండ్ చేశారు. అంతకుమించి సమావేశం వివరాలు వెల్లడించలేదు. గతనెల 24న ఏకగ్రీవంగా ఆమోదించిన 2401వ తీర్మానాన్ని అమలు చేయడంలో జరిగిన వైఫల్యాన్ని చర్చించేందుకు తక్షణమే సమావేశం నిర్వహించాలని ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు కోరాయి.

స్పెయిన్‌లో కదం తొక్కిన మహిళలు

- లింగ వివక్ష రూపుమాపాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్

మాడ్రిడ్ : స్పెయిన్‌లో మహిళా లోకం కదం తొక్కింది. లింగ వివక్ష రూపుమాపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిర్మూలన కోసం చర్యలు చేపట్టాలని మహిళలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాడ్రిడ్ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. మాడ్రిడ్, బార్సిలోనా, వాలెన్సియాతో పాటు 200 నగరాల్లో పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లింగవివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలకు ఐదుగురు మహిళా మంత్రులతో పాటు ప్రముఖ సినీనటి పెనాలోప్ క్రజ్ మద్దతు తెలిపారు. మహిళలు తలపెట్టిన పలు నిరసన కార్యక్రమాల ఫలితంగా రవాణావ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు స్తంభించాయి. 300 రైళ్లను రద్దు చేసుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. పలు వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. యూరోస్టాట్ నివేదిక ప్రకారం...స్పెయిన్‌లో ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు తక్కువ వేతనాలు అందుతున్నాయి. పురుషులకు అందుతున్న వేతనాలతో పోల్చితే మహిళలకు 19శాతం తక్కువగా చెల్లిస్తున్నారు. అంతేగాకుండా, పనిచేస్తున్న ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడుల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి.

అమెరికాలో మంచు తుఫాను

వాషింగ్టన్: అమెరికాను మంచు తుఫాను వణికిస్తోంది. న్యూయార్క్, న్యూజెర్సీల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోవడం, తీవ్రంగా మంచు కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ చూసినా మంచు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయింది. న్యూయార్క్‌లో 6 నుంచి 10 అంగుళాలు, న్యూజెర్సీ, కనెక్టికట్‌లలో 20 అంగుళాల మేర మంచు పేరుకుపోయి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వైపు తుఫానుతో పాటు బలమైన గాలులు కూడా వీస్తుండటంతో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాలుల నేపథ్యంలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు లక్ష ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంచు తుఫాను కారణంగా విమానాల రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే న్యూయార్క్, న్యూజెర్సీ ఎయిర్ పోర్టుల్లో వేల సంఖ్యలో విమానాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దాదాపు 2600 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. దీంతో, ప్రయాణికులు విమానాశ్రయాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులకు జీఎస్టీ టోకరా

డ్రిప్పుల్లో దళిత, గిరిజన రైతులకు వందశాతం సబ్సిడీ లేనట్టే

- జీఎస్టీలో ఏడు శాతం డబ్బులు కట్టాల్సిందే
- రైతులపై కేంద్రం భారం
- ఆందోళనలో అన్నదాతలు

నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి

రైతులను ఉద్యానవన పంటల సాగువైపు మళ్లించేందుకు, నీటి వృథాను అరికట్టేందుకు తీసుకొచ్చిన సబ్సిడీ డ్రిప్పుల పంపిణీపైనా జీఎస్టీ భారం పడుతున్నది. దీంతో ఇక దళిత, గిరిజన రైతులకు డ్రిప్పుల పంపిణీలో వందశాత సబ్సిడీ అందట్లేదు. ఇతర రైతులకు డ్రిప్‌కు 95శాతం, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు 75శాతం సబ్సిడీ ఇస్తున్నారు. కానీ, జీఎస్టీ భారంతో సంగారెడ్డి జిల్లాలో రైతులు ఆందోళన చెందుతున్నారు.



(ఫైల్)

సంగారెడ్డి జిల్లాలో గతేడాది 426 మంది రైతులకు ఉద్యానవన శాఖ పరిధిలో డ్రిప్ ఏర్పాట్ల కోసం లబ్దిదారులను ఎంపిక చేశారు. ఎస్సీలు 86, ఎస్టీలు- 48, బీసీ-126, ఇతరులు - 292 యూనిట్లు అందజేశారు. ఏడాది కింద మోడీ ప్రభుత్వం తెచ్చిన గూడ్స్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ)ని ఉద్యానవనశాఖ పథకాలకూ వర్తింపజేశారు. మొదట్లో 18శాతం జీఎస్టీని వర్తింపజేయడంతో డ్రిప్‌లు ఏర్పాటు చేయాలనుకున్న ఎస్సీ,ఎస్టీ రైతులు వెనక్కితగ్గారు. ఆర్థికంగా ఉన్న ఇతర రైతులు చెల్లించినప్పటికీ ఆరు నెలలుగా ఎస్సీ, ఎస్టీలు మాత్రం జీఎస్టీ చెల్లించేందుకు ముందుకు రాలేదు. ఇటీవలే డ్రిప్, స్ప్రింక్లర్లపై జీఎస్టీని కేంద్రప్రభుత్వం 12శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విధానంలో రైతులు ఎంత తీసుకున్నప్పటికీ ప్రభుత్వ వాటా కింద గరిష్టంగా రూ.5వేలు మాత్రమే చెల్లిస్తున్నది. దీనివల్ల ఎస్సీ, ఎస్టీల్లోని ఆర్థికంగా వెనకబడిన రైతులు మాత్రం నీటి పొదుపు వ్యవస్థల మీద ఆసక్తి చూపట్లేదు. ఉదాహరణకు ఒక ఎస్సీ లేదా ఎస్టీ రైతు డ్రిప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే పూర్తిగా ఉచితంగా ఏర్పాటు చేసుకునేందుకు అవకాశముంది. బీసీలకు, ఇతర రైతులు ఐదెకరాలలోపు భూమి ఉన్నవారికి 80శాతం సబ్సిడీతో ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల డ్రిప్ వ్యవస్థకు కావాల్సిన పెట్టుబడి పూర్తిగా రైతుకు మిగులుతుండేది. జీఎస్టీ తర్వాత ప్రతి రూ.లక్షకు 18వేలు రైతు చెల్లించాల్సి వచ్చేది. దీనివల్ల అనేక మంది ఎస్సీ, ఎస్టీ రైతులు డ్రిప్ వ్యవస్థకు ఏర్పాటుకు విముఖత చూపారు. తర్వాత ఏడు శాతమే అని చెబుతున్నప్పటికీ అందులో మెలిక ఉంది. రూ.లక్ష తీసుకున్న రైతు జీఎస్టీ రూ.12వేలలో ప్రభుత్వ వాటా రూ.5వేలు పోనూ రూ.7వేలనే చెల్లిస్తే సరిపోతుంది. అదే రైతు రూ.5లక్షలు తీసుకుంటే మాత్రం రైతువాటా కింద రూ.55వేలు చెల్లించాలి. రూ. 10 లక్షలు తీసుకుంటే రూ.1.20లక్షలు చెల్లించాలి. అప్పుడు ప్రభుత్వ సబ్సిడీ 88శాతానికి పరిమితమవుతుంది. ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి చెల్లించేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులు ముందుకు రావట్లేదు. డ్రిప్పు సౌకర్యం తీసుకునేందుకు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ఈ ఏడాదిలో సుమవారు ఎనిమిది వందల మంది రైతుల నుంచి డ్రిప్ ఏర్పాట్ల కోసం దరఖాస్తులు వస్తాయని శాఖాధికారులు భావిస్తున్నారు. జీఎస్టీ వచ్చాక వంద శాతం సబ్సిడీ స్థానంలో జీఎస్టీ కోత పెడుతున్నది. ఎక్కువ మొత్తాల్లో తీసుకున్న రైతులకు రూ.5వేలకు మించి జీఎస్టీ భారాన్ని ప్రభుత్వం భరించకపోవడం వల్ల ఆ భారం రైతుల మీదే పడుతున్నది.

జీఎస్టీ భారమే అయినా డ్రిప్ తప్పదు

రెండెకరాల్లో మామిడి తోట పెట్టిన. లక్ష రూపాయల వరకు డ్రిప్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇస్తున్నది. బ్యాంకులో రూ.18వేలు కట్టాలని అధికారులు చెప్పారు. డబ్బులు లేవని మూడ్నెళ్లు ఊరుకున్నం. ఇప్పుడు 12 వేలు కడితే రూ.5వేలు మళ్లీ వస్తాయని ఆఫీసులో చెబుతున్నరు. డబ్బులు ఏర్పాటు చేసుకొని డ్రిప్ తీసుకోవాలని భావిస్తున్నాం. ఖర్చయినా తోటలకు డ్రిప్ ఏర్పాటు చేసుకోక తప్పదుగా.

- నీరుడి చంద్రమౌళి, ముదిమాణిక్యం గ్రామం, పుల్కల్ మండలం

రైతులు జీఎస్టీ చెల్లించేందుకు ముందుకొస్తున్నారు

కేంద్రప్రభుత్వం 18శాతం జీఎస్టీ విధించినప్పుడు రైతులు వెనక్కి తగ్గిన మాట వాస్తవమే. మూణ్నెళ్ల తర్వాత జీఎస్టీని 12శాతానికి తగ్గించింది. అందులోనూ రూ.5వేలు ప్రభుత్వమే రైతులకు అందిస్తున్నది. దీంతో రైతులు డ్రిప్‌లను తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. ప్రభుత్వమిచ్చే జీఎస్టీ మొత్తాన్ని రైతు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నది.

- సోమేశ్వర్‌రావు, జేడీ, ఉద్యానవన శాఖ, సంగారెడ్డి.

ముగ్గురు రైతుల ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్ (నంగునూరు)/ నల్లగొండ రూరల్/ మోటకొండూరు

వ్యవసాయంతో పాటు జీవనోపాధి కోసం తెచ్చిన అప్పులు పెరగడం.. పంటలు చేతికందక ముగ్గురు రైతులు గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం...

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన పేర్నా కొమురయ్య(40) భార్య అంజవ్వతో కలిసి తన మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బోరులో నీళ్లు తగ్గడంతో పంటలను కాపాడుకునేందుకు బావి తవ్వించాడు. చుక్క నీరు పడలేదు. సాగు కోసం ఐసీఐసీఐ, ఆంధ్రాబ్యాంకులో రుణం తీసుకున్నాడు. దీంతోపాటు బావి తోడటానికి తీసుకున్న అప్పుతో కలిపి మొత్తం సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఉన్నాయి. రబీలో వరి, మొక్కజొన్న పంటలు వేయగా మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైస్‌మిల్లులో కూలీగా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని చెరువును నింపేందుకు రంగనాయక సాగర్ కాల్వ నిర్మాణం కోసం కొమురయ్యకు చెందిన రెండెకరాల భూమితో పాటు బోరు గుండా అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఉన్న భూమి పోతే అప్పులు ఎలా తీర్చాలని ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బావి వద్ద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన రైతులు, కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీఆర్ఓ అశోక్, రాజగోపాల్‌పేట ఎస్ఐ చంద్రశేఖర్ పంచానామా నిర్వహించారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ సర్పంచ్ మయోజు చక్రపాణి, రైతు సమైఖ్య మండల కన్వీనర్ వాసరి యాదమల్లు కోరారు.

నల్లగొండలో..

నల్లగొండ పట్టణం సమీపంలోని పానగల్‌కు చెందిన నూకల శ్రీను(38) ఐదు ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. నాలుగెకరాల్లో పత్తి, ఎకరా వరి సాగు చేశాడు. పెట్టుబడుల కోసం మూడు లక్షల రూపాయల వరకు అప్పులు చేశాడు. ఇద్దరు అమ్మాయిలు పెండ్లీడుకొచ్చారు. పంట దిగుబడి తగ్గడం, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు తీరే మార్గం కనిపించలేదు. దీంతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

యాదాద్రి భువనగిరిలో..

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చామపూర్‌కు చెందిన గంగపురం నర్సింహ(65) తన రెండెకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, కంది సాగు చేశారు. దిగుబడి సరిగా రాలేదు. సాగుకు చేసిన రెండు లక్షల రూపాయలు అప్పు ఉంది. ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని డీసీసీ అధ్యక్షులు బూడిద భిక్షమయ్యగౌడ్‌తో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సిరాబోయిన మల్లేశ్ యాదవ్, నాయకులు శిలా బాలక్రిష్ణ. జంపాల నాగచందర్, పల్లె శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు.

మహిళా భవనాల నిర్మాణానికి రూ. 60 కోట్లు

- జీవో 151 జారీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో మహిళా భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈమేరకు జీవో నెంబరు 151 విడుదల చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్, వరంగల్ అర్బన్, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మహిళా భవనాల నిర్మాణం రూ. 60 కోట్లు కేటాయించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులను వీటి కోసం సమ కూరుస్తారు. 2017-18 ఆర్థిక సంవత్సర ప్రతిపాదనల ప్రకారం ఒక్కో భవనానికి రూ. 10 లక్షల మేర ఉపాధి హామీ నిధులు విని యోగించనున్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం. సత్యనారాయణరెడ్డిని ఆదేశించారు.


బలవంతపు బాల్య వివాహ యత్నం

అడ్డుకున్న పోలీసులు

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్పీ

నవతెలంగాణ-జగిత్యాల

కన్నతల్లి చనిపోతే పిల్లల్ని అన్నీ తానై పెంచాల్సిన తండ్రి మరో పెండ్లి చేసుకున్నాడు. పిల్లలను పట్టించుకోకపోగా, కుమార్తెను త్వరగా వదిలించుకోవాలని బాలికకు బలవంతంగా పెండ్లి చేయడానికి సిద్ధమయ్యాడు. విషయం పోలీసులకు తెలియడంతో పెండ్లిని అడ్డుకుని భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో జరిగింది. ఎస్పీ అనంతశర్మ తెలిపిన వివరాల ప్రకారం..



తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న అనంతశర్మ

కొడిమ్యాల మండలం రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు లింగమూర్తికి 9వ తరగతి చదువుతున్న కుమార్తె, ఆరు సంవత్సరాల కొడుకు ఉన్నారు. భార్య లక్ష్మి అనారోగ్యంతో చనిపోయింది. దాంతో లింగమూర్తి సంవత్సరం కిందట మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మొదటి భార్య కుమార్తె, కొడుకును పట్టించుకోవడం మానేశాడు. కుమార్తెకు త్వరగా పెండ్లి చేసి పంపించేయాలని నిర్ణయించుకున్నాడు. గ్రామస్తులు కొడిమ్యాల ఎస్ఐ సతీష్‌కు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికొచ్చేసరికే భార్యాభర్తలిద్దరూ పరారయ్యారు. గంగాధర మండలం కొండన్నపల్లిలో పట్టుకొని గురువారం జిల్లా ఎస్పీ అనంతశర్మ ముందు ప్రవేశపెట్టారు. తండ్రి లింగమూర్తి, సవతి తల్లి పల్లవితో పాటు గ్రామ వీడీసీ చైర్మన్, ఐసీడీఎస్ అధికారి నర్సింగారాణి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయిని వేధింపులకు గురిచేసినా, మళ్లీ పెండ్లి ప్రయత్నాలు మొదలుపెట్టినా కేసు పెట్టి జైల్లో పెడతామని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో హామీ పత్రం రాయించుకుని పిల్లల రక్షణపై నిఘా వేసి ఉంచాలని కొడిమ్యాల ఎస్ఐ సతీష్‌కు సూచించారు. మహిళా కానిస్టేబుల్ సరస్వతికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

అమ్మను నాన్నే చంపేశాడు: బాలిక

ఎల్ఐసీ డబ్బుల కోసం అమ్మను నాన్నే చంపేశాడు. ఆ డబ్బుల విషయం అడిగితే ప్రతి రోజూ వేధిస్తున్నాడు. నన్ను వదిలించుకోవాలని బలవంతపు పెండ్లి చేస్తున్నాడని ఎస్పీ ముందు బాలిక ఏడుస్తూ చెప్పింది.

అమర్ అక్బర్ ఆంటోనీ షురూ..



'అమర్ అక్బర్ ఆంటోనీ' చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

రవితేజ, అను ఇమ్మాన్యుయేల్ నాయకానాయికలుగా శ్రీనువైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.6గా రూపొందుతున్న చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోనీ'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం వైభవంగా జరిగింది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శ్రీనువైట్ల పెద్దకుమార్తె ఆనంది వైట్ల క్లాప్‌నివ్వగా, రెండవ కుమార్తె ఆద్య వైట్ల కెమెరా స్విచాన్ చేశారు. శ్రీనువైట్ల గౌరవ దర్శకత్వం వహించగా, చిత్ర కథానాయకుడు రవితేజ బౌండెడ్ స్క్రిప్ట్‌ను శ్రీనువైట్లకు అందజేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనువైట్ల మాట్లాడుతూ,'చాలా గ్యాప్ తర్వాత రవితేజతో చేస్తున్న చిత్రమిది. ఏడాది క్రితం ఈ చిత్రకథకు బీజం పడింది. పది నెలలపాటు కష్టపడి స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ చేశాం. రవితేజతోపాటు మా నిర్మాతలకూ ఈ చిత్రకథ బాగా నచ్చింది. షూటింగ్ మొత్తం యునైటెడ్ స్టేట్స్‌లోనే చేస్తాం. న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీతోపాటు అక్కడి ఇతర లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపనున్నాం. అత్యధికశాతం అమెరికాలో షూటింగ్ జరుపుకోనున్న మొట్టమొదటి చిత్రమిది. కష్టతరమైన ఈ భారీ షెడ్యూల్స్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసిన మా నిర్మాతలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. స్టార్ కమెడియన్, హీరో సునీల్ ఈచిత్రంలో ఫుల్ లెంగ్త్ కామిక్ రోల్ ప్లే చేస్తున్నారు. అలాగే లయ, ఆమె కుమార్తె శ్లోకతోపాటు రవితేజ తనయుడు మహాధన్ కూడా ముఖ్యపాత్రలు పోషించడం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ' అని చెప్పారు.

'మా సంస్థకు ఇదొక స్పెషల్ ప్రాజెక్ట్. డెఫినెట్ హిట్ ప్రాజెక్ట్ అవుతుంది. టాలీవుడ్‌లో బాగా పేరొందిన క్రేజీ కాంబినేషన్ రవితేజ, శ్రీనువైట్లతో ఈ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. రవితేజ సరసన అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి ఎస్.ఎస్.థమన్ సంగీతం సమకూరుస్తున్నారు' అని నిర్మాతలు తెలిపారు.



అనుపమ పరమేశ్వరన్, రామ్

హలో గురు ప్రేమ కోసమే..

రామ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వంశీ పైడిపల్లి క్లాప్ నివ్వగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచాన్ చేశారు. హరీష్‌శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఎర్నేని నవీన్, స్రవంతి రవికిషోర్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందజేశారు. 'ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈనెల 12 నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలకు తనదైన సంగీతాన్ని అందించిన దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి కూడా స్వరాలు సమకూరుస్తున్నారు. 'సినిమా చూపిస్త మావ', 'నేను లోకల్' వంటి వరుస విజయాల తర్వాత త్రినాథరావు దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడం, దిల్‌రాజు, రామ్ వంటి పవర్‌ఫుల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం కావడంతో సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి' అని చిత్ర బృందం తెలియజేసింది.

నవచిత్రం

పెళ్ళి తర్వాత తొలిసారి..



నాగ చైతన్య, సమంత

'ఏ మాయ చేశావే', 'మనం' వంటి చిత్రాల తర్వాత నాగచైతన్య, సమంత కలిసి ఓ చిత్రంలో నటించబోతున్నారు. పెళ్ళి తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది కావడం విశేషం. 'నిన్ను కోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.2గా ఈ చిత్రం నిర్మితం కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది మాట్లాడుతూ, 'పెళ్ళి తర్వాత నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న చిత్రమిది. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందబోయే ఈచిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనుంది. మా సంస్థ నిర్మాణ సారథ్యంలో రూపొందుతున్న రెండవ చిత్రమిది. తొలి చిత్రంగా 'కృష్ణార్జునయుద్ధం' చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది' అని చెప్పారు.

దేవిశ్రీకి నచ్చిన కాటుకెట్టుకొచ్చిన చందమామ..



సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌తో 'యు.. కథే హీరో' చిత్ర యూనిట్ సభ్యులు

శ్రీమతి నాగానిక సమర్పణలో కొవెరా క్రియేషన్స్ పతాకంపై నూతన దర్శకుడు కొవెర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యు'. కథే హీరో క్యాప్షన్. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈచిత్రంలోని తొలిపాటను సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ పాట చాలా ఆహ్లాదకరంగా ఉంది. వినగానే చాలా బాగా నచ్చేసింది. ఈ పాటతోపాటు సినిమాలోని అన్ని పాటలు మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. చిత్ర సంగీత దర్శకుడు సత్య మహావీర్‌కు అభినందనలు. మంచి కథ, కథనం, పాటలతో రూపొందుతున్న ఈచిత్రం మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'ఈ చిత్రంలోని మొదటి పాటను దేవిశ్రీప్రసాద్ చేతుల మీదుగా లాంచ్ చేయటం చాలా ఆనందంగా ఉంది. సత్య మహావీర్ అద్భుతమైన సంగీతాన్ని అందించి, మా సినిమాని మరో స్థాయికి చేర్చారు. మిగిలిన పాటలను కూడా త్వరలోనే విడుదల చేస్తాం. గతంలో నేను విజయేంద్రప్రసాద్ వద్ద పని చేశాను. అలాగే కొన్ని సినిమాలకు రైటర్‌గానూ వర్క్ చేశాను. తొలి ప్రయత్నంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాను' అని దర్శకుడు కొవెరా తెలిపారు. 'కాటుకెట్టుకొచ్చిన చందమామ..' అంటూ సాగే తొలిపాటను దేవీశ్రీ విడుదల చేయటం సంతోషంగా ఉంది. ఈ పాటను సురేష్ బనిశెట్టి రాయగా, రఘురాం ఆలపించారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల కానున్న ఈ ఆల్బంలోని పాటలన్ని కథానుగుణంగా ఉంటాయి' అని సంగీత దర్శకుడు సత్య మహావీర్ అన్నారు. 'ఈ సినిమాకి వర్క్ చేయటం చాలా ఆనందంగా ఉంది. అందరూ చెప్పే మాటే అయినప్పటికీ ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. అందుకు ఈ చిత్రానికి 'కథే హీరో' అని క్యాప్షన్ పెట్టాం' అని స్క్రీన్‌ప్లే రచయిత మధు అన్నారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈచిత్రంలో కొవెర, హిమాన్షి కాంత్రగడ్డ నాయకానాయికలుగా నటిస్తుండగా, తనికెళ్ళభరణి, శుభలేఖ సుధాకర్, రాఘవ, నాగి, రోహిణి, సంధ్య, స్వప్నారావ్, లహరి, దొరబాబు, కోయకిషోర్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



కంగనా రనౌత్

నయనతార నట విశ్వరూపం..



నయనతార

నయనతార ప్రధాన పాత్రలో గోపీ నైనర్ తమిళంలో రూపొంది ఘనవిజయం సాధించిన చిత్రం 'ఆరమ్'. 'శివలింగ', 'విక్రమ్ వేధా' వంటి విజయవంతమైన చిత్రాలతోపాటు 450కి పైగా చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ఆర్.రవీంద్రన్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మైంట్స్ అధినేత శరత్‌మరార్ సంయుక్తంగా ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై 'ఆరమ్' చిత్రాన్ని 'కర్తవ్యం'గా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ,'తమిళంలో 'ఆరమ్' చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులోనూ అదే స్థాయి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం మాకుంది. ఉమెన్స్ డే స్పెషల్‌గా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయటం ఆనందంగా ఉంది. ఇదొక పొలిటికల్ డ్రామా చిత్రం. నిత్యం మనం టీవీ ఛానెల్స్‌లో చూస్తున్న బోరు బావిలో పిల్లలు పడిపోతే, అక్కడ జరుగుతున్న ఆపరేషన్‌నే కథా వస్తువుగా తీసుకుని సహజత్వానికి దగ్గరగా, ప్రతి ఒక్కరి హృదయం ద్రవించేలా, అద్భుతమైన నెరేషన్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ ఆపరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ పాత్రలో నయనతార నట విశ్వరూపానికి తమిళ ప్రేక్షకులు జేజేలు కొట్టారు. అంతేకాదు ఈచిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు సైతం ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆతృతతో ఉన్నారు. తెలుగులో అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈనెల 16న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం : జిబ్రాన్, కెమెరా : ఓం ప్రకాష్, ఎడిటింగ్ : గోపీకృష్ణ, నిర్మాతలు : శరత్‌మరార్, ఆర్.రవీంద్రన్.

మెంటల్ హై క్యా..?

విలక్షణ పాత్రలకు కంగనా రనౌత్ పెట్టింది పేరు. ఆమె ఎంచుకునే సినిమాలు, అందులోని పాత్రలే కాదు ఆయా సినిమాల టైటిల్స్ కూడా చాలా వెరైటీగా ఉంటాయి. తాజాగా ఆమె నటిస్తున్న చిత్రం ' మెంటల్ హై క్యా'. ఈ టైటిల్ వినటానికి ఎంత ఆశ్చర్యకరంగా ఉందో, ఈ చిత్ర పోస్టర్లు కూడా అలాగే ఉన్నాయి. చేతి నుంచి రక్తం కారుతూ మాంసాన్ని కట్ చేస్తే పెద్ద కత్తితో రాజ్‌కుమార్‌రావు ఆపిల్‌ని కట్ చేయటం, బాత్ డబ్‌లో కూర్చుని బ్రెడ్‌ని కట్ చేస్తే కత్తిలో చూస్తూ పెదాలకు కంగనా లిప్‌స్టిక్ వేసుకోవడం, ఇద్దరూ చెవులకు చేతులను అడ్డుగా పెట్టుకుని పెద్దగా అరవడం వంటి తదితర డిఫరెంట్ కాన్సెప్ట్‌తో, హావభావాలతో, విచిత్రమైన వస్తువుల కాంబినేషన్‌లో రూపొందిన పోస్టర్స్ చూస్తే నిజంగా 'మెంటల్ హై క్యా..' అనక మానరు. టైటిల్, పోస్టర్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఈ సినిమాపై మంచి క్రేజ్ ఏర్పడింది. అంతేకాదు సహజత్వానికి పెద్ద పీట వేసే కంగనా, రాజకుమార్‌రావులు తొలిసారి నటించడం కూడా అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రకాష్ కొవెలమూడి దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని ఏక్తాకపూర్ నిర్మిస్తున్నారు. గతేడాది 'రంగూన్', 'సిమ్రాన్' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన కంగనా ప్రస్తుతం 'మణికర్ణిక' (ద క్వీన్ ఆఫ్ ఝాన్సీ) చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు.

నయా సినిమా నోటా..



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, మెహరీన్ జంటగా 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'నోటా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్ రాజా ప్రొడక్షన్ నెం.14గా నిర్మిస్తున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను గురువారం సాయంత్రం విడుదల చేశారు. సత్యరాజ్, నాజర్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : సి.ఎస్.శ్యాం, కెమెరా : శాంత, ఆర్ట్: కిరణ్, దర్శకత్వం : ఆనంద్ శంకర్, నిర్మాత : కె.ఇ.జ్ఞానవేల్‌రాజా.



కృతి సనన్

డిఫరెంట్ రోల్..!

ఇటీవల 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' వంటి భిన్న చిత్రాన్ని ప్రేక్షకులకు అందించిన దర్శకుడు మోహిత్ సూరి తాజాగా మరో భిన్న కాన్సెప్ట్‌తో ఓ సినిమాను రూపొందించబోతున్నారు. ఇందులో నాయకానాయికలుగా ఆదిత్యరాయ్ కపూర్, కృతిసనన్ నటిస్తున్నారు. కథతోపాటు ఇందులోని పాత్రలు సైతం చాలా డిఫరెంట్‌గా ఉంటాయని, అందుకే ఈ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు కథానాయిక కృతి చెబుతోంది. దీంతోపాటు 'వెల్‌కమ్ టు న్యూయార్క్'లోనూ కృతి నటిస్తోంది.

నాలో ప్రేమ నువ్వేనా..!

జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై వాసుదేవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నాలో ప్రేమ నువ్వేనా..'. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్ర లోగోను ఇటీవల సినిమాటోగ్రాఫర్ ఛోటా.కె.నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు వాసుదేవ్ మాట్లాడుతూ,'ఇదొక న్యూ ఏజ్ లవ్ స్టోరీ. ప్రేమ కథా చిత్రాల్లో ఇదొక వైవిధ్యమైన సినిమాగా నిలిచిపోతుంది. ఛోటా.కె.నాయుడుగారు మా చిత్ర లోగోను ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. త్వరలోనే పాటలను కూడా విడుదల చేస్తాం. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.



అవని

అద్భుతమైన గ్రాఫిక్స్..



పి.డి.రాజు, జాన్‌బాబు, భాను చందర్

సువర్ణ క్రియేషన్స్ పతాకంపై జాన్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'తొలికిరణం'. భానుచందర్, పి.డి.రాజు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈచిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో భానుచందర్ మాట్లాడుతూ,'తొలికిరణం అంటే 'ఫస్ట్‌లైట్' అని అర్థం. ఏసుప్రభుకు సంబంధించి అనేక చిత్రాలొచ్చాయి. కానీ వాటితో పోల్చితే ఇది చాలా కొత్తగా ఉంటుంది. ఏసు జీవిత కథ ఆధారంగా క్రీస్తు పుట్టిన దగ్గర్నుంచి, మరణించేంత వరకు మాత్రమే మనకు తెలుసు. అయితే ఈచిత్రంలో చనిపోయిన 3 రోజుల తర్వాత ఏసు బతికొచ్చి ఏం చేశారు?, భక్తులకు ఎటువంటి బోధనలు చేశారనే విషయాలు ఇందులో ఉంటాయి. ఇజ్రాయెల్‌కు వెళ్ళి బాగా రీసెర్చ్ చేసి తీసిన చిత్రమిది. క్రీస్తు పాత్రలో పి.డి.రాజు ఒదిగిపోయారు. ఆయన్ని చూస్తుంటే నిజంగా ఆ ఏసుని చూసిన అనుభూతి కలుగుతుంది. ఇందులో క్రీస్తు మనిషి కాదు దేవుడు ఎలా అయ్యాడని తెలుసుకోవడానికి వచ్చిన హనుమంత్ యూసుఫ్ పాత్రను పోషించాను. త్వరలోనే దర్శకుడు జాన్‌బాబు దర్శకత్వంలో మా అబ్బాయి హీరోగా ఓ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. 'ఈ చిత్రంలో దాదాపు 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయి. వీటిని లండన్‌లో చేయించాం. క్వాలిటీ వర్క్ కోసం బాగా ఆలస్యమైంది. అయినప్పటికీ అద్భుతమైన గ్రాఫిక్ వర్క్ వచ్చింది. 8 కోట్ల రూపాయల బడ్జెట్‌తో నిర్మించిన చిత్రమిది. క్రీస్తు జీవితగాథను ఎందరో స్మరించుకుని, ఆయన దీవెనెలు పొందాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నా తదుపరి చిత్రం భానుచందర్ తనయుడి జయంత్‌తో ఉంటుంది. ఆ చిత్ర వివరాలను త్వరలోనే తెలియజేస్తాను' అని దర్శకుడు జాన్ బాబు తెలిపారు.

సోషల్ మీడియా నేపథ్యంలో..



శ్రీధర్ మర్రి

విజయ్ దేవరకొండ, శివానీసింగ్ జంటగా గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈచిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత శ్రీధర్ మర్రి మీడియాతో మాట్లాడుతూ,'వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ చేసినప్పటికీ చిన్నప్పట్నుంచీ నాకు కథలు రాయటం, చిన్న పిల్లలతో నాటకాలు వేయించడమంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే ఇప్పుడు సినిమాలోకి రంగంలో వచ్చాను. మన చుట్టూ ఉన్న పరిస్థితులను ఆధారంగా చేసుకుని ఈచిత్రకథను తయారు చేసుకున్నాను. అందరూ టెక్నాలజీ మాయలో పడిపోయి బంధాలకు, అనుబంధాలకు దూరమైపోతున్నారు. దీంతో అందరి మధ్య అంతరం పెరిగిపోయింది. అంతేకాదు మన చుట్టూ ఉన్న వారితో కంటే ఆన్‌లైన్‌లో స్నేహాలు, సంబంధాలు ఎక్కువైపోయాయి. ప్రతి చిన్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాం. కంపెనీలు తమ లాభాల కోసం రకరకాల ఆకర్షణలతో హై టెక్నాలజీ వస్తువులను తయారు చేస్తున్నారు. ఆ వస్తువులకు మనం బానిసలైపోతున్నాం. నేను ప్రిపేర్ చేసిన కథను ఇతర నిర్మాతలు నమ్మరు కాబట్టి నేనే నిర్మాతగా ఈచిత్రాన్ని నిర్మించాను. ఇదొక హై కాన్సెప్ట్ మూవీ. ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మల్కాపురం శివకుమార్ ముందుకు రావడం ఆనందంగా ఉంది. విజయ్‌దేవర కొండ నటించిన 'పెళ్ళిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో పోలిస్తే ఈ చిత్రంలోని ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. అలాగే ఇది కూడా ఓ డిఫరెంట్ సినిమా. ఇలాంటి బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేస్తేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. నేను చెప్పాలనుకున్న మెసేజ్‌ను సినిమా రూపంలో చూపించాను. విజయ్‌దేవర కొండ చాలా మంచి వ్యక్తి. బాగా బిజీగా ఉన్న కారణంగా ఆయన ఈ చిత్ర ప్రమోషన్‌కి రాలేకపోయారు. అంతేతప్ప మా మధ్య ఎలాంటి గొడవలు లేవు. నేను డబ్బులు సంపాదించడానికి ఇండస్ట్రీకి రాలేదు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి మంచి ఐడియాలజీతోనే సినిమాలను నిర్మించేందుకు ప్రయత్నిస్తాను' అని చెప్పారు.



గౌతమి

ఎప్పుడూ చూడని వైనం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నటి గౌతమి ఓ వీడియో సాంగ్‌ను గురువారం విడుదల చేశారు. ఈ వీడియో సాంగ్‌కు 'గౌతమి' అనే టైటిల్ పెట్టారు. 'ఎవరూ రాయనిది ఈ కథనం.. ఎప్పుడూ చూడని వైనం..' అంటూ సాగే పాట ఆద్యంతం భావోద్వేగ భరితంగా ఉంది. ఆడపిల్లలను వదిలించుకోవాలనుకోవడం, దత్తత ఇవ్వడం వంటి వాటితోపాటు ఓ ఆడశిశువును కుక్క నోటితో పట్టుకున్న వంటి తదితర విజువల్స్ కంట తడిపెట్టిస్తాయి. మహిళలకు ఈ పాట అంకితం అంటూ గౌతమి ట్వీట్ చేశారు.

గురుకుల టీచర్లపై పోలీసుల జులుం

3తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన మినీ గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ప్రగతి భవన్ ముట్టడించారు. అక్కడే బైఠాయించారు. నినాదాలు చేశారు. దీంతో ప్రగతి భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు, ఉద్యోగులకు వాగ్వాదం, తోపులాట జరిగింది. తోపులాటలో ఒక మహిళ స్పృహ తప్పిపడిపోయింది. అరుపులు కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అనంతరం పోలీసులు మహిళలను ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్‌లో పడేశారు. ఒక మహిళా ఉద్యోగి సొమ్మసిల్లి పడిపోయింది. అయినా పోలీసులు మానవత్వం చూపించకుండా లాఠీలు ఝులిపించారు. మహిళలని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్టు కొట్టారు. చివరికి అరెస్టు చేసి తీసుకెళ్లారు. అంతకు ముందు గిరిజన శాఖ మంత్రి అజ్మీర చందూలాల్ ఇంటిని ముట్టడించగా సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సారి ఇలాగే చెబుతున్నారని ఆగ్రహించి ఇంటి ఎదుట 3 గంటల పాటు బైటయించారు. అక్కడి నుండి మహిళలు ప్రగతి భవన్‌కు బయలుదేరారు. దీంతో పోలీసులకు ఉద్యోగుల మధ్య తోపులాట జరిగింది. రాష్ట్ర కన్వీనర్ వి. నిర్మల సొమ్మసిల్లి పడిపోయారు. ఒక మహిళా ఉద్యోగి చేతికి గాయమైంది. అనంతరం గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారినుద్దేశించి ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఏఎఆర్ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మూడ్ శోభన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 29 గిరిజన రెసిడెన్షియల్ మినీ గురుకులం (బాలికల) పాఠశాలలు 1999-2000 సంవత్సరంలో ప్రారంభమయ్యాయని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది తక్కువ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. అందరూ ఉపాధ్యాయులు బిఇడి, టిటిసి, టెట్‌లలో అర్హత పొంది ఎంతో మంది గిరిజన బాలికలను ఉన్నత స్థానాలకు ఎదిగే విధముగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు పొందే వయే పరిమితి దాటిపోయిందని గుర్తు చేశారు. మినీ గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నెలకు రూ. 2వేలు, బోధనేతర సిబ్బందికి రూ. 750 నుంచి రూ.1500లకు పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో ప్రభుత్వం ఇచ్చే రూ. 4వేల వేతనంతో బ్రతకడం సాధ్యమా అని ప్రశ్నించారు. 2004-05 సంవత్సరంలో కెజిబివి పాఠశాలలు కూడా ఒకే స్కీం కింద ప్రారంభమయ్యాయని తెలిపారు. వారికి ఇప్పటి వరకు మూడు సార్లు వేతనాలు పెంచారని, వారితో పోల్చిచూస్తే కేంద్ర భ్రుత్వ నిధులతో పని చేస్తున్న మినీ గురుకులాల కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వెంటనే జిఓనెం.3 ప్రకారం టీచర్లకు రూ. 18వేలు, వర్కర్లకు రూ.10,000 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, పి. కమల, యు. వెంకటమ్మ, హైమావతి, కవిత, సుమలత, శారద, సుగుణ, అలివేలు, రజిని, పూల్‌బాయి, సుశీలలతో పాటు 180 మంది పాల్గొన్నారు.



మినీ గురుకుల ఉపాధ్యాయుల3 పర్మినెంట్ చేయాలి

తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ)

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను తక్షణమే పర్మినెంట్ చేయాలని తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి యాదయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేస్తామని, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన మాటలు సీఎం గుర్తు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే వారిని అణగదొక్కాలని చూస్తే ప్రభుత్వాలు నిలబడవని పేర్కొన్నారు.

వేతనాలు పెంచమని కోరడం, ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేయడం వారి హక్కుగా భావించాలన్నారు. ఉపాధ్యాయుల సంఘానికి తల్లిదండ్రుల సంఘం మద్దతు ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

80 శాతం సబ్సిడీ..

3తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే అత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీలు)కు చెందిన వారికి కూడా స్వయం ఉపాధి పథకాల్లో ఆర్థిక సహకార మందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ విషయంలో వారికి సబ్సిడీలను కూడా అందిస్తామని.. అందుకవసరమైన చర్యలు తీసుకో వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సదరు ఫైలుపై ఆయన గురువా రం సంతకం చేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లను కేటాయించామని గుర్తుచేశారు. రాబోయే బడ్జెట్‌లో కూడా నిధులు కేటా యిస్తామని తెలిపారు.

వాటితో ఎంబీసీ కులాల్లోని పేద యువతకు ఆర్థిక సహకారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో వివిధ పథకాలను రూపొందించి అమల్జేస్తామని తెలిపారు. బీసీలకు అమలు చేస్తున్న ఎకనామిక్ సపోర్టు స్కీమ్‌లకు సంబంధించి గతంలో లక్ష రూపాయలకు రూ.60 వేలు (60 శాతం) సబ్సిడీనిచ్చేవారని చెప్పారు. ఆ సబ్సిడీ ఎంతమాత్రమూ సరిపోదని.. మరింతగా పెంచాలని అన్నారు. అలాగే లక్ష రూపాయల నుంచి రూ.12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

లక్ష రూపాయల వరకు తీసుకునే ఆర్థిక సహకా రంలో రూ.80 వేలు (80 శాతం), రెండు లక్షల వరకు సహకారం తీసుకునే వారికి రూ.లక్షా 40 వేలు (70 శాతం), రెండు లక్షల నుంచి 12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పే వారికి 60 శాతం (గరిష్టంగా రూ.5 లక్షలు) సబ్సిడీని ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వీటి విషయంలో స్పష్టత వచ్చిన ందున ఎంబీసీల కోసం అమల్జేయాల్సిన పథకాలకు వెంటనే రూపక ల్పన చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉన్నతాధికారులను ఆదేశించారు.

అసహనం..మూర్ఖత్వం...

- విగ్రహాల కూల్చివేతపై సురవరం

3తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విగ్రహాలను కూల్చివేయటమనేది అసహనం, మూర్ఖత్వానికి నిదర్శమని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి వ్యాఖ్యానించారు. లెనిన్, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ విగ్రహాలను ఆరెస్సెస్, బీజేపీ శక్తులు కూల్చివేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సామూహిక విరాళాల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సురవరం మాట్లాడుతూ.. హిందూత్వ ఫాసిస్టు ఆరెస్సెస్ శక్తులను కట్టడి చేసేందుకు వీలుగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించేందుకోసం లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విగ్రహాల కూల్చివేతపై ప్రధాని మోడీ స్పందించకపోవటం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం ఉద్యమాలు

- ఏఐఎమ్ఎస్ఎస్

3తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం (ఏఐఎమ్ఎస్ఎస్) పిలుపునిచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఆ సంఘం ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎమ్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ ప్రమీల మాట్లాడుతూ.. పసిపిల్లలు, యువతులు, వివాహితులు, వృద్ధ మహిళలు అనే తేడా లేకుండా అందరిపైనా అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయించటమే ఇందుకు కారణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎమ్ఎస్ఎస్ నాయకులు హేమలత, జ్యోతి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

కోనేరులో ముగ్గురు అన్నదమ్ములు మృతి

జాతరకు వెళ్లి3కుటుంబంలో విషాదం

3తెలంగాణ-అడ్డాకుల

కుమారులు, కోడళ్లతో సంతోషంగా జాతరకు వెళ్లిన తల్లిదండ్రులకు పుట్టెడు శోకం మిగిలింది. స్నానం చేసేందుకు కోనేరులో దిగిన ముగ్గురు కుమారులూ ప్రమాదవశాత్తు మునిగిపోయి చనిపోయారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండల పరిధిలోని కందూరులో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి...

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం కమలోద్దీన్‌పూర్‌కు చెందిన కేశవులు, చంద్రమ్మ దంపతులు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏనుగొండలో నివాసముంటున్నారు. వీరికి రవికుమార్(27), పవన్‌కుమార్(25), ఆంజనేయులు (19) కుమారులు. రవి ఆటో నడుపుతుండగా, పవన్ ప్రయివేటు దవాఖానలో సెక్యూరిటీ గార్డుగా, ఆంజనేయులు హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వీరి కుటుంబమంతా కలిసి గురువారం కందూరు శ్రీరామలింగేశ్వరస్వామి జాతరకు వెళ్లారు. అక్కడ కోనేరులో స్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, బురద ఉన్న విషయం తెలియక రవి, పవన్, ఆంజనేయులు ఒకరి తర్వాత ఒకరు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో ముగ్గురూ బురదలో ఇరుక్కుని మునిగిపోయి మృతిచెందారు. దాంతో కుటుంబీకులు గట్టిగా కేకలు వేస్తూ విలపించడంతో చుట్టు పక్కల వారు వచ్చి ముగ్గురినీ బయటికి తీశారు. అప్పటికే ప్రాణం కోల్పోయారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కోనేరు వద్ద ఎలాంటి సూచిక బోర్డు పెట్టకుండా, ఈ ఘటనకు కారణమైన ఆలయ కమిటీ సభ్యులు, ఈఓపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యాత్రికులు డిమాండ్ చేశారు. కాగా, రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు, పవన్‌కు గతేడాది వివాహం అయింది.

వైఎస్ చౌదరి, అశోకగజపతి రాజీనామా

- రాజీనామా లేఖలు ప్రధానికి అందజేత
- ఎన్డీయేలో కొ3సాగుతు3ట్టు వెల్లడి

3తెలంగాణ-3్యఢిల్లీబ్యూరో

కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు తన మిత్రపక్షం టీడీపీ ఝలక్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు హామీనిచ్చిన ప్రత్యేకహోదాను నెరవేర్చనందుకు నిరసనగా ఆ పార్టీకి చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు రాజీనామా చేశారు. టీడీపీ నుంచి కేంద్రమంత్రివర్గంలో కొనసాగుతున్న అశోకగజపతిరాజు(కేంద్ర పౌర విమానయాన), సుజనా చౌదరి(శాస్త్ర,సాంకేతిక సహాయ మంత్రి) తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆరు గంటలకు ప్రధాని నరేంద్రమోడీకి ఆయన నివాసంలో రాజీనామా లేఖలను అందజేశారు. అయితే రాజీనామాల వల్ల కొంచెం ఫ్రీడం తప్ప కొత్తగా జరిగేదేమీ లేదని సుజనాచౌదరి అనంతరం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 'రాజీనామాల సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏపీ సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. అయితే ఏం చర్చించారన్నది మాకు తెలీదు' అని చౌదరి చెప్పారు. 'మా పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలమేరకు మేం మా పదవులకు రాజీనామా చేశాం. ఏపీకి పొందుపరిచిన హామీలు అమలయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుంది' అని తెలిపారు. రాజీనామాలు ఆమోదించారా లేదా అన్న విషయం తమకు తెలియదని అన్నారు. 'ప్రత్యేక హోదా స్థానంలో 2016లో ప్యాకేజీ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు నయా పైసా రాలేదు. ఇదే విషయాన్ని ప్రధానికి వివరించాం' అని వైఎస్ చౌదరి చెప్పారు. ఇక కేంద్రం పంపిన నిధులన్నింటికీ లెక్కలు చూపామని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు. లెక్కలకు సంబంధించి బీజేపీ అధికార ప్రతినిధులు లేదా కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శులు ప్రశ్నిస్తే సమాధానం చెబుతామని అన్నారు. దీనిపై మీడియాలో వస్తున్న వార్తలకు స్పందించబోమని అన్నారు. రాజీనామాలపై ప్రధానితో చర్చ ఏమీ జరగలేదని అన్నారు. ప్రధానికి అన్ని విషయాలు తెలుసని చెప్పారు. 'మేము కేంద్రమంత్రి పదవులకు మాత్రమే రాజీనామా చేశాం. ఎన్డీయే కూటమిలో కొనసాగుతున్నాం' అని అన్నారు. ఎన్డీయే నుంచి కూడా బయటకు వద్దామని ఎంపీలుగా తాము సూచించామని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు. అయితే తుది నిర్ణయం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుదని స్పష్టం చేశారు. విభజన చట్టం అశాస్త్రీయంగా రూపొందించారని, ఫలితంగా ఇబ్బందులు తలెత్తాయని చెప్పుకొచ్చారు.

బీజేపీకి చెంది3మంత్రుల రాజీనామాలకు బాబు ఆమోదం

బీజేపీకి చెందిన ఇద్దరు రాష్ట్ర మంత్రుల రాజీనామాలను ముఖ్యమంత్రి ఆమోదించి, గవర్నర్‌కు పంపించారు. వారు నిర్వహిస్తున్న శాఖలను ముఖ్యమంత్రి తన వద్దనే ఉంచుకున్నారు. వాటిని త్వరలోనే ఇతర మంత్రులకు కేటాయించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో కేంద్రంలో ఉన్న తెలుగుదేశం మంత్రులు రాజీనామాలు చేయడంతో రాష్ట్రంలో బీజేపీకి చెందిన మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్‌లు కూడా తమ రాజీనామాలను గురువారం ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. ఇదే విషయాన్ని శాసనసభ లాబీల్లో కామినేని మాట్లాడుతూ వెల్లడించారు. కొంతమంది మంచి పేరుతో మంత్రివర్గంలోకి వచ్చి చివరిలో ఆరోపణలతో నిష్క్రమిస్తారని, అయితే మంచిగా వచ్చి అదే పేరుతో వెళ్లిపోతుండడం తమకు గౌరవంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనను ఎంతో గౌరవంగా చూశారని, మూడున్నర సంవత్సరాల్లో ఎటువంటి వివాదాలు లేని మంత్రిగా తనను అభినందించారని కామినేని పేర్కొన్నారు. రాజీనామాలు సమర్పించిన సమయంలో మాణిక్యాలరావు వెనువెంటనే బయటకు వచ్చేయగా, కామినేని మాత్రం కొంతసేపు లోపలే ఉండి చంద్రబాబుతో మాట్లాడారు.

ముద్దాయిగా మోడీ సర్కార్

నవతెలంగాణ-3్యఢిల్లీబ్యూరో

పార్లమెంట్ విపక్షాల ఆందోళనల హోరు పెరిగింది. పీఎన్‌బీ కుంభకోణం నుంచి మొదలు రాష్ట్రాల హక్కుల వరకు విపక్ష పార్టీలు చేపడుతున్న నిరసనలతో ఉభయసభల్లో వాయిదాల పర్వం నెలకొంది. ఫలితంగా వరుసగా నాల్గో రోజూ ఉభయసభలు ఎలాంటి సభా కార్యక్ర మాలూ జరపకుండానే శు క్రవారానికి వాయిదా పడ్డాయి. పీఎన్‌బీ కుంభకో ణంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేయగా... రిజర్వేషన్ కోటాపై టీఆర్ఎస్ ఎంపీలు నిరసన చేపట్టారు. ఇక ప్రత్యేక హో దాపై వరుసగా నాల్గోరోజూ ఏపీకి చెందిన టీడీపీ, వైసీపీ ఎంపీలు సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఉభయసభల్లో విపక్ష పార్టీల ఎంపీలు ప్లకా ర్డులు ప్రదర్శిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఫలితంగా పార్లమెంట్ శుక్రవారానికి వాయిదా పడింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభలో ఉదయం గంటపాటు ప్రత్యేకంగా చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మినహా మిగిలిన పక్షాలన్నీ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి డిమాండ్ చేశాయి. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న అక్రమాలపై చర్చ చేపట్టాలని సభాపక్ష నేత మల్లిఖార్జునఖర్గే డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడేందుకు సిద్ధమవుతుండగా.. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ మాట్లాడారు. ప్రశ్నోత్తరాలను చేపట్టిలని, బ్యాంకింగ్ రంగంపై చర్చ గురువారం లోక్‌సభ అజెండాలో ఉందని చెప్పారు. రూల్ 193 కింద చర్చకు సిద్ధమని తెలిపారు. అయితే అప్పటికే రిజర్వేషన్ కోటాపై టీఆర్ఎస్ ఎంపీలు, ప్రత్యేక హోదాపై టీడీపీ, వైసీపీ, కావేరీ నదీ జలాల బోర్డు కోసం అన్నాడీఎంకే, డీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి పెద్దఎత్తున నినాదాలు చేశారు. తమ డిమాండ్లపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. వాయిదా అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ విపక్ష పార్టీల ఆందోళన మరింత తీవ్రమైంది. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో3ం అదే పరిస్థితి...

రాజ్యసభలోనూ విపక్షాలు తమ ఆందోళన తీవ్రతరం చేశాయి. ఫలితంగా వరుసగా నాల్గో రోజు సభ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా శుక్రవారానికి వాయిదా పడింది. అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉదయం గంట సేపు ప్రత్యేక చర్చ జరిగింది. ఈ చర్చ ముగిసిన వెంటనే ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ, అన్నాడీఎంకే, డీఎంకే తదితర పక్షాలు తమ డిమాండ్లపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లో నినాదాలు చేశారు. ఫలితంగా సభను ఛైర్మన్ వెంకయ్యనాయుడు మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. వాయిదా అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ విపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను డిప్యూటీ ఛైర్మన్ పీజేకురియన్ శుక్రవారానికి వాయిదా వేశారు.

కొత్త మున్సిపాలిటీలు రెడీ!

న్యాయశాఖకు చేరిన ఫైల్

- క్యాబినెట్ ముందుకు సవరణ బిల్లు

3తెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు, నగరపంచాయతీలు రానున్నాయి. అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయింది. మున్సిపాలిటీ చట్టానికి కొన్ని సవరణలు చేసింది. ఈ బిల్లులో పొందుపరిచిన కొన్ని అంశాలపై మున్సిపల్ శాఖను న్యాయశాఖ సలహా కోరింది. ఈమేరకు కొత్త మున్సిపాలిటీల బిల్లు ఇప్పటికే న్యాయశాఖకు చేరింది. న్యాయశాఖ ఆమోదం పొందగానే ఆదివారం జరగనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం దానికి ఆమోదం తెలుపనుంది. ఈ నెల 12 నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే కొత్త మున్సిపాలిటీల బిల్లును ప్రవేశ పెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. కొత్త మున్సిపాలిటీల ప్రక్రియ అనుకున్నది అనుకున్నట్టు జరిగితే జూన్ నుంచి కొత్త మున్సిపాలిటీలు అమలులోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో 73 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. వాటికి అదనంగా 40 కొత్తగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను గుర్తించినట్టు తెలిసింది. అందులో కొన్నింటికి న్యాయ చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. మున్సిపాలిటీలలో కొన్ని గ్రామాలను విలీనం చేయాల్సివుంది.

కొన్ని గ్రామాలను కలిపి నగర పంచాయతీలకు సరిహద్దులు నిర్ణయించాలి. ఈ క్రమంలో గ్రామాలను విలీనం చేయాలంటే గ్రామ పంచాయతీలలో తీర్మానం చేయాలి. మున్సిపాలిటీలలో విలీనానికి కొన్ని గ్రామాలు ఒప్పుకోవడం లేదని అధికారులు చెబుతున్నారు. గ్రామ పాలకవర్గాల సమయం అయిన తర్వాత ఆ గ్రామాలను విలీనం చేసేందుకు కొత్త చట్టంలో సవరణలు చేయనున్నట్టు తెలిసింది.

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిని విస్తరించనుంది. అందుకు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న అన్ని గ్రామాలను గ్రేటర్‌లో కలిపేందుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇవేకాకుండా ఓఆర్ఆర్ అవతల కూడా 25 మున్సిపాలిటీలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది. దీంతోపాటు సిద్ధిపేట్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చి అవకాశం ఉంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ఆమోదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

ముందే ముగిసిన బస్సుయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగించిన ఆయన వెంటనే వేదిక దిగివెళ్లిపోయారు. పార్టీ నేతలు సర్ది చెప్పడానికి ప్రయత్నించిన ఆయన వినలేదని గుసగుసలు వినిపించారు. ఒకరిద్దరూ మినహా పార్టీ సీనియర్లంతా ప్రారంభం వేదికపై మెరిసినా ఆ తర్వాత మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రులు డికె అరుణ, కోమటిరెడ్డి బ్రదర్స్, దామోదర రాజనర్సింహా, పొంగులేటి సుధాకరరెడ్డి సహా అనేకమంది ఈ యాత్రలో పాలుపంచుకోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. యాత్ర జరుగుతున్న తీరుపై కూడా కాంగ్రెస్ నేతలు పెదవి విరుస్తున్నారు. బస్సు నుంచి దిగకుండా...కేవలం బహిరంగ సభలు నిర్వహించడమేమిటని, చౌరస్తాలో ప్రజలు గుమిగూడినప్పటికీ నాయకులు మాట్లాడలేదని, దీంతో చాలా చోట్ల స్థానిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి జరుగుతున్నదని ఆరోపణలు చేసిన కాంగ్రెస్, ఈ యాత్ర సందర్భంగా ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సందర్శించలేదు. ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతు కుటుంబాలనుగానీ, తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలను కూడా పరామర్శించలేదని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీయే... అన్యాయానికి, అవమానాలకు గురైన బాధితులను పరామర్శించక పోవడాన్ని కాంగ్రెస్ నేత తప్పుపట్టారు.

అసెంబ్లీ సమావేశాల తర్వాత బస్సుయాత్ర నిర్వహించాలని సీనియర్ నేతలు చెప్పినా వినకుండా ప్రారంభించిన బస్సుయాత్రను ముందే ముగించారు. షెడ్యూల్ ప్రకారం మొదటి విడత బస్సుయాత్ర ఈ నెల 11 వరకూ కొనసాగాల్సి ఉంది. అదే రోజు రాత్రి సీఎల్పీ సమావేశం జరగాల్సి ఉంది. కానీ నేతల నుంచి సరైన సహకారం లభించక పోవడంతో గురువారం రాత్రి ముగించారు. షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత మే 15 వరకూ రెండోవిడత బస్సు యాత్ర, 15 నుంచి డికె అరుణ, కోమటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాదయాత్రలు, వి హనుమంతరావు రథయాత్ర జూన్ 1 వరకూ చేపట్టే అవకాశం ప్రచారం జరుగుతున్నది. కానీ బస్సుయాత్ర అనుభవంతో ఈ యాత్రలు కొనసాగిస్తారా? పాదయాత్రలు చేస్తారా? అనేది వేచి చూడాల్సిందే...

పీజీ వైద్య విద్యార్థులకు నో రూరల్ సర్వీస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేయాలనే నిబంధన ఉంది. ఇలా చేస్తేనే వారి విద్యార్హతలను రిజిష్టర్ చేయాలనే నిబంధన అమలవుతున్నది. ఈ నిబంధన తొలగించాలని వైద్య విద్యార్థులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. రెండేండ్ల క్రితం మూడు నెలలపాటు సమ్మెకూడా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికనే నియమిస్తున్నందున, మెడికల్ విద్యార్థులతో పని చేయించాల్సిన అవసరం లేదని సిఎం స్పష్టం చేశారు. కాగా, ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రంలో సుమారు 1,150 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది.

కదం తొక్కిన ఆశాలు

అమరావతి : మహిళా దినోత్సవం రోజూ ఆశాలకు అగచాట్లు తప్పలేదు. సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ నగరంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సుమారు ఐదుగంటలపాటు మండుటెండలో నడిరోడ్డుపైనే బైఠాయించారు. ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఈ సందర్భంగా నాయకులు సుబ్బరావమ్మ, ఆర్.వి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు, నారాయణ, దుర్గారావు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. అయినా పట్టు వదలకుండా రోడ్డుపైనే బైఠాయించడంతో అధికారులు దిగొచ్చారు. మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ శారద, ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ కమిషనర్ ప్రమిలా, ఆశా వర్కర్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి తదితరులు ఆలంకార్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించిన ఆశా వర్కర్ల వద్దకు వచ్చి మాట్లాడారు. ఏప్రిల్ 10వ తేదీలోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. బకాయిపడ్డ వేతనాలను కూడా చెల్లిస్తామని హామీనిచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే భవిష్యత్‌లో ఆందోళన ఉధృతం చేస్తామని ఎపి ఆశావర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ధర్నా సమయంలో వేసవి తాపాన్ని తట్టుకోలేక వివిధ జిల్లాలకు చెందిన ఏడుగురు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఉద్ధరణ గురించి గొప్పగా మాట్లాడే ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్న మహిళలకు అన్యాయం చేస్తోందని తెలిపారు. పలకరింపు, ఇంటంటి సర్వేల పేరుతో ఇష్టం వచ్చినట్లు పనులు చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరుగున్న తెలంగాణాలో ఆరువేలు, కేరళలలో 7500, హర్యానాలో రూ.4500 ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి అనుసరిస్తోందని అన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందన్నారు. నాయకులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, ముజఫర్, ఎ.కమల, శ్యామలారాణి, శ్రీలక్ష్మి, సిహెచ్.పద్మ, సుధ, శివకుమారి, ఎం.వి.సుధాకర్, దయారమాదేవి తదితరులు ప్రసంగించారు. ఆశాలపై నిర్బంధాన్ని సీఐటీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింగారావు, ఎంఏ.గఫూర్ ఖండించారు. యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి వారి కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇక ఎక్కడి నుంచైనా రేషన్

-అందుబాటులోకి పోర్టబిలిటీ విధానం

- ఇల్లు మారినా నో ప్రాబ్లమ్
- రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సరుకులు పొందే అవకాశం
- వలస జీవులకు తప్ప33్న తిప్పలు
- వచ్చే నెల 3ంచి అందుబాటులోకి ఐరిస్ మిష3్ల

3తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ లబ్ధిదారులకు శుభవార్త..! మీరు ఇల్లు మారినా పర్వాలేదు.. ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు పొందేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేసింది. ఇక నుంచి కార్డు కేటాయించిన దుకాణానికే వెళ్లాల్సిన అవసరం లేదు. ఏ షాపునకు వెళ్లినా తమ కోటా సరుకులు నింపాదిగా తీసుకునేందుకు పోర్టబులిటీ విధానం అందుబాటులోకి వచ్చింది. ఈ నెల నుంచే దాదాపుగా అన్ని జిల్లాల్లో ఈ విధానం కొనసాగుతుండగా..వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చౌకధర దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులు, లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేయడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వలన వలస జీవులకు, రేషన్ షాపులులేని గ్రామాలకు ఊరట లభించనుంది. అంతేకాకుండా డీలర్ల మధ్య పోటీ పెరిగి పారదర్శక సేవలు అందనున్నాయి.

మొదలైంది ఇలా...

రాష్ట్రవ్యాప్తంగా 85.64 లక్షల రేషన్ కార్డులు ఉండగా, 2.75 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ నెలకు ప్రభుత్వం 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నది. అయితే, రేషన్ బియ్యం భారీగా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న నేపథ్యంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా ఈ పాస్ విధానాన్ని అమలు చేస్తున్నది. ఈ వ్యవస్థ జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్నా గ్రామాల నుంచి వలస వెళ్లిన ప్రజలు ప్రతి నెల తమ సొంత గ్రామానికి వచ్చి రేషన్ సరుకులు తీసుకోవడం ఇబ్బందికరంగా మారింది.

ప్రతి లబ్ధిదారునికి రేషన్ అందకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రభుత్వం రాష్ట్రంలో ఏ రేషన్‌షాపు నుంచైనా తమ సరుకులు పొందే వెసులుబాటును కల్పించింది. రాష్ట్రంలో ఈ పాస్ యంత్రాలు వచ్చిన తరువాత కుటుంబంలోని వ్యక్తులెవరైనా సరే వేలిముద్రలు, బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకుని రేషన్ అందిస్తున్నారు. కానీ కొంతమంది లబ్ధిదారులు రేషన్ సరుకుల పంపిణీ సమయంలో గ్రామాల్లో అందుబాటులో లేకపోవడం, వేరే గ్రామాల్లో ఉండటం, వలసలు వెళ్లడం తదితర కారణాలతో రేషన్ కోల్పోతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఇటీవలే ప్రతి నెల 15వ తేదీలోపు సరుకులు తీసుకోవాలనే నిబంధన విధించింది. వీటితోపాటు వరుసగా మూడు నెలలో రేషన్ తీసుకోకపోతే కార్డు రద్దవుతదనే భయం వినియోగదారుల్లో ఉంది. ఇప్పటికే చాలా కార్డులు రద్దయ్యాయి కూడా. రేషన్ పోర్టబులిటీ విధానంతో ఇలాంటి బాధలు చాలవరకు తీరతాయని అధికారులు చెబుతున్నారు. రద్దీ ఉన్న రేషన్ దుకాణాల్లో సరుకులు పొందడం ఆలస్యమవుతుందని వినియోగదారులు భావిస్తే మరో దుకాణానికి వెళ్లి సరుకులు పొందవచ్చు. ఈ విధానం ద్వారా రేషన్ డీలర్లు సరుకులు సక్రమంగా అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో ఈ పాస్ యంత్రాలతో లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని సరుకులు అందిస్తున్నారు. వేలిముద్రలు సరిగ్గా రానివారికి వీఆర్వోలు వేలిముద్రలు తీసుకొని సరుకులు అందిస్తున్నారు. అయితే వేలిముద్రలు సరిగ్గారాని వారి కోసం వచ్చే నెల నుంచి అన్ని జిల్లాల్లోని రేషన్ దుకాణాలకు కంటి పాపలు స్కానింగ్ చేసే మిషన్‌లు పంపిణీ చేయనున్నారు. దీంతో వృద్ధులకు సమస్య తీరుతుందని అధికారులు చెబుతున్నారు.

సెన్సెక్స్ ▲ 318	33,352
నిఫ్టీ ▲ 88	10,242
డాలరుకు రూపాయి విలువ	65.14
బంగారం(10.గ్రా)	రూ. 30,446
వెండి (కేజీ)	రూ. 40,600

కోడిగుడ్లు

హైదరాబాద్	345	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	4.05	చెన్నై	385
వరంగల్	347	ముంబయి	390

ఆర్‌కామ్‌కు హైకోర్టులో చుక్కెదురు..!



ముంబయి: వ్యాపారం తగ్గి రుణ భారంతో ప్రతికూలతను ఎదుర్కొంటున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు (ఆర్‌కామ్) తాజాగా మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆస్తుల విక్రయం విషయమై ఆర్బిట్రేషన్ కోర్టు విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోర్టుకు వెళ్లిన ఆర్‌కామ్‌కు అక్కడ చుక్కెదురైంది. అనిల్ అంబానీ సంస్థ అభ్యర్థనను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. ఆర్‌కామ్‌కు చెందిన రెండు కంపెనీలు మూడు పిటిషన్లను దాఖలు చేశాయి. ఎరిక్సన్‌కు అనుకూలంగా ఆర్బిట్రేషన్ కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించాలని ఈ సంస్థలు కోరాయి. ఎరిక్‌సన్ రుణబాధ్యత అనేది పూచికత్తులేని విక్రేత మాత్రమేనని.. ఆస్తుల విక్రయం అనేది సెక్యూర్డ్ రుణదాతలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయమని ఆర్‌కామ్ కోర్టుకు వెల్లడించింది. ఎరిక్‌సన్ కంటే ముందే సెక్యూర్ట్ రుణదాతలు ఉన్నారని.. ఈ నేపథ్యంలోనే ఆస్తుల విక్రయానికి అనుమతి ఇవ్వాలని అంబానీ తరపు వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఆర్బిట్రేషన్ కోర్టు విధించిన నిషేధాన్ని ఎత్తివేసేందుకు గాను కోర్టు నిరాకరించింది.

టెలినార్ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ పచ్చజెండా



న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్‌లో టెలినార్ ఇండియా విలీనానికి 'నేషనల్ కంపెనీ లా ట్రైబ్యూనల్' (ఎన్‌సీఎల్‌టీ) గురువారం పచ్చజెండా ఊపింది. ఈ విలీనానికి గాను ఇరు సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందాలు, నిబంధనలకు ఎన్‌సీఎల్‌టీ బెంచ్ గురువారం సమ్మతి తెలిపింది. 2017లో ఇరు సంస్థలు విలీనానికి ముందుకు వచ్చి.. ఒక నిర్దిష్ట ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తాజాగా ఎన్‌సీఎల్‌టీ అనుమతి లభించడంతో ఆంధ్రప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ (తూర్పు మరియు పశ్చిమ), అస్సాం సర్కిళ్లలో టెలినార్ వ్యాపారం ఎయిర్‌టెల్ చేతుల్లోకి వెళ్లేందుకు మార్గం మరింత సులభమైంది. ఈ విలీనం ఒప్పందానికి ఇప్పటికే 'కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (సీసీఐ) కూడా సమ్మతి తెలిపిన సంగతి విదితమే. కాగా టెలినార్ విలీనానికి సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ, బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ, టెలికాం శాఖ అనుమతులు ఇంకా లభించాల్సి ఉంది.

ఇక ఎయిరిండియా విక్రయం వేగవంతం



నవతెలంగాణ-హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని విమానయాన సంస్థ ఎయిరిండియా విక్రయానికి కార్యాచరణ ప్రణాళిక పూర్తయినట్టుగా తెలుస్తోంది. ఇందులో భాగంగా సంస్థలోని వాటా విక్రయానికి రెండు వారాల్లో ఆసక్తిదారుల నుంచి ప్రాథమికంగా బిడ్లు ఆహ్వానించనున్నట్టుగా పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ చౌబే తెలిపారు. హైదరబాద్‌లో జరుగుతోన్న వింగ్స్ ఇండియా సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిరిండియాలో సర్కారు వాటా విక్రయానికి గాను గత ఏడాది మోడీ క్యాబినెట్ సమ్మతినిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబల్ ఏవియేషన్, టాటా గ్రూపుతో పాటు టర్కీకి చెందిన సెలిబీ ఏవియేషన్ హోల్డింగ్ సంస్థలు ఎయిరిండియాను చేజిక్కించుకొనేందుకు ఆసక్తి కనబరిచిన సంగతి తెలిసిందే.

తెలంగాణ గాలిలో దూసుకెళ్తోంది..

- హైదరాబాద్ వైపు ప్రముఖ విమాన సంస్థల చూపు
- రాష్ట్రంలో ఆరు విమానాశ్రయాల అభివృద్ధి
- వరంగల్ ఎయిర్‌పోర్ట్ పైనా ప్రధాన దృష్టి
- ఎలిమినేడులో మరో ఏయిరోస్పేస్ పార్క్
- వైమానిక రంగానికి పెద్ద పీట
- 'వింగ్స్‌ఇండియా' సదస్సులో మంత్రి కేటీఆర్
- ఘనంగా విమానాల పండుగ ప్రారంభం



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: తెలంగాణ అభివృద్ధికి గాను రాష్ట్రంలో ఉన్న ఆరు విమానాశ్రయాలను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చి.. గరిష్ఠంగా వినియోగించుకోనేలా చర్యలు చేపట్టనున్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. తెలంగాణలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు బేగంపేట్, వరంగల్, హకీంపేట్, నాదర్‌గూల్, రామగుండం, దుండిగల్‌లలో ఇప్పటికే విమానాశ్రయాలు ఉన్నాయని వివరించారు. వీటిని ప్రాంతీయ అనుసంధానత కార్యక్రమం కింద పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్టుగా మంత్రి వివరించారు. వరంగల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్‌కు దన్నుగా ఉండేలా ఆ నగరంలోని విమానాశ్రయాన్ని ప్రాంతీయ అనుసంధానత పథకంలో భాగంగా తొలత పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్టు వివరించారు. ఇందుకు గాను ఆయన కేంద్రం తగిన సహకారాన్ని అందించాలని వింగ్స్ ఇండియా వేదిక మీదుగా కోరారు.

ఘనంగా ప్రారంభమైన వింగ్స్ ఇండియా..

దేశంలో ప్రతి రెండేండ్లకోసారి జరిగే పౌర విమానయాన సదస్సు 'వింగ్స్ ఇండియా-2018'ను మంత్రి కేటీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏరో స్పేస్ రంగంలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని అన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయని వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానంలో దూసుకెళ్తోందని చెప్పారు. తెలంగాణ ఏవియేషన్ అకాడమీ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలుస్తూ వస్తోందన్న మంత్రి కేటీఆర్ ఈ రంగంలోని వివిధ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన అన్ని వసతులు రాష్ట్రంలో ఉన్నాయని వివరించారు.

విశ్వవిద్యాలయ కేంద్రం ఏర్పాటు చేయాలి..

హైదరాబాద్ కేంద్రంగా పలు విమానయాన సంస్థలు, వైమానిక రంగానికి చెందిన కంపెనీలు తమ అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఇక్కడ నైపుణ్యత పెంపు కోసం ఇటీవలే ఉత్తర్ ప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన 'జాతీయ విమానయాన విశ్వవిద్యాలయ' అనుబంధ కేంద్రాన్ని బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ పౌర విమానయాన శాఖ కార్యదర్శిని చౌబేను కోరారు. తెలంగాణలో ఇప్పటికే మూడు ఏయిరోస్పేస్ పార్క్‌లు పని చేస్తుండగా ఇటీవలే ఎలిమినేడు వద్ద నాలుగో పార్క్ ఏర్పాటు పన్నులకు తాము శ్రీకారం చుట్టినట్టుగా ఆయన వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న మూడు ఎయిరోస్పేస్ పార్క్‌లో రెండు పూర్తిస్థాయి ప్రత్యేక ఆర్థిక మండళ్లుగా పని చేస్తున్నాయని అన్నారు.

రాజకీయాల్లో ఏప్పుడేం జరుగుతుందో చెప్పలేం..

రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని, అన్నింటికీ సిద్ధంగా ఉంటూ ముందుకు సాగాల్సి వస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం ఉదయం లేవగానే పత్రికల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు రాజీనామా వార్త చూసి తాను ఆశ్చర్యపోయానని అన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. దేశంలో 70 ఏళ్లలో 72 విమానాశ్రయాల అభివృద్ధి జరిగితే.. అశోక్ గజపతి రాజు సారథ్యంలోని బృందం విశేషంగా కృషి చేసి గడిచిన మూడేళ్లలో 56 పైగా విమానాశ్రయాలను అభివృద్ధి చేసే చర్యలు చేపట్టారని ప్రశంసించారు. భారత వైమానిక రంగం ఇలాగే వృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

భారత్‌కు రావడం అసంభవమే..!

పీఎన్‌బీ స్కామ్ నిందితుడు వజ్రాల వ్యాపారి మెహుల్ చౌక్సీ వెల్లడి..



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) దాదాపు రూ.13,000 కోట్ల మోసానికి పాల్పడి విదేశాలకు తరలిపోయిన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చౌక్సీలకు భారత్‌కు తిరిగి వచ్చే ఉద్దేశం కనిపించడం లేదు. ఇప్పటికే అంతర్జాతీయ వ్యాపార కార్యకలాపాల్లోని పని ఒత్తిడి కారణంగా తాను దర్యాప్తునకు హాజరు కాలేనని నీరవ్ మోదీ సీబీఐకి తేల్చి చెప్పగా.. తాజాగా మరో ప్రధాన నిందితుడు గీతాంజలీ గ్రూపు అధినేత మెహుల్ చౌక్సీ కూడా తాను భారత్ తిరిగి రావడం అసంభవమేనని తేల్చేశాడు. దీనికి తోడు ప్రభుత్వం మీదికే తప్పు నెట్టేలా ఆయన వ్యాఖ్యలు చేశారు. సర్కారు తన పాస్‌పోర్ట్ ఎందుకు రద్దు చేశారో కారణం చెప్పాలంటూ.. ఎదురు దాడికి దిగాడు. 'నేను భారత్‌కు రావడం అసాధ్యం. ముంబయి పాస్‌పోర్టు ఆఫీస్ అధికారులు నా పాస్‌పోర్టును ఎందుకు సస్పెండ్ చేశారో కారణాలు చెప్పాలని నిల దీయాలనుకుంటున్నా.' అని చౌక్సీ సీబీఐకి రాసిన ఒక లేఖలో అసహనం వ్యక్తం చేశారు. 'నా పాస్‌పోర్ట్ సస్పెండ్ చేయడానికి నేనేమైనా దేశ భద్రతకు ముప్పుగా పరిణమించానా..? అని చౌక్సీ సీబీఐకి రాసిన లేఖలో ప్రశ్నించారు. పీఎన్‌బీ స్కామ్ వెలుగులోకి వచ్చే సంకేతాలు వస్తున్న తొలినాళ్లలోనే నీరవ్ మోదీ, మెహుల్ చౌక్సీలు భారత్‌ను విడిచి వెళ్లినట్టుగా సర్కారు రికార్డులు చెబుతున్నాయి. కాగా, పీఎన్‌బీ మోసం కేసులో వజ్రాల వ్యాపారులు చేసిన ఫ్రాడ్ విలువ అనుకుంటున్నట్టుగా రూ.12,700 కోట్ల కంటే కూడా మించి ఉండే అవకాశం ఉందిన విచారణ సంస్థలు తాజాగా విశ్లేషిస్తున్నాయి.

20% పెరిగిన 'ప్రత్యక్ష' వసూళ్లు

రూ.744లక్షల కోట్లకు చేరిన పన్ను ఆదాయం



న్యూఢిల్లీ: దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మొదటి 11 నెలల కాలంలో ఈ పన్ను వసూళ్లలో దాదాపు 19.5 శాతం వృద్ధి నమోదు అయినట్టుగా సర్కారు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య కాలంలో ఈ పన్ను వసూళ్లు గణనీయంగా ఎగిసి రూ.7.44 లక్షల కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 'ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఉన్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల వివరాల ప్రకారం.. ఏప్రిల్ - ఫిబ్రవరి మధ్య రూ.7.44 లక్షల కోట్లు ప్రత్యక్ష పన్నులు వసూళ్లయ్యాయని.. అంతకు ముందు ఏడాది (2016-17) తొలి 11 నెలలతో పోలిస్తే వసూళ్లు దాదాపు 19.5 శాతం అధికం' అని ఆర్థికశాఖ తెలిపింది. ఈ ఏడాది తొలి 11 నెలల కాలంలో దేశంలోని స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు (పన్ను వాపసులు జరపక ముందు) 14.5 శాతం పెరిగి రూ. 8.83 లక్షల కోట్లుగా నమోదైనట్టు సర్కారు వివరించింది. మొత్తం వసూళ్లలో దాదాపు రూ.1.39 లక్షల కోట్ల మేర సొమ్మును పన్ను చెల్లింపుదారులకు రిఫండ్ రూపంలో తిరిగి చెల్లించినట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. కార్పొరేట్ పన్ను వసూళ్లు 19.7 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 18.6 శాతం మేర పెరిగినట్టుగా సర్కారు వివరించింది.

క్రోనీ క్యాపిటలిజాన్ని పోషించింది కాంగ్రెస్సే

- బీజేపీ హయాంలో ఎక్కువైంది
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

నవతెలంగాణ - హయత్‌నగర్ (హైదరాబాద్)

ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా, వస్తూత్పత్తి లేకుండా ప్రజల, ప్రభుత్వ సొమ్మును దోచుకునే వ్యవస్థను (క్రోనీ క్యాపిటలిజం) కాంగ్రెస్ హయాంలో పెంచి పోషిస్తే.. బీజేపీ హయాంలో మరింత ఎక్కువైందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) అఖిల భారత 22వ మహాసభ నేపథ్యంలో హైదరాబాద్ మన్సూరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సెమినార్ ఏర్పాటు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కోర్ కమిటీ సభ్యులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సెమినార్‌లో రాఘవులు ప్రసంగించారు. దేశవ్యాప్తంగా వివిధ బడాసంస్థలకు చెందిన నీరవ్‌మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.12 వేల కోట్లు, పెన్నులు తయారు చేసే కంపెనీకి చెందిన వ్యక్తి రూ.5 వేల కోట్లు, విజయ్‌మాల్యా రూ.7 వేల కోట్లు, మరికొన్ని కంపెనీలు రూ.2 లక్షల కోట్లు అప్పు తీసుకొని ఉడాయించారని చెప్పారు. అప్పు తీసుకున్నప్పుడు స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీయే తిరిగి కట్టొద్దని వారికి చెప్పడంతో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాజన్ చెప్పారన్నారు. దానికి కేంద్ర ప్రభుత్వం అతనిపై ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. తెలంగాణలో 17 వేల కోట్లు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేయాలని కేంద్రాన్ని కోరితే రుణమాఫీ చేస్తే వారు 'సోమరిపోతులు' అవుతారని స్వయంగా ప్రధాని అనడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బీజేపీ హయాంలో పారిశ్రామికవేత్తలు ఎగ్గొట్టిన అప్పులను బేరీజు వేసుకుంటే రైతులకు ఇచ్చిన రుణమాఫీలకు అయ్యే ఖర్చు రెండు శాతం లేదన్నారు. అప్పు కట్టలేక రైతులు ప్రాణం తీసుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. క్రోనీ క్యాపిటలిజంతో దేశానికి ఎలాంటి లాభం లేకపోగా, చాలా ప్రమాదం వాటిల్లుతుందని చెప్పారు. నీరవ్ మోడీ విషయంపై బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదట్లోనే జువెలరీ అసోసియేషన్ వారు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి లేఖ రాశారని, ఆయన స్పందించకపోవడంతోనే వేల కోట్ల అప్పు ఎగ్గొట్టి విదేశాల్లో తలదాచుకున్నాడని చెప్పారు. క్రోనీ క్యాపిటలిజం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు యాదయ్య, ఈఎస్‌ఎన్.రెడ్డి, సామేల్, రాంచందర్, మధుసూదన్, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్, టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, నాయకులు వెంకటరామయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ఒకటి..భర్తీ మరొకటి

హెచ్‌సీయూ నియామకాల్లో అధికారుల తీరిది

- వీసీ అప్పారావు హయాంలోనూ అక్రమాలు
- ప్రొఫెసర్ పోస్టులను డౌన్‌గ్రేడ్ చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకం
- ఈసీ మినిట్స్‌లో కనిపించని ఎంపికైన అభ్యర్థుల వివరాలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో పాలకులు మారినా, విధానాలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. గతంలోని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రామకృష్ణ రామస్వామి హయాంలోనే కాదు..ప్రస్తుతం కొనసాగుతున్న వీసీ అప్పారావు హయాంలోనూ అక్రమాలు దర్శనమిస్తున్నాయి. ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేశారు. ఇలాంటి చర్యలు భవిష్యత్‌లో చేయవద్దని పాలకమండలి సూచించడం గమనార్హం. అయితే ఈ చర్యలు భవిష్యత్ నియామకాల్లో సమస్యలు వచ్చే అవకాశముంది. అయినా హెచ్‌సీయూ పాలకులకు అదేదీ కనిపించలేదు. నచ్చినవారికి పోస్టులకు అప్పగించడం షరామాములుగా మారిపోయింది. గతంలో వర్సిటీలో కొత్తగా ఎవరినైనా నియామకం చేస్తే, ఆ వివరాలను మినిట్స్‌లో పొందుపరిచేవారు. కానీ ప్రస్తుతం జరిగే నియామకాల వివరాలను ఈసీ మినిట్స్‌లో కనిపించడం లేదు.

2014, 2015,2016 సంవత్సరాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు హెచ్‌సీయూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగంలో ఐదు ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించింది. దీనిలో ఎస్టీ విభాగంలో ఒక పోస్టు ఉంటే, దీనికి అర్హులు లేరనీ తిరిగి నోటిఫికేషన్ ఇవ్వాలని స్క్రీనింగ్ కమిటీ నిర్ణయించింది.

మిగిలిన పోస్టులకు 13మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 12మంది దరఖాస్తులను రిజెక్టు చేసింది. అయితే అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల రిజెక్టు లిస్టులో గానీ, సిఫారసు లిస్టులో గానీ లేని డాక్టర్ భావనా గొంబర్ పేరు తెరమీదికి వచ్చింది. ప్రొఫెసర్ పోస్టును డౌన్‌గ్రేడింగ్ చేసి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం చేయాలని సెలెక్షన్ కమిటీ సిఫారసు చేసింది. 2016 డిసెంబర్ 30న ఎంపిక జరగ్గా, ఏప్రిల్ 5, 2017న జరిగిన పాలక మండలి(ఈసీ) దీనికి ఆమోదం తెలిపింది. ఈసీ -172 సమావేశంలో ఐటెమ్ నెంబర్ 5లో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ప్రొఫెసర్ పోస్టును ఎందుకు తగ్గించాల్సి వచ్చిందో వర్సిటీ అధికారులు ఎక్కడా పేర్కొనలేదు. వాస్తవానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకూ భారీగానే దరఖాస్తులు వచ్చాయి. అయినా వారందరినీ కాదని కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం వెనుక అసలు మతలబు ఎంటో అధికారులే చెప్పాల్సి ఉంది.

ఈ కాలంలో స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ విభాగంలోనూ ఇదేతంతు కొనసాగింది. రెండు ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వచ్చిన దరఖాస్తుల్లో స్క్రీనింగ్ 17 మందిని రిజెక్టు చేయగా, 8మందిని ఇంటర్వ్యూకు పిలిచింది. ఇక్కడ కూడా ప్రొఫెసర్ దరఖాస్తుల్లో లేని పేరు సెలక్షన్ లిస్టులోకి ఇచ్చింది. ప్రొఫెసర్ పోస్టును డౌన్‌గ్రేడింగ్ చేసి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎం.సూర్య దుర్గాప్రసాద్‌ను వర్సిటీ అధికారులు నియమించారు.

ఫిబ్రవరి 14, 2017లో వీరిని ఎంపిక చేయగా, సెలక్షన్ కమిటీ నిర్ణయాన్ని ఏప్రిల్ 5, 2017న జరిగిన 172 ఈసీ సమావేశం ఆమోదముద్ర వేసింది. అయితే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఇంటర్వ్యూలకు పిలిచిన ఓబీసీ కేటగిరిలో ఎం సూర్యదుర్గ పేరు ఉన్నది. ఈ రెండు పేర్లు ఒక్కటే అయితే.. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు నేరుగా ఎంపిక చేయొచ్చు. అయినా ప్రొఫెసర్ పోస్టును డౌన్‌గ్రేడింగ్ చేసి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎం సూర్యదుర్గా ప్రసాద్‌ను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో వర్సిటీ అధికారులకే తెలియాలి.

గత వీసీ హయాంలోనూ...

స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్ పోస్టుకు 2011 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. 2012లో నియామకాలు చేశారు. దీనిలో ప్రొఫెసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న రామస్వామి శమన్నను అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించారు. అయితే ఆయనకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేసిన అనుభవం గానీ, పీహెచ్‌డీ గానీ, అకాడమిక్ పర్ఫామెన్స్ ఇండికేషన్(ఏపీఐ) స్కోర్ కూడా లేదు. అయినా అప్పటి వీసీ రామకృష్ణ రామస్వామి ఆయన్ను అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించేశారు. ఈ పోస్టుకు ఏడుగురికి అర్హత ఉందని సెలక్షన్ కమిటీ చెప్పినా, వాటిని పక్కన పారేశారు.

హరితహారంలో వెదురు పెంపకం

- ఆదాయ వనరుగా మార్చాలని సీఎం ఆదేశం
- బాంబూ సొసైటీ ప్రతినిధులతో
- అటవీశాఖ ఉన్నతాధికారుల భేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల రవాణాపై ఉన్న ఆంక్షలను తొలగించిన నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులతో పాటు, మేదరులకు ఆదాయ వనరుగా వెదురును మార్చాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణ అడవుల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున వెదురు లభ్యత ఉందని, హరితహారంలో భాగంగా అడవుల బయట రైతులను వెదురు పెంచేందుకు ప్రోత్సహించాలని, అలాగే వారు పెంచిన వెదురుకు మార్కెట్ సౌకర్యం ఉండేలా, వాణిజ్య పరంగా వెదురు ఉత్పత్తుల మార్కెట్ సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. గురువారం బాంబూ సొసైటీ ఆఫ్ ఇండియా సలహా మండలి వైస్ చైర్మన్ ఆర్.కె మెహతాతో ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ పీకె ఝా, అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్.ఎం. డోబ్రియాల్, ఇతర అధికారులు అరణ్య భవన్ లో సమావేశమయ్యారు. ఇతర రాష్ట్రాల్లో వెదురు పరిశ్రమ తీరు తెన్నులు, వాణిజ్య పరంగా ఆయా రాష్ట్రాలు చేస్తున్న ప్రయత్నాలను వీరికి మెహతా వివరించారు. అలాగే అక్కడ ఉత్పత్తులను అధికారులకు చూపటంతో పాటు మార్కెటింగ్‌కు ఉన్న అవకాశాలను తెలియజేశారు. వాటి నమూనాలను కూడా బాంబూ సొసైటీ ప్రతినిధులు సమావేశంలో ప్రదర్శించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత వెదురు పెంపకానికి అనువుగా ఉంటాయని, ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. మధ్యప్రదేశ్, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల్లో వాణిజ్య పరంగా వెదురుకు ఉన్న ప్రోత్సాహకాన్ని రాష్ట్ర అటవీ అధికారులు త్వరలోనే అధ్యయనం చేయాలని నిర్ణయించారు. రైతులను వెదురు పెంపకానికి ప్రోత్సహించటం, ఆ పంటను మేదర సొసైటీల ద్వారా ఉత్పత్తులుగా మార్చటం, వాటిని ఆయా ప్రభుత్వశాఖలు కొనుగోలు చేసేలా అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని బాంబూ సొసైటీ ప్రతినిధులు చెప్పారు. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్.ఐ.ఆర్.డి, దూలపల్లి ఫారెస్ట్ అకాడమీల సహకారంతో రైతులు వెదురు పెంచేందుకు ప్రోత్సహించనున్నారు. మధ్యప్రదేశ్ లో విజయవంతమైన కొన్ని కొత్త వెదురు వంగడాలను కూడా రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టనున్నారు.

రిజర్వేషన్ బిల్లు ఆమోదించండి..

- రాజ్యసభలో మహిళా ఎంపీల డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిథ్యం కల్పించే 'మహిళా రిజర్వేషన్' బిల్లును వెంటనే ఆమోదించాలని మహిళా ఎంపీలు డిమాండ్ చేశారు. మహిళకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ.. ఆ ప్రక్రియ అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక పార్లమెంట్‌లో మొదట జరగాల్సి ఉందని పేర్కొన్నారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడాన్ని ఓ ప్రజా ఉద్యమంగా నిర్వర్తించాలని కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభలో గురువారం ఉదయం గంటపాటు ప్రత్యేక చర్చ జరిగింది. ఈ చర్చను కాంగ్రెస్ సీనియర్ ఎంపీ అంబికాసోని ప్రారంభించారు. 'ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు మహిళలకు అవకాశాలు కల్పించాలి. అప్పుడే అద్భుతాలు సృష్టిస్తారు' అని అన్నారు.

చట్టాల అమలులో లోపం : సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్

మహిళా అంతర్జాతీయ దినోత్సవం టోకేన్ దినంగా మారొద్దని సీపీఐ(ఎం) ఎంపీ టి రంగరాజన్ అన్నారు. ఈ 70 యేండ్లలో మహిళ పరిస్థితి కేవలం 0.001 శాతం మాత్రమే మెరుగుపడిందని అన్నారు. ఇప్పటికీ పని ప్రదేశాల్లో వేధింపులకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకు చట్టాలున్నా అమలు కావడం లేదని చెప్పారు. 'దళితులు, ఆదివాసీలు నయా సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యారు. దాన్ని పరిగణలోకి తీసుకోవాలి' అని అన్నారు.



అధిక బరువు ఆధునిక సమస్య

ఆధునిక యుగం వైపు పరుగులు తీస్తున్నామని సంబుర పడుతున్న సమయంలో మారుతున్న జీవనశైలిలో భాగంగా వస్తున్న అనారోగ్య సమస్య అధికబరువు. అందుకే 21వ శతాబ్దపు అతిపెద్ద సమస్యగా అధికబరువు సమస్యలను గుర్తించారు. అనేక వ్యాధులు దాడి చేయడానికి స్థూలకాయం ముఖ్యమైన కారణం. అంతేకాదు భారీ కాయం వల్ల వచ్చే జబ్బులు మరణాలకు రెండవ ప్రధాన కారణం. అభివద్ధి చెందిన దేశాలలో ఎక్కువగా కనిపిస్తున్న ఈ సమస్య పోషకాహార లేమికి నిదర్శనంగా కనిపిస్తుంది. అభివద్ధి చెందిన దేశాలలో సుమారు 40 శాతం మంది పెద్దవారు, 20 శాతం మంది పిల్లలు ఈ సమస్యతో బాధపడుతున్నారని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వస్తువులు, విలాస వసతులు శారీరక వ్యాయామాన్ని తగ్గించి శరీరబరువును పెంచుతున్నాయి. మరి ఈ సమస్యను నియంత్రించడంతో పాటు నివారించడం ఎలాగో తెలుసుకుంటే భవిష్యత్‌లో అధికబరువు సమస్య నుంచి బయటపడవచ్చు.

మన దేశంలో పట్టణాల్లో ఉన్నత, మధ్య తరగతి మహిళల్లో 30-50 శాతం మంది.. పురుషుల్లో 32 శాతం మంది స్థూలకాయంతో బాధపడుతున్నారని ఇటీవల జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం నివారించదగిన 10 ఆరోగ్య సమస్యల్లో స్థూలకాయం కూడా ఒకటి.

అధిక బరువు అనేది ఏ కారణాలతో వచ్చినా అసహజ రీతిలో కండరాలు పెరగడం, ద్రవాలు నిలిచిపోవడం వల్ల కూడా రావచ్చు. కొవ్వు కణాలు విస్తరించినా, కొవ్వుగల కణజాలం అసహజంగా పెరిగినా, వాటి సంఖ్య రెట్టింపు అయినా స్థూలకాయం వస్తుంది. ఒక వ్యక్తి వయసు, ఎత్తుకు తగ్గట్టుగా ఎంత బరువు ఉండాలి అనేది 'బాడీ మాస్ ఇండెక్స్' (బిఎంఐ) ద్వారా తెలుసుకోవచ్చు. సాధారణంగా మగవారిలో 30 కన్నా మహిళల్లో 28.6 కన్నా బాడీ మాస్ ఇండెక్స్ అధికంగా ఉంటే వారు అధిక బరువు ఉన్నారని తెలుసుకోవచ్చు.

బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) చార్టు

అధిక బరువును నిర్ధారించేందుకు ఉపయోగించే గణనే బాడీ మాస్ ఇండెక్స్ గా పిలుస్తారు. ఒక వ్యక్తి బరువు(కేజీలు)ను, ఎత్తు(మీటర్లు)ను తీసుకోవాలి. ఎత్తును మీటర్లలో తీసుకుని.. అదే సంఖ్యతో మళ్ళీ గుణించాలి. వచ్చిన సంఖ్యతో ఆ వ్యక్తి బరువును భాగిస్తే.. వచ్చే సంఖ్యను బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ)గా గుర్తించాలి. వచ్చిన సంఖ్య 18.5 లోపు ఉంటే వారు ఉండాల్సిన బరువు కన్నా తక్కువ బరువు ఉన్నారని గుర్తించాలి.

1. తక్కువ బరువు - 18.5
2. సాధారణ బరువు - 18.5 నుంచి 24.9 వరకు
3. అధిక బరువు - 25.0
4. ప్రీ- ఒబేస్ - 25 నుంచి 29.9వరకు
5. ఒబేస్ క్లాస్ (1) - 30.0 నుంచి 34.9 వరకు
6. ఒబేస్ క్లాస్ (2)- 35.0 నుంచి 39.9వరకు
7. ఒబేస్ క్లాస్ (3)- 40.0

స్థూలకాయం - కారణాలు

అధిక బరువు పెరగడానికి నిర్దిష్టమైన కారణాలను చెప్పడం సాధ్యం కాదు. అనేక కారణాలతో బరువు పెరుగుతారు. వైద్యనిపుణులు చెప్పే సాధారణ కారణాలు హెరిడిటీ, వయసు. వయసుతో పాటు స్థూలకాయం వచ్చే అవకాశాలూ కూడా కొందరిలో పెరుగుతాయి. మగవారు 29-34 ఏండ్ల మధ్య , మహిళలు 35-49 ఏండ్ల మధ్య బరువు పెరుగుతారని కొన్ని పరిశోధనల్లో స్పష్టమైంది. హెరిడిటీ, వయసు కాకుండా మరి కొన్ని కారణాలు ఉన్నాయి. వాటిలో శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లు ముఖ్యంగా చెప్పవచ్చు.

స్థూలకాయం రావడానికి ఎన్ని కారణాలున్నాయో దీనిని నివారించడానికి అనేక మార్గాలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులు, శారీరక వ్యాయామం.

జీవనశైలిలో మార్పులు..

రోజువారి జీవితంలో చిన్నచిన్న మార్పులు చేయడం ద్వారా ఇప్పటికే స్థూలకాయం సమస్యతో బాధపడుతుంటే ఇతర వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చు, భవిష్యత్‌లో వచ్చే అధిక బరువు సమస్యను నివారించవచ్చు.

- ఎక్కువ సమయం నిద్ర పోవడం శరీరాన్ని అచేతనంగా చేస్తుంది. యాక్టీవిటీ తగ్గి బద్ధకం పెరుగుతుంది. దీన్ని నివారించాలంటే ఎక్కువ గంటలు నిద్రపోకూడదు.
- తక్కువ దూరానికి వాహనాలు ఉపయోగించడం మానేయాలి.

ఆహారంలో మార్పులు..

- పొద్దున్నే గోరువెచ్చని నీరు తాగాలి. రోజుకు కనీసం ఆరు లీటర్ల నీళ్లు తాగాలి.
- ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవాలి.
- పాలు, పెరుగు, నూనె పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్స్ తీసుకోవడం మానేయాలి
- పెరుగు మీద తేట, పల్చటి మజ్జిగ స్థూలకాయాన్ని నియంత్రించడంలో సాయపడతాయి.
- పండ్లు, పండ్ల రసాలు ఎక్కువ తీసుకోవాలి. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ ఎంతో మంచిది.
- పోషకాలు ఎక్కువగా ఉండే ఆకు కూరలు అధికంగా తీసుకోవాలి
- వెన్న, చీజ్ వంటి పదార్థాలు తీసుకోవడం మానేయాలి.
- రోజూ క్యారెట్ జ్యూస్ తాగడం మంచిది
- వాము, శొంఠి, దాల్చిన చెక్క, మిరియాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి
- బరువును తగ్గించడంలో, శరీరంలోని కొవ్వును కరిగించడంలో పుదీనా చాలా బాగా పనిచేస్తుంది. రోజూ పుదీనా ఆహారంలో తీసుకోవాలి.
- పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే అన్నం, రొట్టెల కంటే పోషకాలు ఎక్కువగా ఉండే కూరగాయలను సలాడ్స్‌గా తీసుకోవడం మంచిది.
- శరీరానికి కావల్సిన ప్రోటీన్లను అందించి.. బరువు పెరగకుండా ఉండాలంటే మార్కెటులో అమ్మే చపాతి పిండికి బదులు ఇంట్లోనే తయారు చేసుకునే చపాతి పిండిని ఉపయోగించాలి. ఇందుకోసం ఒక కేజీ గోధుమలు, అరకేజీ జొన్నలు, అరకేజీ సజ్జలు, అరకేజీ రాగులు, 100గ్రాములు సెనగలు, 100గ్రాములు సోయాబీన్స్, 100గ్రాములు బార్లీగింజలు కలిపి పిండిపట్టించుకోవాలి. ఈ పిండితో చేసే చపాతీలలో అధిక పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికీ బలాన్నీ ఇస్తూ..అధిక బరువు పెరగకుండా నివారిస్తాయి.
- బేకరీ ఉత్పత్తులు, పెప్సీ, కోలా, కోక్ వంటి ఎయిరేటెడ్ డ్రింకులు, ఆల్కహాల్ తీసుకోవద్దు.
- వీటన్నింటితో పాటు పొద్దున్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టీ స్పూన్ నిమ్మరసం కలిపి తాగాలి. అధికబరువుతో ఇబ్బందిపడేవారికి ఇది మంచి టానిక్‌లా పనిచేస్తుంది. క్రమం తప్పకుండా రోజూ తాగితే భవిష్యత్‌లో శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకు పోకుండా చూస్తుంది.

అనారోగ్య సమస్యలు

భారీకాయం కారణంగా గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం, సంతాన సమస్యలు, క్యాన్సర్, కిడ్నీల్లో రాళ్లు, అల్సర్లు, గ్యాస్ట్రిక్ సమస్యల వంటివి ఎన్నో అనారోగ్య సమస్యలు దాడి చేస్తాయి. మోకాలి కీళ్లు అరిగే ప్రమాదమూ ఉంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) పెరిగి, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) తగ్గడంతో పక్షవాతం, గుండెజబ్బులు వస్తాయి. మనం ఒక కిలో బరువు పెరిగితే రోజుకి అదనంగా 30 కిలోమీటర్ల దూరం వరకు రక్తాన్ని నెట్టాల్సిన భారం గుండెపై పడుతుందట. ఉండాల్సిన బరువు కన్నా అధిక బరువు ఉండే ఆ భారం మోయాల్సిన బాధ్యత గుండెదే. అందుకే స్థూలకాయల్లో గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.



వ్యాయామం..

జీవనశైలీలో మార్పులు చేస్తూ.. ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా చేసే వ్యాయామం శరీరబరువును అదుపులో ఉంచుతుంది. రోజు అర గంట నుంచి 40నిమిషాల పాటు చేసే వ్యాయామం శరీరంలోని కొవ్వు నిల్వలను తగ్గించి.. అనేక జబ్బుల నుంచి రక్షణ ఇస్తుంది. అన్నింటికన్నా ఉత్తమమైన వ్యాయామం నడక. జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, స్కిపింగ్, ఔట్‌డోర్ గేమ్స్ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అధిక బరువు సమస్యను నివారిస్తాయి.

మోకీలు మార్పిడిలో ఆధునికత

మనలో చాలామంది వయసు పై బడే కొద్ది వచ్చే కీళ్ళ అరుగుదల వలన నడక నరకప్రాయమై, చిన్నచిన్న పనులకు కూడా ఇతరులపై ఆధారపడుతుంటారు. ఇటువంటివారికి కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స పునర్జన్మ అని చెప్పవచ్చు.

మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స ఎవరికి అవసరం?

నడక ఇబ్బంది అవుతున్న ప్రతివారికి మోకీలు మార్పిడి అవసరం లేదు. అయితే వారి లక్షణాలను, ఇబ్బందులను క్షుణ్ణంగా గమనించాలి. ఈ క్రింది లక్షణాలు కనిపించిన వారికీ మోకీలు మార్పిడి అవసరం అవుతుంది.

- కొన్ని నెలలుగా, సంవత్సరాలుగా మోకీలు నొప్పి తగ్గక బాధపడు తుండటం
- పది నిమిషాల కంటే ఎక్కువ సమయం నిలబడలేకపోవడం
- 500గజాల కంటే ఎక్కువ దూరం నడవలేకపోవడం
- ఎక్స్‌రేలో మోకీలు అరుగుదల చాలా ఎక్కువగా కనిపించడం

ఫాస్ట్ ట్రాక్ అనస్థీషియా..

ఇది వరకు ఇచ్చే అనస్థీషియా పద్ధతిలో ఆపరేషన్ తరువాత నొప్పులు ఎక్కువగా ఉండ టం వలన పేషెంట్స్ రెండు రోజుల తర్వాత గాని నడక మొదలు పెట్టేవాళ్ళు కాదు. కాని ఈ నూతన పద్ధతిలో అనస్థీషియా ఇచ్చి సర్జరి చేసిన రోజు సాయంత్రం నుంచే నడక ఆరంభించడం, రెండు రోజుల్లోనే హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్ళడం జరుగుతుంది. ఇలా మొదటిరోజు నుండే నడవడం వలన వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి చాలా తొందరగా కోలుకోవడం గమనించదగ్గ విషయం. అంతేకాక వారు కొద్దికాలంలోనే వారి నిత్యావసర పనులు చేసుకోవడమే కాక, మెట్లు ఎక్కడం, వాహనాలు నడపటం ఆనందకరమైన విషయం.



ఈ పద్ధతి ద్వారా, ఆపరేషన్ తర్వాత నొప్పి తక్కువగా ఉండటం వలన ఇంతకు ముందులా నొప్పి తగ్గడానికి వాడే మాత్రలు (పెయిన్ కిల్లర్స్) కూడా చాలావరకు తగ్గుతాయి. తద్వారా వాటివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం కూడా తగ్గినట్టే. అంతేకాకుఇడా పేషెంట్ ఆపరేషన్ చేసిన రోజు నుండే నడవడం ద్వారా రక్తనాళాలలో రక్తం గడ్డకట్టే సమస్య (DVT) వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.



ఇంప్లాంట్‌లో వచ్చిన ఆధునికతలు..

శస్త్రచికిత్సలో వాడే ఇంప్లాంట్స్‌లో విప్లవాత్మకమైన మార్పులు ఎన్నో వచ్చాయి. ఇంతకు ముందువాడే ఇంప్లాంట్స్ వల్ల మెటల్ ఎలర్జిలు వచ్చే అవకాశం ఉండేది. అంతే కాకుండా వాటి మన్నిక కూడా తక్కువే. కాని ఇప్పుడు వచ్చే ఇంపోర్టెడ్ ఇంప్లాంట్స్ 30ఏండ్ల వరకు మన్నగలవని ల్యాబ్‌లో ధృవీకరించబడినది.

వెరిలాస్ట్ ఆక్సీనియం...

మోకీలు , తుంటి మార్పిడిలో వాడే ఆక్సీనియం(ఆక్సీడైజ్‌డ్ జిర్కోనియం) ను XLPE తో జతచేసి వాడేదే ఈ వేరిలాస్ట్ ఆక్సీనియం.

- ఇది అమెరికా ఎఫ్‌డిఏలో 30ఏండ్లు మన్నుతుందని ధృవీకరించ బడినది.
- ఇది బరువులో గతంలోని ఇంప్లాంట్స్ కంటే 20శాతం తక్కువగా ఉంటుంది. సన్నగా ఉండటం వలన మన్నిక రెండింతలు ఎక్కువ.
- ఇదివరకు ఉన్న ఇంప్లాంట్స్ కంటే మరింత ధృడమైనది.

మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు ఆక్సీనియంతో చేసిన వారిలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కాని, ఇన్ఫెక్షన్లు కాని రావడం చాలా చాలా అరుదు.

తప్పనిసరి అయితేనే శస్త్రచికిత్స చేయడం లేదా పేషెంట్‌కి మందులతోనే నయం చేయడం జరుగుతుంది. అంతేకాదు శ్రీకర హాస్పిటల్స్‌లో ఇహెచ్ఎస్ సదుపాయం ఉంది.

డాక్టర్ కార్తీక్ తెలగారెడ్డి
మోకీలు,తుంటి
శస్త్రచికిత్స ప్రముఖ నిపుణులు
శ్రీకర హాస్పిటల్స్, సికింద్రాబాద్.
ఫోన్. 8985 896 229



సమ్మర్ హెల్త్ టిప్స్

చర్మసంరక్షణ

ఎండాకాలం చాల రకాల సమస్యలను తెచ్చిపెడ్తుంది. ముఖ్యంగా చర్మసమస్యలు ఎక్కువగా వస్తాయి. ముఖం జిడ్డుగా మారి చికాకు తెప్పిస్తుంది. డ్రై, ఆయిల్ స్కిన్ వారే కాదు నార్మల్ స్కిన్ వారు సైతం ఎండాకాలం స్కిన్ ప్రాబ్లమ్స్ ఎదుర్కొంటారు. కొన్ని చిన్నచిన్న జాగ్రత్తలతో చర్మాన్ని ఎండబారి నుంచి కాపాడుకోవచ్చు..

- వీలైనంత వరకు సూర్యరశ్మికి దూరంగా ఉండండి. ప్రత్యేకంగా మిట్ట మధ్యాహ్నం ఎట్టి పరిస్థితుల్లో వెండలో బయటకు వెళ్ళకండి. ఒక వేల వెళ్ళాల్సివస్తే తల, మొహం ఏదైనా కాటన్ క్లోథ్ తో కవర్ చేసుక్వడం మర్చిపోవద్దు. సూర్య రశ్మి లో ఉండే ఖఎకిరణాలు చర్మంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అంతే కాకుండా చర్మకాన్సర్ కు కూడా కారణం అవుతాయి.
- సూర్య కిరణాలలో ఉండే ఆల్ట్రా వయొలెట్ కిరణాలు సున్నితమైన చర్మానికి చాల హాని కారకాలు. ఇవి చర్మంలోని తాజాదనం, రంగు కోల్పోయేలా చేస్తాయి. వీటి నుంచి రక్షణ పొందాలంటే సన్ స్క్రీన్ లోషన్ ఉపయోగించాలి. ఆల్ట్రా వయొలెట్ కిరణాలు సూర్య కాంతి లోనే కాదు మాములు వాతావరణంలో కూడా ఉంటాయి. ఎండలోకి వెళ్లినప్పుడు కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా వీటిని వాడాలి.



- హెవీ మాయిచ్చొరైజర్‌లు ఎండాకాలంలో చర్మలోని స్వేద రంధ్రాలను ముసివేయడానికి అవకాశాలు న్నాయి. వీటివల్ల అనేక రకాలైన ఇబ్బందులు రావడమే కాకుండా, చర్మం పొడిబారి పోతుంది. అందుకే ఎండాకాలంలో హెవీ కాని మాయిచ్చొరైజర్ లు, ఫౌండేషన్లు మాత్రమే ఉపయోగించాలి.
- వాతావరణంలో తేమ తగ్గడంతో చర్మం సులభంగా పొడి బారుతుంది. పొడి బారిన చర్మం సహజ మెరుపును కోల్పోవడమే కాకుండా ముడుతలు పడడానికి కూడా దారి తీస్తుంది. దీంతో చర్మం వయసు పై బడినట్టు కనపడుతుంది. దీన్ని నివారించాలంటే ముఖాన్ని ఎక్కువ సార్లు కడగక పోవడం మంచిది. అలసట అనిపించిన ప్రతిసారి చల్లని నీటితో తడిపిన కాటన్ క్లాత్‌తో ముఖం తుడుచుకోవాలి.
- ఎండా కాలంలో ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఎంత ఎక్కువగా మంచి నీళ్ళు తాగితే అంత ఆరోగ్యం. అంతే కాదు, చర్మ సౌందర్యం కూడా. ఎక్కువగా నీళ్లు తాగడం వల్ల శరీరం లోని మలినాలు సులభంగా బయటకు వెళ్తాయి. డీ హైడ్రేషన్ అవకుండా చూసుకోవడం వలన చర్మం పొడి బారకుండ కూడా ఉంటుంది. ఎండా కాలంలో ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవడం చర్మానికే కాదు ఆరోగ్యానికి ఎంతో అవసరం.

బిస్కెట్లు ఎక్కువగా తింటే..!



బిస్కెట్లు తింటే బుర్ర పనిచేయదా? అవుననే అంటున్నాయి కొత్త పరిశోధనలు. అదేపనిగా బిస్కెట్లు, కేకులు తింటే మెమొరీ దెబ్బతినే ప్రమాదముందట! బిస్కెట్లు, కేకుల ప్రాసెసింగ్ సమయంలో బిస్కెట్లు కరకరలాడేందుకు, కేకులకు మంచి ఫ్లేవర్ రావడానికి వాడే ట్రాన్స్‌ఫ్యాట్స్ అనే కొన్నిరకాల కొవ్వు పదార్థాలే. దీంతోపాటు హైడ్రోజెనేటెడ్ ఆయిల్స్ వాడటం వల్ల ఆరోగ్యంపై చెడుప్రభావం చూపుతుందని సైంటిస్టులు తేల్చారు. ట్రాన్స్‌ఫ్యాట్స్ అధికంగా ఉండే బిస్కెట్లు, కేకులు ఎక్కువగా తినేవారిలో మెమొరీ పవర్ తగ్గి పోయే ప్రమాదముందంటున్నారు శాస్త్రవేత్తలు. బిస్కెట్లు, కేకుల్లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ ప్రభావం గురించి యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాండియాగో స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తలు 45 ఏండ్లలోపు వయసున్న వెయ్యి మందిపై పరిశోధనలు చేశారు. ట్రాన్స్‌ఫ్యాట్స్‌తో కూడిన బిస్కెట్లు, కేకులు అధికంగా తిన్నవారిలో జ్ఞాపకశక్తి తగ్గిపోవడాన్ని గమనించారు. మరికొంతమందిలో అధిక బరువు, గుండె సంబంధిత వ్యాధులు బయటపడ్డాయి. బ్రిటన్‌లో ఈ ఫ్యాట్స్ వాడకాన్ని దాదాపు నిషేధించినంత పని చేశారు.

చెమటకు కారణం అలసట

ఎండాకాలం వచ్చిందంటే చాలు చెమటతో ఇబ్బంది పడేవారి సంఖ్య కన్నా.. ఇతరుల నుంచి వచ్చే చెమట దుర్వాసనను భరించేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

జనసంచారం ఎక్కువగా ఉండే రద్దీ ప్రాంతాల్లో ఇది పెద్ద సమస్య. చాలామంది తమ శరీరం నుంచి వచ్చే చెమట దుర్వాసనను ఎలా తగ్గించుకోవాలో తెలియక సతమతమవుతారు. కొన్ని చిట్కాలు పాటిస్తే.. మీకే కాదు ఇతరులకు ఇబ్బంది కలిగించే చెమట వాసన నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఇటీవల జరిగిన వివిధ అధ్యయనాల తర్వాత చెమట గురించిన కొన్ని వాస్తవాలు తెలిశాయి. వాతావరణంలోని వేడి చెమటకు కారణం అనుకుంటారు. కానీ, ఇది నిజం కాదు. చెమట పట్టడానికి ముఖ్య కారణం అలసట, అశాంతి, చికాకు. ఎండా కాలంలో వాతావరణం చికాకు తెప్పించేలా ఉంటుంది. ఉష్ణోగ్రత పెరగడంతో స్వేధ గ్రంధుల నుంచి చెమట ఉత్పత్తి అవుతుంది. శరీర దుర్వాసనకు ఈ స్వేధ గ్రంధులే ముఖ్య కారణం.



- ప్రతి రోజు పొద్దున, రాత్రి స్నానం చేయడం వల్ల అలసట నుంచి బయటపడవచ్చు.
- స్నానం చేసే నీటిలో సువాసభరితమైన రోజ్‌వాటర్‌ను, అర స్పూన్ నిమ్మరసం జతచేస్తే.. మరింత రిలాక్స్ ఉంటుంది.
- శుభ్రంగా ఉతికిన బట్టలను ధరించడం వలన శరీరం నుండి దుర్వాసన రాదు.
- వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యం.
- వీటితో పాటు మీరు తీసుకునే ఆహారంలోనూ కొన్ని మార్పులు చేయండి.
- చెమటను త్వరగా పీల్చుకునే కాటన్ వస్త్రాలను ధరించండి.
- టెన్షన్ వల్ల చెమట ఎక్కువ వస్తుంది. ప్రశాంతత చాలా ముఖ్యం. పాజిటివ్ థింకింగ్ పెంచుకోవాలి.

హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్‌పై అనర్హత వేటు

- విరుద్ధ ప్రయోజనాల అంశంలో అంబుడ్స్‌మన్ నిర్ణయం

హైదరాబాద్ : విరుద్ధ ప్రయోజనాల అంశంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానందపై అంబుడ్స్‌మన్ అనర్హత వేటు వేశాడు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా కొనసాగుతున్న వివేక్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నాడని అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి తేల్చారు. ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన కార్యదర్శి టి. శేష్ నారాయణ్‌ను హెచ్‌సీఏలో ఎటువంటి పదవులు చేపట్టడానికి వీల్లేదని అంబుడ్స్‌మన్ చెప్పాడు. శేష్ నారాయణన్‌పై సెలక్షన్ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేసి, రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తదుపరి ఎన్నికలు జరిగే వరకూ ఉపాధ్యక్షుడు రోజువారీ వ్యవహారాలు చూడాలని, విధాన పరమైన నిర్ణయాలు మాత్రం తీసుకోవడానికి లేదని అంబుడ్స్‌మన్ వెల్లడించారు. వ్యక్తిగత పని నిమిత్తం చెన్నైకి వెళ్లిన వివేక్.. అంబుడ్స్‌మన్ నిర్ణయంపై స్పందించాడు. ఆర్డర్‌లో ఏముందో తెలియదు, కానీ అంబుడ్స్‌మన్ నిర్ణయాన్ని గౌరవిస్తానని వివేక్ తెలిపాడు.


మాజీ చీఫ్ సెలక్టర్ వెంగ్ సర్కార్


విరాట్ కోహ్లి

భారత క్రికెట్‌లో బోర్డు మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసన్ మాయాజాలం అందరికీ సుపరిచితమే. కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో శ్రీనివాసన్ బోర్డు వ్యవహారాలే కాదు జట్టు ఎంపికలోనూ జోక్యం చేసుకునేవాడని గతంలోనూ పలువురు సెలక్టర్లు బాహాటంగా వెల్లడించారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల్లో వైట్‌వాష్ ఓటమి అనంతరం ధోనిని కెప్టెన్సీ నుంచి తప్పించగా శ్రీనీ అడ్డుకున్నాడని మాజీ చీఫ్ సెలక్టర్ మోహిందర్ అమరనాథ్ గతంలోనే చెప్పాడు. తాజాగా మరో మాజీ చీఫ్ సెలక్టర్ వెంగ్ సర్కార్ పెదవి విప్పాడు. విరాట్ కోహ్లి భారత క్రికెట్ సూపర్‌స్టార్‌గా దూసుకెళ్తోన్న తరుణంలో వెంగ్‌సర్కార్ వ్యాఖ్యలు ప్రాధానత్య సంతరించుకున్నాయి.

కోహ్లిని ఎంపిక చేసినందుకు.. పదవి కోల్పోయాను

- మాజీ చీఫ్ సెలక్టర్ వెంగ్ సర్కార్ ఆవేదన
- శ్రీనివాసన్, ధోనిలు అడ్డుపడ్డారని వ్యాఖ్యలు

నవతెలంగాణ-ముంబయి

2008లో అప్పటి అండర్-19 సారథి విరాట్ కోహ్లిని జట్టులోకి ఎంపిక చేసి జాతీయ జట్టుకు ఆణిముత్యాన్ని అందించినా.. సొంత రాష్ట్రానికి చెందిన ఆటగాడిని ఎంపిక చేయలేదని అప్పటి బీసీసీఐ కోశాధికారి ఎన్.శ్రీనివాసన్ ఆగ్రహానికి గురై భారీ మూల్యం చెల్లించానని మాజీ చీఫ్ సెలక్టర్ దిలీప్ వెంగ్ సర్కార్ వాపోయాడు. క్రీడా పాత్రికేయులు ఏర్పాటు చేసిన ఓ సమావేశానికి హాజరైన వెంగ్ సర్కార్ ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులుగా గత అనుభవాన్ని వెల్లడించాడు. 'భారత జట్టు కెప్టెన్‌గా, ఆటగాడిగా, చీఫ్ సెలక్టర్‌గా కొనసాగిన మీకు.. ఏది క్లిష్టమైన బాధ్యత అనిపించింది' అడుగగా.. సర్కార్ వెంటనే మరో ఆలోచనకు తావులేకుండా చీఫ్ సెలక్టర్ అత్యంత క్లిష్టమైన బాధ్యతగా అని ఎంచుకున్నాడు. అందుకు గల కారణాలను సవివరంగా అందరితో పంచుకున్నాడు.

విరాట్‌కు అవకాశం ఇవ్వాలని అనుకున్నాను

2008లో శ్రీలంకలో సిరీస్‌కు జట్టుకు ఎంపిక చేయాల్సి ఉంది. అంతకంటే ముందే ఆస్ట్రేలియాలో పర్యటించే భారత్- ఎ జట్టుకు అండర్-23 క్రికెటర్లను పంపాలని నిర్ణయించాం. అప్పుడే అండర్-19 ప్రపంచకప్ సాధించి ఊపుమీదున్న విరాట్ కోహ్లిని ఆ పర్యటనకు ఎంపిక చేశాం. కుర్రాళ్ల ఆట చూసేందుకు నేనూ ఆస్ట్రేలియా వెళ్లాను. బ్రిస్బేన్‌లో న్యూజిలాండ్‌తో మ్యాచ్. కివీస్ జట్టు మన కంటే బలంగా ఉంది. కొందరు టెస్టు ఆటగాళ్లు సైతం ఆడుతున్నారు. ఈ మ్యాచ్‌లో కోహ్లి అజేయంగా 120 పరుగులు కొట్టాడు. కోహ్లి జాతీయ జట్టుకు ఆడే సమయం ఆసన్నమైందని అప్పుడే అనిపించింది. విరాట్ పరిణతి చెందిన బ్యాట్స్‌మన్‌గా అనిపించాడు. ఓపెనర్‌గా కోహ్లి సెంచరీతో 249 పరుగుల ఛేదనలో భారత్ గెలుపొందింది. ఆ మ్యాచ్‌లో జెస్సీ రైడర్, మార్టిన్ గప్టిల్, వాట్లింగ్, కోరె అండర్సన్, బెన్నెట్ వంటి ఆటగాళ్లు కివీస్ తరపున ఆడారు.

శ్రీలంక పర్యటన విరాట్ కోహ్లి అరంగేట్రానికి సరైన సమయం అనిపించింది. మిగతా నలుగురు సెలక్టర్లు నా నిర్ణయంతో ఏకీభవించారు. కానీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్, కెప్టెన్ ఎం.ఎస్ ధోనిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంతకముందు ఎన్నడూ కోహ్లి ఆట చూడలేదని మహి అనగా.. ఫర్వాలేదు నేను చూశానని బదులిచ్చాను. నాకు తెలుసు, ఎస్.బద్రినాథ్ దక్షిణాది ఆటగాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. కోహ్లిని ఎంపిక చేస్తే బద్రినాథ్ చోటు కోల్పోతాడు. నేను కోహ్లిని ఎంపిక చేశాను, బద్రినాథ్‌కు మొండిచెయ్యి ఎదురైంది. కానీ సచిన్ టెండూల్కర్ గాయంతో వైదొలగగా.. అతడి స్థానంలో బద్రినాథ్‌ను జట్టులోకి తీసుకున్నాం. ఆ సిరీస్‌లో కోహ్లికి ఐదు మ్యాచుల్లోనూ అవకాశం రాగా.. ఓ అర్ధ సెంచరీతో 31.50 సగటుతో పరుగులు చేశాడు. మూడు మ్యాచుల్లోనే ఆడిన బద్రినాథ్ 19.5 సగటు మాత్రమే సాధించాడు. అయితే, సెలక్షన్ కమిటీ సమావేశంలో కోచ్, కెప్టెన్‌ల అభ్యంతరంతోనే ఆ సమస్య సమసిపోలేదు. జట్టును ప్రకటించిన తర్వాత రోజు బోర్డు కోశాధికారి శ్రీనివాసన్ నుంచి ఫోన్. బద్రినాథ్‌ను ఏ విధంగా వదిలేస్తారు? అని ప్రశ్నించాడు. వర్ధమాన దేశాల టోర్నీలో విరాట్ కోహ్లి బాగా రాణించాడని చెప్పాను. అందుకు శ్రీనీ.. దేశవాళీలో బద్రినాథ్ 800 పరుగులు చేశాడు కదా? అతనికి ఎప్పుడు ఇస్తారు అవకాశం? అని అడిగాడు. నేను ఎటువంటి గ్యారెంటీ ఇవ్వలేను, కానీ అతడికీ ఓ రోజు అవకాశం వస్తుందని చెప్పాను.


మహితో శ్రీనివాసన్

శ్రీకాంత్‌ను కూర్చోబెట్టారు

శ్రీనివాసన్‌తో ఫోన్ సంభాషణ ముగిసిన తర్వాతి రోజు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తమిళనాడుకు చెందిన మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్‌ను తీసుకొని బీసీసీఐ అధ్యక్షుడు శరద్ పవార్‌తో శ్రీనీ భేటీ అయ్యాడు. నన్ను ఇంటికి సాగనంపారు, సెలక్టర్‌గా నా కెరీర్‌కు అలా శుభం కార్డు పడిందని వెంగ్‌సర్కార్ చెప్పుకొచ్చాడు.

విరుద్ధ ప్రయోజనాలు!

అయితే వెంగ్‌సర్కార్ చీఫ్ సెలక్టర్ పదవి కోల్పోవడానికి విరుద్ధ ప్రయోజనాల అంశం తెరపైకి వచ్చింది. 2008 సెప్టెంబర్‌లో బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశంలో శశాంక్ మనోహర్ అధ్యక్షుడిగా, శ్రీనివాసన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే సమావేశంలో రాష్ట్ర సంఘాల పదవుల్లో కొనసాగుతున్న వారు సెలక్షన్ కమిటీలో కొనసాగేందుకు వీల్లేదని నిబంధన తీసుకొచ్చారు. అప్పుడు వెంగ్‌సర్కార్ ముంబయి క్రికెట్ అసోసియేషన్ కోశాధికారిగా కొనసాగుతున్నారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉండటంతో వెంగ్‌సర్కార్ రాష్ట్ర సంఘంలోని పదవి వైపే మొగ్గుచూపాడు.

అయితే, వెంగ్‌సర్కార్ ఉన్నట్టుండి ఇప్పుడీ విషయాల్ని బయటకు చెప్పటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదు. వెంగ్‌సర్కార్‌పై వేటుకు కారణం విరాట్ కోహ్లి ఎంపిక. ఇప్పుడు కోహ్లి భారత క్రికెట్‌లో అత్యంత బలమైన వ్యక్తి. సీనియర్ ఆటగాడు ఎం.ఎస్ ధోనితో అతడి మైత్రీ బంధం బలమైనదే. ఈ నేపథ్యంలో తమిళనాడు, చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించటం కోసం శ్రీనివాసన్, ధోనిలు ప్రయత్నించారని వెంగ్‌సర్కార్ ఆరోపించటం గమనార్హం.

నిదాస్ ట్రోఫీలో కుర్రోళ్లు కుదురుకున్నారు. రోహిత్ సారథ్యంలోని యువభారత్ సమిష్టి ప్రదర్శనతో రెండో పొట్టిపోరులో బంగ్లాదేశ్‌పై ఆరువికెట్ల తేడాతో విజయం అందుకున్నది. లంకతో మ్యాచ్‌లో గర్జించిన గబ్బర్.. బంగ్లాతో పోరులోనూ అర్థ శతకంతో చెలరేగాడు. బౌలర్లు రాణించి తొలుత బంగ్లాను కట్టడి చేయగా.. ఛేదనలో బ్యాట్స్‌మెన్ మరో ఎనిమిది బంతులుండగానే లాంఛనాన్ని ముగించారు.

బోణీ చేశారు

బంగ్లాదేశ్‌పై ఆరువికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం

- శిఖర్ ధావన్ అర్థ శతకం
- రాణించిన భారత బౌలర్లు
- ముక్కోణపు టీ20 సిరీస్

నవతెలంగాణ-కొలంబో

యువతారలు మెరిశాయి. ప్రేమదాస మైదానంలో తొలి అడుగులు తడబడినా రెండో అవకాశాన్ని అందిపుచ్చుకున్న రోహిత్ సేన.. బంగ్లాదేశ్ పై సునాయసంగా గెలుపొందింది. నిలకడగా రాణించి నిదాస్ ట్రోఫీలో బోణీ చేసింది. తొలుత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయటంతో బంగ్లాదేశ్ ఎనిమిది వికెట్లు కోల్పోయి భారత్‌కు కేవలం 140 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. టీమిండియా బ్యాట్స్‌మెన్ సులువైన లక్ష్యాన్ని ఊదిపడేశారు. శిఖర్ ధావన్ (55) అర్ధ శతకంతో రెచ్చిపోగా.. సురేశ్ రైనా (28), మనీశ్ పాండే (27) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. దీంతో ఆరు వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. కీలక వికెట్లు కూల్చిన విజయ్ శంకర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ముక్కోణపు టీ20 సిరీస్‌లో నాల్గో మ్యాచ్‌లో భారత్ సోమవారం శ్రీలంకతో తలపడనున్నది.


తొలి అంతర్జాతీయ వికెట్ కూల్చిన శంకర్‌కు రైనా అభినందన

బౌలర్లు మెరుగ్గా : టాస్ గెల్చి బౌలింగ్ ఎంచుకున్నది భారత్. బౌలర్లు సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఐదు ఓవర్లలోపే బంగ్లాదేశ్ ఓపెనర్లను ఔట్ చేశారు. పేస్‌బౌలర్ ఉనద్కత్ భారత్‌కు తొలి వికెట్ అందించాడు. సౌమ్య సర్కార్‌ను (14) ఉనద్కత్ పెవిలియన్ బాట పట్టించాడు. మరో ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (15) కూడా శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో ఉనద్కత్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. స్లో పిచ్‌పై బౌండరీలు బాదటానికి బంగ్లా బ్యాట్స్‌మెన్ తీవ్రంగా శ్రమించినా సంపూర్తిగా సఫలం కాలేకపోయారు. లితాన్ దాస్ (34), సబ్బీర్ రెహ్మాన్ (30) మినహా మరెవ్వరూ రాణించలేదు. ఆఖరు ఓవర్లలో ఉనద్కత్, విజయ్ శంకర్ బౌలింగ్ దాటికి బంగ్లా టపటపా వికెట్లు పారేసుకున్నది. నిర్ణీత ఓవర్లలో ఎనమిది వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. భారత్ తరపున జైదేవ్ ఉనద్కత్ మూడు వికెట్ల పడగొట్టాడు. విజయ్ శంకర్ రెండు, శార్దూల్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్‌లు ఒక్కో వికెట్ చొప్పున కూల్చారు. వాషింగ్టన్ వికెట్లేమీ తీయకపోయినా పొదుపుగా బంతులేసి ఆకట్టుకున్నాడు.

ధావన్ మరోసారి : శ్రీలంకతో తొలి టీ20లో హాఫ్ సెంచరీతో వీర విహారం చేసిన శిఖర్ ధావన్ (55, 43 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు).. బంగ్లాదేశ్‌పైనా అర్థ శతకంతో చెలరేగాడు. ఓపెనర్ రోహిత్ శర్మ (17) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా, వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ (7) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమైనా.. ధావన్ దూకుడులో మార్పు లేదు. నిలకడైన ఆటతీరు కనబర్చిన టీమిండియా గబ్బర్.. సురేశ్‌రైనా (28, 27 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్) తోడుగా భారత స్కోరు బోర్డును నడిపించాడు. జట్టు స్కోరు 108 ఉన్నపుడు రూబెల్ బౌలింగ్‌లో మెహదీ హసన్‌కు క్యాచ్ ఇచ్చి రైనా ఔటవ్వగా క్రీజులోకొచ్చిన మనీశ్ పాండే (27 నాటౌట్, 19 బంతుల్లో 3 ఫోర్లు) లాంఛనాన్ని ముగించాడు. 17వ ఓవర్ నాల్గో బంతికి తాస్కిన్ మహ్మద్ బౌలింగ్‌లో దాస్‌కు క్యాచ్ ఇచ్చి శిఖర్ మైదానాన్ని వీడాడు. లక్ష్యాన్ని ఛేదించే పనిలో మనీశ్ పాండే ఉండగా.. దినేశ్ కార్తిక్ (2 నాటౌట్) మరో ఎండ్‌లో అతనికి మద్దతునిచ్చాడు. దీంతో మరో ఎనిమిది బంతులుండగానే భారత్ లక్ష్యాన్ని అందుకున్నది. బంగ్లా బౌలర్లలో రూబెల్ హుస్సేన్ రెండు.. ముస్తాఫిజుర్ రెహ్మాన్, తాస్కిన్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు.


ధావన్ 55

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : తమీమ్ ఇక్బాల్ (సి) ఉనద్కత్ (బి) శార్దూల్ 15, సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనద్కత్ (14), లితాన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34, ముష్ఫికర్ రహీమ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) విజయ్ శంకర్ 18, మహ్మదుల్లా (సి) శార్దూల్ (బి) విజయ్ శంకర్ 1, సబ్బీర్ రెహ్మాన్ (సి) దినేశ్ కార్తీక్ (బి) విజయ్ శంకర్ 30, మెహదీ హసన్ (సి) మనీశ్ పాండే (బి) ఉనద్కత్ 3, తాస్కిన్ అహ్మద్ నాటౌట్ 8, రూబెల్ హుస్సేన్ రనౌట్ (రైనా/శార్దూల్) 0, ముస్తాఫిజుర్ రెహ్మాన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 15,
మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 139.
వికెట్ల పతనం : 1-20, 2-35, 3-66, 4-72, 5-107, 6-118, 7-134, 8-135.
బౌలింగ్ : జైదేవ్ ఉనద్కత్ 4-0-38-3, వాషింగ్టన్ సుందర్ 4-0-23-0, శార్దూల్ ఠాకూర్ 4-0-25-1, యుజ్వేంద్ర చాహల్ 4-0-19-1, విజయ్ శంకర్ 4-0-32-2.
భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (బి) ముస్తాఫిజుర్ 17, శిఖర్ ధావన్ (సి) లితాన్ దాస్ (బి) తాస్కిన్ 55, రిషబ్ పంత్ (బి) రూబెల్ 7, సురేశ్ రైనా (సి) హసన్ (బి) రూబెల్ 28, మనీశ్ పాండే బ్యాటింగ్ నాటౌట్ 27, దినేశ్ కార్తీక్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు 4, మొత్తం : (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 140.
వికెట్ల పతనం : 1-28, 2-40, 3-108, 4-123.
బౌలింగ్ : ముస్తాఫిజుర్ రెహ్మాన్ 4-0-31-1, తాస్కిన్ అహ్మద్ 3-0-28-1, 3.4-0-24-2, రూబెల్ హుస్సేన్ 3.4-0-24-2, మెహదీ హసన్ 4-0-21-0, సౌమ్య సర్కార్ 1-0-8-0, మహ్మదుల్లా 1-0-11-0, నజ్ముల్ ఇస్లామ్ 2-0-15-0.

ఎన్నికలు జరిపించండి

- సుప్రీంకోర్టుతో పాలకుల కమిటీ

న్యూఢిల్లీ : బీసీసీఐ నూతన రాజ్యాంగంపై సుప్రీంకోర్టు ఇంకా ఏమీ తేల్చకుండానే.. తక్షణమే బోర్డు ఆఫీస్ బేరర్లకు ఎన్నికలు నిర్వహించాలని పాలకుల కమిటీ భావిస్తోంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు సమర్పించిన ఎనిమిదో ప్రగతి నివేదికలో పేర్కొన్నది. ప్రస్తుత ఆఫీస్ బేరర్ల పదవీ కాలం మార్చి 1తో ముగిసింది. కానీ నూతన రాజ్యాంగం ఖరారు కాకపోవటం, లోధా కమిటీ సిఫారసుల అమలులో తీవ్ర జాప్యంతో ఎన్నికల ఆలోచన లేదు. లోధా సిఫారసుల ప్రకారం ప్రస్తుత ఆఫీస్ బేరర్లు ఎవ్వరూ తిరిగి పోటీ చేసేందుకు అర్హులు కాదు. నిరుడు డిసెంబర్‌లో నూతన రాజ్యాంగ ముసాయిదాను సీవోఏ సుప్రీంకోర్టుకు సమర్పించింది. కొంత కాలంగా ఈ విషయంలో కోర్టు వాదనలు వినలేదు. ఈ నెలాఖరున తిరిగి వాదనలు వినే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఎన్నికలు నిర్వహించి కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకునేందుకు ఆదేశాలు ఇవ్వాలని సీవోఏ కోర్టును కోరింది.



మాకు చెప్పకుండా ఎలా చేస్తారు?

ఆటగాళ్ల నూతన కాంట్రాక్టు ఖరారు విషయంలో పాలకుల కమిటీ ఏకపక్షంగా వ్యవహరించదని బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫీస్ బేరర్లను ఏమాత్రం సంప్రదించకుండా, అధికారాలను పూర్తిగా హరిస్తూ వినోద్ రాయ్ కమిటీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నదని చౌదరి ఆరోపించాడు. ఈ విషయంలో సీవోఏ వైఖరిపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని చౌదరి తెలిపాడు.

కోహ్లి, ధోని మార్క్!

- వారి సూచనలతో కాంట్రాక్టు జాబితా



నవతెలంగాణ- ముంబయి : జాతీయ జట్టు తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతూ, అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోన్న ఆటగాళ్లకు రివార్డు ఇవ్వాలని కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోనిలు బలంగా విశ్వసించారని తెలుస్తోంది. భారత క్రికెట్ బోర్డు ఆర్థికంగా బలంగా ఉన్నా.. ఆటగాళ్లకు మాత్రం మిగతా బోర్డులతో పోల్చితే తక్కువ వేతనాలు అందుతున్నాయని నిరుడు మాజీ చీఫ్ కోచ్ అనిల్ కుంబ్లే పాలకుల కమిటీ ఎదుట వాదించారు. ఏ గ్రేడ్ ఆటగాడికి రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే, గతేడాది సెప్టెంబర్‌తో కాంట్రాక్టు గడువు ముగియగా.. తాజాగా బుధవారమే నూతన కాంట్రాక్టులు ప్రకటించారు. ఈ జాబితాలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఏ ప్లస్ విభాగంలో అన్ని ఫార్మాట్లలో బాగా ఆడుతున్న ఆడుతున్న ఐదుగురు ఆటగాళ్లకు రూ. 7 కోట్లు ఇస్తున్నారు. 'ఏ ప్లస్ విభాగం ఆలోచన ధోని, కోహ్లిలు సూచించారని' పాలకుల కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ తెలిపాడు. ప్రదర్శనలో తేడా వస్తే కాంట్రాక్టు గ్రేడ్‌లోనూ అది కనిపిస్తోందని, ఆటగాళ్లు అత్యుత్తమంగా రాణించేందుకు ఇది దోహదం చేస్తుందని రాయ్ అభిప్రాయపడ్డాడు. వార్షిక కాంట్రాక్టు ఖరారు చేయడానికి ముందు (డిసెంబర్‌లో) కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి సహా ఎం.ఎస్ ధోని ఇతర ఆటగాళ్లతో పాలకుల కమిటీ పలు దఫాలు చర్చలు జరిపింది.

ఐ లీగ్ విజేత పంజాబ్



న్యూఢిల్లీ : ఐ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీ టైటిల్ ఈ ఏడాది సైతం కొత్త విజేతను వరించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో మినర్వా పంజాబ్ ఎఫ్‌సీ 1-0తో చర్చిల్ బ్రదర్స్ జట్టును ఓడించి, చాంపియన్లుగా అవతరించింది. ఐ లీగ్ ట్రోఫీ గెల్చిన తొలి ఉత్తర భారత జట్టుగా మినర్వా పంజాబ్ చరిత్ర సృష్టించింది. పేలవ ఫామ్‌తో లీగ్‌కు దూరమయ్యే పరిస్థితి నుంచి టైటిల్ విజయం దిశగా సాగిన పంజాబ్ ప్రయాణం.. గతేడాది విజేత ఐజాల్ ఎఫ్‌సీను గుర్తుకు తెచ్చింది. ఐ లీగ్ టైటిల్ గెల్చిన (2017లో) తొలి ఈశాన్య భారత జట్టు ఐజాల్ ఎఫ్‌సీ.

యుకీదే పైచేయి

- అర్హత పోరులో రామ్‌కుమార్‌పై గెలుపు
- తొలి రౌండ్లోనే వెనుదిరిగిన షరపోవా
- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్


యుకీ బాంబ్రీ

ఇండియన్ వెల్స్ (అమెరికా) : భారత అగ్ర శ్రేణి టెన్నిస్ ఆటగాళ్ల మధ్య పోరులో యుకీ బాంబ్రీదే పైచేయి. ఇండియన్ వెల్స్ రెండో అర్హత రౌండ్లో తొమ్మిదో సీడ్ యుకీ సహచర ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్‌ను 6-4, 6-2తో ఓడించాడు. రామ్‌కుమార్‌పై తన రికార్డును 3-1కి పెంచుకున్నాడు. చివరిసారిగా 2009లో మియామి మాస్టర్స్‌లో ఆడిన యుకీ.. తాజా విజయంతో సీజన్‌లో తొలి మాస్టర్స్ టోర్నీ ప్రధాన పోరులో అడుగుపెట్టాడు. తొలి రౌండ్లో యుకీ మరో క్వాలిఫైయర్ నికోలస్ మహుత్‌తో తలపడనున్నాడు. ఈ పోరు గెలిస్తే రెండో రౌండ్లో ప్రపంచ 12వ ర్యాంకర్, ఫ్రాన్స్ ఆటగాడు లుకాస్ పౌలీతో యుకీ ఢీకొట్టనున్నాడు. మరో పక్క వయసు మీద పడుతోన్న కొద్దీ ఆటలో పదును పెంచుకుంటూ పోతున్న స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్.. తొలి రౌండ్‌లో బై లభించటంతో నేరుగా రెండో రౌండ్లో ఆడనున్నాడు. భారత డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జతగా.. ప్రీ క్వార్టర్స్‌లో స్థానంకోసం మరో అన్‌సీడెడ్ జంటతో నేడు తలపడనున్నాడు.

మహిళల సింగిల్స్‌లో మాజీ ప్రపంచ నెంబర్ వన్, రష్యా సుందరి మరియా షరపోవా తొలి రౌండ్లోనే వెనుదిరిగింది. జపాన్ టాప్ టెన్నిస్ క్రీడాకారిణి నయోమి ఒసాక చేతిలో 4-6, 4-6తో పరాజయం పాలైంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.